www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 199 | మంగళవారం | 8 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



మరో చరిత్ర

ఆస్ట్రేలియా గడ్డపై చరిత్ర సృష్టించిన టీమిండియా

ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలవాలనే టీమిండియా కల నెరవేరింది. 72 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం భారత జట్టు ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌ను గెలుచుకుంది. ఇరు జట్ల మధ్య సిడ్నీ వేదికగా జరిగిన చివరి మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 2-1 తేడాతో సొంతం చేసుకుంది. ఒక ఆసియా జట్టు ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలవడం ఇదే ప్రథమం. కోహ్లి సేన ఈ ఘనత సాధించిన తొలి ఆసియా జట్టుగా చరిత్ర సృష్టించింది.


11

అగ్రవర్ణాలలో పేదలకు 10%



రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ

- బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- నేడు లోక్‌సభకు
- వార్షికాదాయం రూ.8లక్షలు, 5ఎకరాల లోపు భూమి ఉన్నవారికి వర్తింపు



రాజ్యాంగ సవరణ ఆమోదం పొందితే 60 శాతానికి పెరగనున్న కోటా

న్యూఢిల్లీ: దేశంలోని అగ్రవర్ణాలలోని పేదలకు కేంద్ర ప్రభుత్వం పదిశాతం రిజర్వేషన్లను కల్పించనుంది. జనరల్ కేటగిరిలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి ఉద్యోగాలు, విద్యాసంస్థలలో 10 శాతం కోటాను తలపెట్టారు. ప్రధాని మోడీ అధ్యక్షతన సోమవారం జరిగిన కేంద్ర మంత్రిమండలి భేటీలో ఈ నిర్ణయాన్ని ఆమోదించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వార్షికాదాయం రూ 8 లక్షలు, ఐదెకరాల భూమి కన్నా తక్కువ స్థాయిలో ఉండే జనరల్ కేటగిరి వారికి ఈ కోటా కల్పిస్తారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం అత్యంత వ్యూహాత్మకంగా అగ్రవర్ణాల పేదలకు ఈ రిజర్వేషన్లను కల్పిస్తోందని విశ్లేషిస్తున్నారు. ఈ జనరల్ కేటగిరి కోటాకు అనివార్యం అయిన రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. మంగళవారం పార్లమెంట్ శీతాకాల సెషన్ ముగుస్తుంది. రాజ్యాంగంలోని 15, 16 అధికరణలను సవరిస్తేనే ఈ కోటా అమలుకు వీ లేర్పడుతుంది. దీనిని మూడింట రెండొంతుల తరువాయి 6లో



సిఎం కెసిఆర్‌ను కలుసుకున్న స్టీఫెన్‌సన్

నామినేటెడ్ ఎంఎల్‌ఎగా స్టీఫెన్‌సన్

- మంత్రివర్గం నిర్ణయం
- ఎంఎల్‌ఎలతో పాటే ప్రమాణ స్వీకారం
- గంగా జమునా తహజీబ్‌కు తెలంగాణ ప్రతీక

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్ర శాసనసభలో ఆంగ్లో ఇండియన్ కేటగిరీ తరపున నామినేటెడ్ ఎంఎల్‌ఏగా ఎల్విస్ స్టీఫెన్‌సన్‌ను నియమించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. గత శాసనసభలో నామినేటెడ్ తరువాయి 6లో





అఖండ విజయానికి స్వీట్లేవీ?

- ఢిల్లీలో పార్టీ స్థలం కోసం కలిసిన టిఆర్‌ఎస్ ఎంపిలతో ప్రధాని
- త్వరితగతిన అనుమతి ఇవ్వాలని వినతిపత్రం సమర్పించిన ఎంపిలు

మన తెలంగాణ/హైదరాబాద్

పార్లమెంటు ఉభయ సభల్లో పదిహేడు మంది ఎంపిలు ఉన్నందున తమ పార్టీకి కార్యాలయ అవసరాల నిమిత్తం స్థలాన్ని కేటాయించాల్సిందిగా ప్రధాని నరేంద్రమోడీకి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఎంపిలు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున ప్రధానమంత్రిని ఆయన ఛాంబర్‌లో తరువాయి 6లో

మిషన్ ఇరిగేషన్

ప్రాజెక్టుల సత్వర పరిపూర్తికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సిఎం ఆదేశాలు

- కోటి ఎకరాలకు సాగునీరివ్వడం లక్ష్యం, కాళేశ్వరానికి అత్యంత ప్రాధాన్యం, ఆ పద్ధతిలోనే పాలమూరు-రంగారెడ్డి
- యుద్ధప్రాతిపదికగా చెరువులు నింపాలి
- పనులు జాప్యం చేసే ఏజెన్సీలను మార్చండి
- 6గంటలపాటు జరిగిన ప్రగతిభవన్ సమీక్షలో సిఎం కెసిఆర్



మన తెలంగాణ/ హైదరాబాద్

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పరుగులు పెట్టేలా ప్రస్తుతం సాగుతున్న పనులను సత్వరం పూర్తి చేసేలా విధి విధానాలను రూపొందించాలని సాగునీటిపారుదల శాఖతో పాటు వివిధ శాఖల అధికారులను ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించారు. రాష్ట్రంలోని కోటి ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా గోదావరి, కృష్ణా నదుల్లో రాష్ట్రానికి ఉన్న వాటాను సద్వినియోగం చేసుకునేలా వ్యూహాన్ని రూపొందించి అమలుచేయాలన్నారు. ప్రగతి భవన్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో ముఖ్యమంత్రి కెసిఆర్ సోమవారం సాయంత్రం ఆరు గంటల పాటు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలోనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కూడా పరుగులు తీయాలని, అనుకున్న తీరులో సకాలంలో పనులు చేయని వర్క్ ఏజెన్సీలను మార్చాలని ఆదేశించారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తేనే ప్రాజెక్టులన్నీ పూర్తి తరువాయి 6లో

7

కలపకు కనురెప్ప

కలప స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం

17న గం. 11.30కి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం 7

కుంచెపోటు



కేంద్రంలో హంగే

ప్రభుత్వం ఏర్పాటులో కీలకం కానున్న ప్రాంతీయ పార్టీలు

- త్వరలో ఆసరా రూ. 1000నుంచి 2000లకు
- ఆంగోతుభవన్ నాయక్ టిఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా పార్టీ వైస్ ప్రెసిడెంట్ కెటిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు ప్రభుత్వాన్ని స్థాపించేంత సంఖ్యలో సీట్లు రావని, 'హంగ్' తప్పదని, ఏ జాతీయ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా ప్రాంతీయ పార్టీల మద్దతు అనివార్యమని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు వ్యాఖ్యానించారు. కేంద్ర రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల హవా ఈసారి ఫలితాల తర్వాత స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. అందువల్లనే రాష్ట్రంలోని 16 పార్లమెంట్ స్థానాల్లోనూ టిఆర్‌ఎస్ విజయం సాధించాలని అన్నారు. అప్పుడే కేంద్రాన్ని శాసించే స్థాయికి తెలంగాణ ఎదుగుతుందన్నారు. టిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులంతా పార్లమెంట్ స్థానాల్లో భారీ మెజారిటీతో అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నాగార్జున సాగర్ తరువాయి 14లో

ఎదిగిన కొద్దీ ఒదగాలి



ఎంఎల్‌ఎ కోరుకంటి చందర్ టిఆర్‌ఎస్‌లో చేరి కెటిఆర్‌కు పాదాభివందనం చేస్తున్న దృశ్యం

తొలి రోజు పంచాయతీ నామినేషన్లు 3030 7

ఉత్తమ్‌కు నన్ను సస్పెండ్ చేసే దమ్ము లేదు: సర్వే

"పార్టీని నిండా ముంచిన ద్రోహులు ఉత్తమ్, కుంతియా"



మన తెలంగాణ/సోమాజిగూడ: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానానికి తప్పుడు నివేదికలు ఇచ్చి పార్టీని నిండా ముంచిన ద్రోహులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కుంతియాలేనని మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ఎన్నికల్లో కోట్లు తీసుకుని అనామకులకు టికెట్లను అమ్ముకుని కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేశారని దుయ్యబట్టారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్ళుగా పార్టీని నమ్ముకుని ఒక సేవకుడిగా సేవ చేస్తున్న తనను పార్టీనుంచి సస్పెండ్ చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సోనియమ్మ దీవెనలతో ఎన్నో పదవులను కట్టబెట్టారని గుర్తు చేశారు. నన్ను కాంగ్రెస్ పార్టీ నుంచి తొలగించాలంటే భావి ప్రధాని రాహుల్ గాంధీ, సోనియాగాంధీలకే సాధ్యమని, బచ్చా ఉత్తమ్ కుమార్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఉమ్మడి తరువాయి 6లో

బావర్చి హోటల్ సీజ్ 7

వంట నూనెకు దిగుమతులే దిక్కు

- 2025 నాటికి 30 మిలియన్ టన్నులకు చేరనున్న వినియోగం
- దిగుమతులకే రూ.65 వేల కోట్లు
- అంతర్జాతీయ మార్కెట్ వల్ల ధరల్లో హెచ్చు తగ్గులు



మన తెలంగాణ/హైదరాబాద్: అటు దేశంలో.. ఇటు రాష్ట్రంలో భవిష్యత్‌లో వంట నూనెలకు కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే దిగుమతులపై ఆధారపడగా, రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. వినియోగం విపరీతంగా పెరగడమే ఇందుకు కారణం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏడాదికి 21 మిలియన్ టన్నుల వినియోగిస్తున్నారు. ఒక్క మనిషి ఏడాదికి 16 కిలోల వంట నూనెను వినియోగిస్తున్నారు. ఇది 2025 నాటికి 30 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా. అంటే కేవలం 6 సంవత్సరాల కాలంలోనే 9 మిలియన్ టన్నులు పెరగనుంది.

ఇటీవల రాష్ట్ర ఆయిల్ ఫెడ్, ఆయిల్ పామ్ మద్ధతు ధర పెంపునకు కేంద్ర ప్రభుత్వ సంస్థ సిఎసిపికి సమర్పించిన నివేదికలోని గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. దేశంలో, రాష్ట్రంలో తగ్గినంతగా ఆయిల్ పామ్, నూనెగింజల ఉత్పత్తి లేకపోవడంతో దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. విదేశాల నుంచి మన తెలంగాణకు వంట నూనెలు వరద మాదిరి దిగుమతి అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పొద్దుతిరుగుడు, పామాయిల్ నూనెల అమ్మకాలే అధికంగా ఉన్నాయి. మలేషియా, ఇండోనేషియా మార్కెట్లలో పామాయిల్ ధరల పతనం అధికంగా ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాలు ముడి పామాయిల్ కన్నా శుద్ధి చేసుకుంటున్న దానినే అధికంగా దిగుమతి చేసుకుంటున్నాయి. అక్కడ ధరల ఆధారంగానే ఇక్కడ వంట నూనెల రేట్లు ప్రభావితం అవుతున్నాయి. అలాగే మన రూపాయి క్షీణత, దిగుమతి సుంకం కూడా ధరలపై ప్రభావం చూపుతోంది. వంట నూనెపై దిగుమతి సుంకాన్ని కేంద్రం 60 శాతానికి పెంచింది. దాంతో దిగుమతులు ఖరీదైనవిగా తయారయ్యాయి. ప్రస్తుతం మలేషియాలో టన్ను పామాయిల్ ధర రూ.35,379 గా ఉంది. గత రెండు రోజుల్లో రూ. ఒక వెయ్యి తగ్గింది.

దేశంలో వంట నూనెలకున్న గిరాకీలో దాదాపు 60 శాతం భాగాన్ని దిగుమతి చేసుకుంటున్నారు. నూనె గింజల కనీస మద్దతు ధర కూడా పెరగడం, రూపాయి మారకం విలువ క్షీణిస్తే దేశీయ ధరలు పెరిగే అవకాశం ఉంది. పండుగ సీజన్‌లో ఉండే పటిష్టమైన డిమాండ్ వల్ల కిలో ధర మరో రూ. 3 రూపాయల నుంచి రూ.5 రూపాయల వరకు పెరుగుతుందని అయితే అంతర్జాతీయ విపణిలో తగ్గితే ఇక్కడ హెచ్చు తగ్గులు ఉంటాయని ఒక వంట నూనెల కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ అన్నారు. విజయ బ్రాండ్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం నెలకు 1300 నుంచి 1500 టన్నుల పామాయిల్, మరో 800 నుంచి 1000 టన్నులు పొద్దుతిరుగుడు నూనెను విక్రయిస్తోంది. వేరుశనగ అమ్మకాలు 400 టన్నుల వరకే ఉంది. గత రెండేళ్లలో సోయాచిక్కుడు పంట సాగు, దిగుబడి తగ్గడంతో మళ్లీ దిగుమతుల పైనే ఆధారపడాల్సి వస్తోంది.

కీసరగుట్ట ఆలయ చైర్మన్‌గా నారాయణశర్మ ప్రమాణం

మన తెలంగాణ/కీసర: కీసరగుట్ట శ్రీభవాని శివదుర్గా సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా సోమవారం తటాకం నారాయణ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతి ఏటా ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్న కీసరకు చెందిన తటాకం కుటుంబ సభ్యులలో ఒకరు ఏడాది పాటు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆలయ సహాయ కమిషర్, ఇఓ కె.లక్ష్మీ నర్సింహ్మా మూర్తి రమేష్ శర్మచే ప్రమాణ స్వీకారం చేయించారు. భక్తులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో రమేష్ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. మరోసారి ఆలయ అర్ధ మండపంలో స్వామి వారి సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన దేవాదాయ నియమ నిబంధనలకు అనుగుణంగా తన విధులు నిర్వర్తిస్తానని రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం ఇప్పటి వరకు చైర్మన్‌గా వ్యవహరించిన తటాకం రమేష్ శర్మ నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నారాయణ శర్మ దంపతులను వేద మంత్రోచ్ఛరణల మధ్య సత్కరించి బాధ్యతలు అప్పగించారు.

నేటి ఉదయానికల్లా స్వగ్రామాలకు మృతదేహాలు

అయ్యప్ప భక్తులకు పోస్టుమార్టం పూర్తి

మన తెలంగాణ/మెదక్/నర్సాపూర్ : తమిళనాడులోని పుదుకొట్టై వద్ద ఆదివారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో చనిపోయినవారి మృతదేహాలు మంగళవారం ఉదయం వరకు వారివాAరి స్వగ్రామాలకు చేరుకోనున్నాయి. టెంపోట్రావెలర్‌ను కంటైనర్ ఢీకొన్న ఘటనలో నర్సాపూర్ మండలం ఖాజీపేటకు చెందిన బోయినికుమార్(22), నాగరాజు (35), మహేష్(24),మంతూర్‌కు చెందిన శివ సాయిప్రసాద్(21), శ్యామ్‌సుందర్‌గౌడ్(23), రెడ్డిపల్లికి చెందిన నక్క అంజనేయులు(42), అంబర్‌పేటక్రిష్ణ(35),చిన్నచింతకుంటకు చెందిన ప్రవీణ్‌గౌడ్(24), సురేష్(24),హైదరాబాద్ పేట్‌బషీర్‌బాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ రాజేష్‌గౌడ్(26) చనిపోగా మరో ఐదుగురు గాయపడిన విషయం విధితమే. ప్రమాద విషయం తెలిసినవెంటనే నర్సాపూర్ సీఐ సైదులు, తహసీల్దార్ భిక్షపతి, టిఆర్‌ఎస్ ఉమ్మడి మెదక్‌జిల్లా అధ్యక్షుడు మురళిధర్ యాదవ్ హుటాహుటీన ఆదివారం సాయంత్రమే సంఘటన స్థలానికి తరలివెళ్ళారు. శవ పంచనామ అనంతరం ప్రమాదంలో చనిపోయిన పదిమంది మృతదేహాలకు సోమవారం పుదుకొట్టై ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మాజీ మంత్రి హరీష్‌రావు, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి తమిళనాడు ప్రభుత్వ అధికారులతో మాట్లాడి మృతదేహాలను తీసుకువచ్చేందుకు ఒక్కో మృతదేహానికి ఒక్కో అంబులెన్స్ ఏర్పాటు చేశారని మురళిధర్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం 4గంటలకు పుదుకొట్టై నుంచి అంబులెన్సులు బయలుదేరాయని మంగళవారం ఉదయం 8గంటల వరకు చిన్నచింతకుంట, రెడ్డిపల్లి, మంతూర్, ఖాజీపేట గ్రామాలకు అవి చేరుకుంటాయని మురళిధర్‌యాదవ్ చెప్పారు. ప్రమాద ఘటనలో ఐదుగురు గాయపడగా అందులో చికిత్స తర్వాత కోలుకున్న నరేష్ స్వగ్రామానికి తిరుగు ప్రయాణం కాగా ముగ్గురు పుదుకొట్టై మెడికల్ కాలేజీలో , ఒకరు తంజావూరు మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నట్లు ఆయన వివరించారు.

గోల్డెన్ వెల్ఫేర్ కార్డు పేరుతో మోసం


మన తెలంగాణ/చాంద్రాయణగుట్ట : 'గోల్డెన్ వెల్ఫేర్ కార్డు' పేరుతో బోర్డు తిప్పేసిన ఒక వ్యక్తిపై ఛత్రినాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.విద్యాసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమా, జంగమ్మెట్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్ అమ్జద్ అనే వ్యక్తి జంగమ్మెట్ ప్రాంతంలో విన్జీ వెల్ఫేర్ సొసైటీ పేరుతో మైనార్టీ మహిళల నుంచి సభ్యత్వ నమోదు పేరుతో డిపాజిట్లు సేకరించారు. దాదాపు వంద మంది మహిళలు గోల్డెన్ వెల్ఫేర్ కార్డు కోసం వంద రూపాయలు చెల్లించారు. కార్డు కలిగిన వారికి ఉచిత విద్య, ఆరోగ్యబీమా, ఇతర మైనార్టీ సంక్షేమపథకాలు పొందవచ్చని నిమ్మిం చాడు. అయితే వంద మందిలో పది మందికి మాత్రమే కార్డులు ఇచ్చి లబ్ధి చేకూరస్తుండటంపై అనుమానం వచ్చిన కొందరు మహిళలు అతని కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై హరిభూషన్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి అమ్జద్ కోసం గాలిస్తున్నారు.

10 శాతం రిజర్వేషన్లు ఎలా సాధ్యం?: శ్రీధర్‌బాబు

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలోని అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు శ్రీధర్‌బాబు తప్పుపట్టారు. ఈ రిజర్వేషన్లు ఎలా సాధ్యం అవుతాయో ప్రధాని నరేంద్ర మోడీ చెప్పాలని డిమాండ్ చేశారు. నాలుగున్నర సంవత్సరాలుగా అగ్రవర్ణాల రిజర్వేషన్ల కోసం పట్టించుకోని నరేంద్ర మోడీ కేవలం పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే నిర్ణయం తీసుకున్నారని సోమవారం నాడిక్కడ వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లో శ్రీనివాస కల్యాణం రద్దు

మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి: టిటిడి శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరగాల్సిన శ్రీనివాస కల్యాణాన్ని టిటిడి రద్దు చేసింది.టిటిడి 2018, అక్టోబరు 28న ఆర్గనైజర్ కేటగిరి కింద శ్రీ దత్తగిరి మహరాజ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించాలని నిర్ణయించింది.



అర్జునుడిలో అసూయ ఉంది

చినజీయర్ స్వామీజీ

మనతెలంగాణ/సిటీబ్యూరో : ''శరణాగత వత్సల:'' రాముడిని వేడుకుంటే చాలా ఎన్ని తప్పులు జరిగినా క్షమించేస్తాడు అని సీతమ్మ రామాయణంలో తెలిపిందని ప్రముఖ ఆద్యాత్మిక గురువు చినజీయర్ స్వామీజి చెప్పారు. నగరంలోని నందగిరిహిల్స్‌లో మైహోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో సోమవారం ఆయన తన ప్రవచనాలను వినిపించారు. ''తేనమైత్రి భవతుతే ఇది జీవితుమిచ్చసి'' నీవు బ్రతుకాలంటే రాముడిని శరణాగతిని వేడుకోవాల్సిందే నని ఆయన తెలిపారు. కృష్ణుడు వద్ద ఉండే రెండు స్వభావంలను విభూషణుడి వద్ద తను చూపించిన స్వభావం, అర్జునుడి దగ్గర తను చూపించినటువంటి స్వభావంలను గమనించవచ్చునని, అలాగే రాముడి స్వభావంను వివరిస్తూ విభూషణుడు తన వద్దకు వచ్చి శరణు కోరినప్పుడు రాముడు తన వద్ద ఉన్న సుగ్రీవ, అంగదా, జాంబవాన్ వంటి వానరులందరినీ అడిగాడని, కానీ, వీరెవ్వరూ అంగీకరించకపోయినా, సుగ్రీవుడినే పంపించి విభూషణుడిని తమ వర్గంలో చేర్చుకున్నాడని, ఆశ్రయులతో రాముడు ఎలా వ్యవహరించాడనేది ఆయన వెల్లడించారు. అర్జునుడు కొంత అహంకారి, విభూషణుడి అంత నిష్ఠలేనివాడని, ''తన్‌మే క్షేమ తరంభవేత్'' అని అర్జునుడిలో అసూయ, రాజప్రవృత్తి, అహంకారం ఉన్నదని జీయర్ స్వామీజి తెలిపారు. భగవంతుడు ఎప్పుడైనా తనకు అనుకూలంగా ఉన్న వారితో అంతకన్న సన్నిహితంగా ఉంటాడని, కాలం కూడా మనల్ని నియంత్రిస్తుందని, మనం కాలానికి లొంగి బ్రతుకుతున్నామని, భగవంతుడు కూడా కాలానికి అనుగుణంగా వ్యవహరించాల్సిందేనని, యమధర్మరాజుకు 'కాలుడు' అని కాలాన్ని నియంత్రించేవాడు కాలుడు అని పేరని ఆయన వివరించారు. ''రామో ద్విర్నాభి భాషతే'' రాముడికి రెండు మాటలుండవని, శాస్త్రమేమి చెబుతుందో దానిని పాటిస్తాడని, ఎవరైతే శాస్త్రమును అతిక్రమించి బ్రతుకుతాడో ఎవడైనా కావచ్చును కూడా శాస్త్రాన్ని అతిక్రమించవచ్చనేది లేదని, భగవత్సన్నిధానానికి చేరిన తదుపరి అక్కడ శాస్త్రం వర్తించదని ఆయన తెలిపారు. 23 పాశురంలో ప్రకృతి సౌందర్య శక్తిని నిరూపిస్తుందని, మనస్సులోపల ఉన్నదానిని కారణం, బయటకు వచ్చేదానిని కార్యం అని అంటారని, కనిపించే ఈ విశ్వమంతా శూన్యం నుండే వచ్చిందని, ఇదంతా మాయా కల్పితమైనటువంటిదని, ఇదంతా కల లాంటిది అందుకే ఇది కల్ల యని జీయర్ స్వామీజి వెల్లడించారు. నేత్రాల్లో దోషాలున్నవారికి వేదాల్లోని సారం కనిపించలేదని, లేనిదాంట్లోంచి ఉన్నవి రావని, ఉన్నదాంట్లోంచే ఉన్నవి, కనిపించనివి సూక్ష్మ దశ, కనిపించేవి స్థూల దశ అని ఆయన తెలిపారు. 23వ రోజు నిర్వహించిన ఉత్సవాల్లో తిరుప్పావై, తీర్థ గోష్టి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



దత్తాత్రేయవన్నీ అబద్ధాలే



మనతెలంగాణ/హైదరాబాద్: మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు కేంద్రం నిధులు మంజూరు చేయలేదని కేంద్రమాజీ మంత్రి దత్తాత్రేయకు తెలియదా అని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ ప్రశ్నించారు. టిఆర్ఎస్ భవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ నీతి ఆయోగ్ ప్రతిపాదించిన రూ.24 వేల కోట్లు ఇచ్చేదిలేదంటూ కేంద్ర మంత్రి పార్లమెంట్‌లో ప్రకటించినప్పటికీ దత్తాత్రేయ అమాయకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్రప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదని అనేక పర్యాయాలు చెప్పినప్పటికీ దత్తాత్రేయ పదేపదే అబద్దాలు ఆడుతున్నారని అరోపించారు. అలాగే దత్తాత్రేయ తెలంగాణ అభివృద్ధి కోసం రూ.50 వేల కోట్లు ఇచ్చామనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లు మినహా ఒక్క రూపాయి కూడా అదనంగా కేంద్రం నుంచి రాలేదని కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. కేంద్రం నిధులు మంజూరు చేయకున్నా ప్రాజెక్టుల పనులు ఆగకుండా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర నిధులపై బహిరంగ చర్చకైనా తాను సిద్ధంగా ఉన్నానని దత్తాత్రేయకు సవాల్ విసిరారు. రాజ్యాంగంపై నమ్మకంలేని బిజెపి అబద్దాలు కూడా ఆడటం నేర్చుకుందన్నారు. మతాన్ని నమ్ముకుని రాజకీయాలు చేయవద్దని ఆయన బిజెపికి సూచించారు. శాసనసభ్యుడు రాజా సింగ్ చేసిన వ్యాఖ్యానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రధానిది ఎన్నికల గిమ్మిక్కు : తమ్మినేని

క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



మన తెలంగాణ/హైదరాబాద్ : అగ్రవర్ణాల్లోని పేదలకు విద్యా, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్ చేసిన నిర్ణయాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తోందని రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రవర్ణాలలోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని, కర్పూరీ ఠాకూర్ ఫార్ములాను అమలు చేయాలని సిపిఐ(ఎం) ఎప్పటి నుంచే డిమాండ్ చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటివరకు దాని ఊసే ఎత్తకుండా ఎన్నికలకు ముందే ఈ నిర్ణయాన్ని ప్రకటించడం ఎన్నికల జిమ్మిక్కుగా స్పష్టమవుతుందన్నారు.

కేంద్ర నిర్ణయానికి బిజెపి హర్షం

మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ బిజెపి రాష్ట్ర శాఖ హర్షించింది. దీనిని స్వాగతిస్తున్నామని పేర్కొన్నది. అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల అందరికి సమాన అవకాశాలు కలుగుతాయని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్‌డిఏ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ హయాంలోనే ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేకంగా కమిషన్ వేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఇటీవల 50 శాతం మించకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ రిజర్వేషన్ల పెంపు ద్వారా రాజ్యాంగ సవరణకు అవకాశం ఏర్పడిందన్నారు. మోదీ ప్రభుత్వం అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

నేడు సన్మాన్ అవార్డుల ప్రదానోత్సవం

మన తెలంగాణ/హైదరాబాద్: ఆకృతి వస్త్ర స్వచ్ఛంధ సంస్థ మంగళవారం సన్మాన్ 2019 అవార్డులను ప్రదానం చేయనుంది. హైదరాబాద్‌లోని మదాపూర్‌లో ఉన్న ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎంపిక చేసిన హస్త కళ నిపుణులకు తామ్ర పత్రాలను అందజేయడంతో పాటు తగిన నగదు పారితోషికం అందించనున్నాయి. ఇదే సందర్భంలో తెలంగాణ హస్త కళల మండలి, ఆకృతి వస్త్ర సంస్థ హస్తకళలు, టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్‌ను కూడా ప్రారంభించనున్నారు. హస్త కళ నైపుణ్యం కలిగిన వారిని, చేనేత కార్మికులను ప్రోత్సాహించేందుకు ఈ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ హస్త కళ మండలి కమిటీ మెంబర్ ఎన్. విజయ లక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

10 నుంచి జూనియర్ కళాశాలల అఫిలియేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ

మనతెలంగాణ/హైదరాబాద్ : 2019–20 విద్యాసంవత్సరానికి ప్రైవేట్ జూనియర్ కళాశాలల అఫిలియేషన్, అదనపు సెక్షన్ల కోసం యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి డాక్టర్ ఎ.అశోక్ తెలిపారు. ఈ నెల 10 నుంచి ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో అఫిలియేషన్ ఫీజు చెల్లించవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు, ఫీజు చెల్లింపులను తిరస్కరించనున్నట్లు స్పష్టం చేశారు. జనవరి 31 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తుతోపాటు అవసరమైన పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. రూ. వెయ్యి అపరాధ రుసుంతో ఫిబ్రవరి 12 వరకు, రూ.3 వేల అపరాధ రుసుంతో ఫిబ్రవరి 25 వరకు, రూ.5 వేల అపరాధ రుసుంతో మార్చి 8 వరకు, రూ.10,000 అపరాధ రుసుంతో మార్చి 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నేరుగా ప్రధాన కార్యాలయంలో సమర్పించే దరఖాస్తులు తిరస్కరిస్తామని అన్నారు. 2019–20 విద్యాసంవత్సరానికి సంబంధించి సొసైటి పేరు మార్పు, కళాశాల పేరు మార్పు, కళాశాల బదిలీ వంటి అభ్యర్థనలు అఫిలియేషన్ ప్రతిపాదనలతోపాటు సమర్పించాలని తెలిపారు. మార్చి 20 తర్వాత తర్వాత ఎట్టి పరిస్థితుల్లో ఈ అభ్యర్థలను స్వీకరించమని స్పష్టం చేశారు.

సిఎం దార్శనికత వల్లనే 24 గంటల కరెంట్

విద్యుత్ రంగంలో ఎన్నో అంశాలలో పురోగతి సాధించాం • తుపాను వచ్చినా కరెంట్ పోకూడని స్థాయికి ఎదిగినప్పడే నిజమైన విజయం

• భవిష్యత్తు సవాళ్లవైపు ఉద్యోగులు దృష్టి సారించాలి • తెలంగాణ ఎలక్ట్రిసిటి ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణలో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

మనతెలంగాణ/ హైదరాబాద్ : ముఖ్యమంత్రి దార్శనికత, జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి కార్యదక్షత, ఉద్యోగుల సమర్థత...ఈ మూడింటి కలబోతనే ఈ రోజు తెలంగాణలో 24 గంటల విద్యుత్ ఉన్నదని కాలర్ ఎగురేసుకుని చెప్పుకునే పరిస్థితి ఉందని టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. గృహాలు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. సోమవారం మింట్ కాంపౌండ్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటి ఇంజనీర్స్ అసోసియేషన్(టిఇఇఎ) 12వ ఆవిర్భాల ఉత్సవాలకు కెటిఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిఇఇఎ 2019 డైరీ, క్యాలెండర్‌ను కెటిఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరిస్తామని కెటిఆర్‌తో కలిసి ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ.. రెండవసారి తాము అధికారంలోకి వచ్చామంటే సిఎం కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పాత్ర ఎంతైతే ఉన్నదో..అంతే స్థాయిలో నిరంతరాయ విద్యుత్ సరఫరా పాత్ర ఉందని అన్నారు. కరెంట్ లేనిదే ఈ రోజు ప్రపంచం లేదని అన్నారు. మన జీవితం విద్యుత్ చుట్టూ పరిభ్రమిస్తుందని అందరూ అంగీకరించన తప్పని పరిస్థితి అని పేర్కొన్నారు. గతంలో పరిశ్రమలకు వారానికి మూడు రోజులు పవర్ హాలిడేస్ ఇస్తే పరిశ్రమలు నడుపుకోలేక పారిశ్రామిక వేత్తలు ఇందిరాపార్కు దగ్గర ధర్నా చేసిన దుస్థితి తలెత్తిందని గుర్తు చేశారు. సబ్ స్టేషన్ల ముందు ధర్నాలైతే లెక్కనే లేదని, తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చాలా సందర్భాలలో సబ్ స్టేషన్ల ముందు ధర్నా చేశామని చెప్పారు. కరెంట్ కోతల వల్ల



విద్యుత్ సబ్ స్టేషన్లలో ఎక్కడికక్కడ కుర్చీలు పగిలేవని, అద్దాలు పగిలేవని అన్నారు. అక్కడ పనిచేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో ఉండేదని అన్నారు. చివరకు ఏదైనా గ్రామంలో ఎవరైనా చనిపోతే స్నానాల చేసుకోవడానికి అర్ధగంట కరెంట్ ఇవ్వండి అని అడుక్కోవాల్సిన దుస్థితి ఉండేదని పేర్కొన్నారు. ఎక్కడి నుంచి ఎక్కడి వచ్చామో ఒక్కసారి ఆలోచించుకోవాలని చెప్పారు. విద్యుత్ రంగంలో తెలంగాణ ఎన్నో అంశాలలో పురోగతి సాధించామని కెటిఆర్ వ్యాఖ్యానించారు.

సవాళ్లవైపు దృష్టి సారించాలి

విద్యుత్ రంగంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూనే రాబోయే సవాళ్ల వైపు దృష్టి సారించాలని అన్నారు. తాను పరిశ్రమల మంత్రిగా ఉన్న సమయంలో పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నించినప్పుడు కరెంట్‌కు సంబంధించిన అంశాలే అడిగేవారని చెప్పారు. రానురాను పెట్టుబడులు ఆకర్షించే క్రమంలో రాష్ట్రాల మధ్యనే పోటీ లేదని, దేశాల మధ్య పోటీ ఉందని వ్యాఖ్యానించారు. మన రాష్ట్రానికి, ఇతర దేశాలకు కూడా పోటీ ఉందని పేర్కొన్నారు. ఈ సవాల్‌ను ఒక అవకాశంగా మలుచుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారతదేశంలోనే తలసరి విద్యుత్ వినియోగంలో 13 శాతం వృద్ధి రేటుతో తెలంగాణ అగ్రభాగాన ఉందని ఇటీవల పత్రికల్లో చూశామని చెప్పారు.

మార్పులకు అనుగుణంగా వ్యూహాలు

ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్ మీటర్ విధానం వస్తుందని, త్వరలోనే మన దేశంలో కూడా ఆ విధానం వస్తుందని కెటిఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. వినియోగదారుని సంతృప్తిస్థాయికి ముఖ్యమని అన్నారు. ఒక చినుకు పడినా, తుఫాన్ వచ్చినా కరెంట్ పోకుండా తీసుకెళ్లేస్థాయికి మనం ముందుకు పోగలిగితేనే నిజమైన విజయాన్ని సాధించినట్లు అని పేర్కొన్నారు. రాబోయే రెండు మూడు ఏళ్లలోనే తెలంగాణ కోటి ఎకరాల మాగాణం కాబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అప్పుడు విద్యుత్ వినియోగం సమాతరంగా పెరుగుతుందని అన్నారు. కొత్తగా మనం స్థాపిస్తున్న యాదాద్రి, కొత్తగూడెం, మణుగూర్, దామరచెర్ల, భద్రాద్రి విద్యుత్ కేంద్రాలతోపాటు సోలార్ విద్యుత్‌లో వస్తున్న మార్పులు వస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో వచ్చే మార్పులను అనుగుణంగా మన వ్యూహాలను రూపొంచుకుని విద్యుత్ సంస్థలను లాభాల బాటలో నడిచే విధంగా, నష్టాలను తగ్గించుకునే విధంగా దిశగా ప్రయత్నం చేయవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని అన్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా కెటిఆర్ హామీ ఇచ్చారు.

ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి డి.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ, సిఎం కెసిఆర్ పట్టుదల కారణంగానే రాష్ట్రంలోనే 24 గంటల విద్యుత్ సరఫరా అవుతుందని అన్నారు. 2014 ఏప్రిల్ 30వ తేదీన సిఎం కెసిఆర్ ఓటు వేసిన వచ్చి తనను పిలిచి విద్యుత్ సమస్యలపై చర్చించారన్నారు. అదే రోజు తనకు నిరంతర విద్యుత్ సరఫరాకు దిశానిర్ధేశం చేశారని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ ఎంఎల్ఎ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ వస్తే మనకు కరెంట్ ఉండదని అప్పటి ముఖ్యమంత్రి చెప్పారని, కానీ రాష్ట్రం ఏర్పడిన స్వల్పకాలంలోనే ప్రభుత్వం నిరంతరం విద్యుత్ సరఫరా చేసిందని అన్నారు. రాష్ట్రానికి ఇన్ని పరిశ్రమలు రావడానికి కారణం కరెంట్ అని పేర్కొన్నారు. టిఇఇఎ అధ్యక్షుడు శివాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు గోపాల్ రావు, శ్రీనివాస్‌రావు, రఘుమారెడ్డిలతోపాటు విద్యుత్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజయ్యారు.

కోటాపై సుప్రీం తీర్పులు

న్యూఢిల్లీ : రిజర్వేషన్ల కోటాకు సంబంధించి భారత న్యాయస్థానాలు, అందులోనూ ప్రత్యేకించి అత్యున్నత న్యాయస్థానాలు కీలక తీర్పులు వెలువరించి ఉన్నాయి. రిజర్వేషన్లను సమర్థిస్తూ కొన్ని తీర్పులు ఉన్నాయి. ఇదే విధంగా కొన్నింటిలో కోటా అమలు సక్రమంగా సమగ్రంగా జరిగేందుకు మార్గదర్శకాలు వెలువరించారు. అయితే ఈ రిజర్వేషన్ల తీర్పులను తరువాత భారతీయ పార్లమెంట్ చట్టసభలుగా తమకుండే అధికారాల పరిధిలో రాజ్యాంగ సవరణలతో ఈ కోటా తీర్పులను ఆ తరువాతి కరమంలో మార్చివేసింది. అంతేకాకుండా న్యాయవ్యవస్థ ఇచ్చిన రూలింగ్‌లను కొన్ని సందర్భాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘించాయి. వాటి సమగ్ర అమలు ప్రక్రియను బేఖాతరు చేశాయి. రిజర్వేషన్ల కోటాకు సంబంధించి భారతీయ న్యాయస్థానాలు వివిధ దశలలో వెలువరించిన తీర్పులు, వాటి అమలు తీరుతెన్నులు, వాటి ప్రస్తుత స్థితి గురించి ఇప్పుడు ఇక్కడ విశ్లేషించుకుంటున్నాం. అగ్రవర్ణాల పేదలకు పది శాతం కోటాకు కేంద్ర మంత్రి మండలి కీలక నిర్ణయం నేపథ్యంలో ఈ వివరాలకు ప్రాధాన్యత ఏర్పడింది.

సర్కారు దాగుడుమూతలు



1990 సిండికేట్ బ్యాంక్ కోటా కేసు

సిండికేట్ బ్యాంక్ ఎస్‌సి/ఎస్‌టి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కెఎస్ బదాలియా ఇతరులకు కేంద్ర ప్రభుత్వానికి మధ్య కోటా వ్యాజ్యం సాగింది. దీనికి సంబంధించి విచారణల తరువాత అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. బ్యాంకులోని గ్రూప్ ఎ/ క్లాసు–1 అధికారులు (స్కేలు 7 : జనరల్ మేనేజర్ అత్యున్నత స్థాయి వరకూ) పదోన్నతులకు సంబంధించి ఉన్న ఎంపిక విధానంలో రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు చర్యను తప్పుపట్టింది. 1978 జనవరి 1నాటి నుంచి కూడా ఈ విధంగా ప్రమోషన్లను వర్తింపచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులలో పదోన్నతులలో రిజర్వేషన్ల విధానం ఈ తేదీ నుంచి ప్రవేశపెట్టారు. దీని మేరకు ఈ కోటా పద్ధతిని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఈ కీలక తీర్పును సిండికేట్ బ్యాంక్‌లో మొక్కుబడిగా 1993 ఎప్రిల్ వరకూ అమలు చేశారు. అయితే ఈ చారిత్రక మైలురాయి తీర్పును ఇతర బ్యాంకులు, విభాగాలలో అమలు చేయలేదు. ఎస్‌బిఐ, యుకో బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్ వంటి వాటిలో ఎస్‌సి/ఎస్‌టి ఉద్యోగుల సంఘాలు, సంస్థల నాయకత్వం సరిగ్గా లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. తమతమ బ్యాంకులలో ఈ తీర్పును సరిగ్గా అమలు చేయించుకోలేకపొయ్యాయి. అయితే ఈ తీర్పు ప్రాతిపదికన ఇతర చోట్ల పదోన్నతి కల్పనకు వివిధ హైకోర్టులలో పిటిషన్లు దాఖలు అయ్యాయి. అన్ని బ్యాంకులు, పిఎస్‌యులు, ప్రభుత్వ విభాగాలలో సుప్రీంకోర్టు తీర్పు అమలుకు సిండికేట్ బ్యాంకు సంఘం నేత కెఎస్ బదాలియా ఉద్యమించారు. అయితే ఆయనకు సంఘాల నుంచి కానీ సంస్థల నుంచి కానీ మద్దతు దక్కలేదు. రాజకీయ నాయకులు ఆయనకు వెన్నుదన్నులు అందించలేదు. 1992లో సుప్రీంకోర్టు వారు ఇందిరా సావ్నీ ఇతరులు కేంద్ర ప్రభుత్వం మధ్య సాగిన ఎఐఆర్ 1993 కేసులో కోటా అమలుకు సమర్థన తెలిపింది. ఈ తీర్పును పలు రాష్ట్రాలు అమలు చేశాయి.

ఒబిసిలకు ప్రభుత్వోద్యోగులకు ప్రత్యేక ప్రత్యేక కోటా కల్పన అంశం గత ఏడాది ప్రస్తావనకు వచ్చింది. దీనికి సంబంధించి సంపన్న వర్గాలను క్రిమిలేయర్ పరిధికి చేర్చి వారిని కోటా పరిధినుంచి తొలిగించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ తీర్పును తమిళనాడు తప్ప ఇతర రాష్ట్రాలు అమలు చేశాయి. ఇక విద్యా సంస్థలలో ఒబిసిలకు కోటా బిల్లులో ఈ క్రిమీలేయర్ అంశాన్ని ప్రస్తావించలేదు. సుప్రీంకోర్టు పలు దశలలో 50 శాతం కోటా అమలుకు రూలింగ్ ఇస్తూ వస్తోంది. పలు రాష్ట్రాలు పాటిస్తున్నాయి. గత ఏడాది ఒక కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో అగ్రవర్ణాలలోని పేదలకు ప్రత్యేక కోటా కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పును అన్ని రాష్ట్రాలు ఇప్పటి వరకూ అమలు చేస్తున్నాయి.

వివిధ దశలుగా వెలువడ్డ సుప్రీంకోర్టు తీర్పులు

వెలువడ్డ తీర్పు	అమలు తీరుతెన్నులు
1951 కుల ప్రాతిపదికన రిజర్వేషన్ల కల్పన బ్రిటిష్ కాలంలో అగ్రవర్ణాలకు నిర్ధేశించిన కమ్యూనల్ అవార్డు పరిధిలో ఆర్టికల్ 15(1)ను ఉల్లంఘిస్తుంది మద్రాసు రాష్ట్రం వర్సెస్ శ్రీమతి చంపాకం దొరైరంజన్ ఎఐఆర్ 1951 కేసు.	తీర్పు చెల్లనేరనిదిగా పేర్కొంటూ తొట్టతొలి రాజ్యాంగ సవరణ (ఆర్టికల్ 15((4) తీసుకువచ్చారు.
1963 ఎంఆర్ బాలాజీ /మైసూరు ఎఐఆర్ 1963 ఎస్‌సి 649 కేసులో న్యాయస్థానం రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని విధించింది.	తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రం తప్ప అన్ని రాష్ట్రాలూ దీనిని అమలు చేశాయి. గుజ్జర్ల ఉద్యమ హింసాకాండ అనంతర దశలోనూ కోటా 50 శాతం దాటలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 2005లో దీనిని దాటివేసేందుకు యత్నించారు. దీనిని హైకోర్టు కొట్టివేసింది.

ఇబిసికి జనరల్ కోటా ఎన్నికల గిమ్మిక్

- **నాలుగున్నరేళ్లు ఏం చేశారు?**
- **మోడీ ప్రభుత్వ నిర్ణయాన్ని నిలదీసిన కాంగ్రెస్**
- **చరిత్రాత్మకమైన అడుగు : బిజెపి, మిత్రపక్షాలు**
- **కోటా అమలుపై హార్దిక్ పటేల్ అనుమానం**

న్యూఢిల్లీ: ఆర్థికంగా వెనబడిన వర్గాలకు జనరల్ కేటగిరీలో పది శాతం కోటా ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం ఎన్నికల గిమ్మిక్కు అని కాంగ్రెస్ పార్టీ సోమవారం ఆరోపించింది. ఇది ఎన్నికల ముందు బిజెపి చేస్తున్న విన్యాసమని విమర్శించింది. నాలుగేళ్ల ఎనిమిది నెలలపాటు దీనిగురించి ఆలోచించని బిజెపి, ఇంక కొద్ది నెలల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందనగా ఈ నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ దుయ్యబట్టారు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ తెచ్చేందుకు కావలసిన మెజారిటీ ప్రభుత్వానికుందా? అని ఆయన ప్రశ్నించారు. తామేదో ఉద్ధరించామని చెప్పుకోడానికే బిజెపి ఈ నిర్ణయం తీసుకుందని సింఘ్వీ ఆరోపించారు. ఆర్థికంగా వెనకబడిన వారికి ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో జనరల్ కేటగిరీలో పది శాతం రిజర్వేషన్ ను కేంద్ర కేబినెట్ ఆమోదించిందని అధికార వర్గాలు తెలిపాయి.

చరిత్రాత్మకమైన అడుగు

పది శాతం కోటా నిర్ణయం ఒక చరిత్రాత్మకమైన అడుగు అని భారతీయ జనతాపార్టీ, దాని మిత్రపక్షాలు ప్రశంసించాయి. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కల్పించడం సామాజిక న్యాయపరిధిని విస్తృతం చేసేందుకు వేసిన అడుగు...అని బిజెపి ఉపాధ్యక్షుడు వినయ్ సహస్రబుద్ధే కొనియాడారు. సామాజిక మార్పు చరిత్రలో ఇదొక నూతనాధ్యాయాన్ని ఆవిష్కరించిందని బిజెపి జనరల్ సెక్రెటరీ కైలాష్ విజయ్‌వార్గియా చెప్పారు. బిజెపి మిత్రపక్షం ఎల్‌జెపి నాయకుడు రామ్ విలాస్ పాశ్వాన్ కోటా నిర్ణయాన్ని హర్షించారు. వార్షికాదాయం ఎనిమిది లక్షల కంటే తక్కువున్న వారికి ఈ కోటా ఎంతో మేలు చేస్తుంది...అని బిజెపి నాయకుడు, సామాజిక న్యాయం సహాయ మంత్రి విజయ్ సంప్లా అన్నారు.

అమలు చేస్తారా?: హార్దిక్ పటేల్

పటీదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్, గుజరాత్ కాంగ్రెస్ కోటా నిర్ణయాన్ని ప్రశ్నించారు. 'మేము ఈ నిర్ణయాన్ని ఆమోదించం. వ్యతిరేకించం. రాజ్యాంగబద్ధంగా, ఆలస్యం లేకుండా ఈ నిర్ణయాన్ని అమలు చేస్తే మంచిదే. కానీ గుజరాత్‌లో ఇంతకు ముందు ఆనందిబెన్ పటేల్ ప్రభుత్వం ఇచ్చిన లాలీపాప్‌లా ఇది మారకూడదు' అన్నారాయన. ఎన్నికల్లో ఓట్లకు మోడీ వేసిన గాలం అవుతుందేమో...జాగ్రత్త అని హార్దిక్ పటేల్ హెచ్చరించారు.

ఇబిసిలకు రిజర్వేషన్లు

సంపాదకీయం


అగ్రకులాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి పలు కోణాలున్నాయి. వ్యవసాయ రంగం దెబ్బతిన్నందువల్లనో, మెరిట్‌కి ప్రాధాన్యం కరవవుతున్నదనే బాధతోనో, అణగారిన సామాజిక వర్గాలపట్ల గల అక్కసు వల్లనో ఝాట్‌లు, పటేల్‌లు, మరాఠాలు వంటి బలమైన అగ్రవర్ణాలు కోటా ఉద్యమాలతో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టిస్తున్న సందర్భాలు తరచూ తారసపడుతున్నాయి. అల్పసంఖ్యాకులైన మరికొన్ని అగ్రవర్ణాల వారు రిజర్వేషన్ల వల్ల తమ పిల్లలకు తగిన అవకాశాలు రావడం లేదనే అసంతృప్తికి, ఆవేదనకు లోలోపల గురి అవుతున్నారు. ఈ నేపథ్యంలో పై కులాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ బాగా ముందుకు వచ్చింది. అగ్రవర్ణ అనుకూలమైనదిగా ప్రత్యేకత సంపాదించుకున్న భారతీయ జనతా పార్టీకి ఆ వర్గాలు గట్టి ఓటు బ్యాంకుగా కొనసాగుతున్నాయి. అదే సమయంలో వెనుకబడిన తరగతులు సైతం ఆ పార్టీలో బలమైన భాగంగా ఉన్నాయి. అటు అగ్రవర్ణాలను, ఇటు వెనుకబడిన తరగతులను ఒకే ఒరలో కత్తులుగా ఇముడ్చుకొని, కలుపుకొని వారి ఉమ్మడి మద్దతుతో దూసుకుపోతున్న ఆ పార్టీకి బలమైన పునాది హిందుత్వ. మామూలుగా ఈ రెండు వర్గాల మధ్య ఉండే సామాజిక వైరుధ్యం ఆ పార్టీ లోపల అంతగా కనిపించదు.

50 శాతం దాటరాదన్న అనుల్లంఘనీయమైన పరిమితిని సుప్రీంకోర్టు ఇంద్రాసహానీ కేసులో విధించి ఉన్నందున ఇప్పటికే ఈ హద్దు మేరకు కోటా దాదాపు పూర్తిగా అమల్లోకి వచ్చినందున కేంద్రం తలపెట్టిన అగ్ర వర్ణాలకు 10 శాతం కోటాను కలిపితే మొత్తం రిజర్వేషన్లు 60 శాతానికి చేరుకుంటాయి. అది సుప్రీంకోర్టు తీర్పుకి విరుద్ధమవుతుంది. ఈ అడ్డంకిని తొలగించుకోడానికి మొత్తం రిజర్వేషన్ల పరిమితిని 60 శాతానికి పెంచుకోవాలన్న లక్ష్యంతో కేంద్రం ఈ రాజ్యాంగ సవరణ బిల్లును తలపెట్టింది. ఇటువంటి రాజ్యాంగ సవరణ బిల్లులు చట్టం కావాలంటే పార్లమెంటు ఉభయ సభలు విడివిడిగా సమావేశమై మూడింట రెండొంతుల ఆధిక్యంతో ఆమోదం తెలపాలి. కాంగ్రెస్ ఇప్పటికే ఈ బిల్లును ఓట్ల కోసం విసిరిన ఎన్నికల వలగా వర్ణించి తీసిపారేసింది. దీనిని చట్టం చేయించుకోడానికి తగిన సంఖ్యాబలం పార్లమెంటులో బిజెపికి ఉన్నదా అని కూడా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వి ప్రశ్నించారు. బిజెపి అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాల 8 మాసాలయింది, ఇంతవరకు రాని ఆలోచన దానికి ఇప్పుడే ఎందుకు వచ్చిందని అడిగారు. ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగానే తమకు కూడా చట్ట సభల్లో సహా జనాభా దామాషా రిజర్వేషన్లు కావాలని బిసిలు డిమాండ్ చేస్తున్నారు. వెనుకబడిన ముస్లింల, తదితరుల రిజర్వేషన్లు పెంచడానికి తమిళనాడులో మాదిరి 50 శాతానికి మించిన కోటాను కల్పించడానికి వీలుగా రాజ్యాంగ సవరణ చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతున్నది. రిజర్వేషన్లను రాష్ట్రాల అధికార పరిధిలోకి తేవాలని కూడా తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కెసిఆర్ సూచిస్తున్నారు. ఎన్నాళ్లుగానో పెండింగ్‌లోగల మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు అమల్లోకి తేవాలని కోరుతున్నవారు గణనీయంగానే ఉన్నారు. లోక్‌సభలో తమకున్న విశేష సంఖ్యాబలంతో బిజెపి పాలకులు బిల్లును అక్కడ ఆమోదింప చేసుకోగలిగినా రాజ్యసభలో గట్టెక్కడం అత్యంత కష్టసాధ్యమని తెలుస్తూనే ఉన్నది. ఇటీవల ట్రిపుల్ తలాక్ నిషేధం బిల్లు లోక్‌సభలో పాసై రాజ్యసభలో విఫలమైన సంగతి తెలిసిందే.

వాస్తవానికి రాజ్యాంగ కర్తలు దేశంలో తరతరాలుగా పాతుకుపోయి ఇప్పటికీ కొనసాగుతున్న వివక్షాపూరితమైన కుల వ్యవస్థ కారణంగా చదువుకు, ఉద్యోగాలకు దూరమై హీనమైన బతుకులు బతుకున్న ఎస్‌సి, ఎస్‌టిలను, ఇతర వెనుకబడిన తరగతులను దృష్టిలో ఉంచుకొని చేయందించి వారిని పైకి తీసుకురావడానికి సాంఘికంగా, విద్యా విషయికంగా వెనుకబడినవారికే పరిమితం చేసి రిజర్వేషన్లు కల్పించారు. ఇందుకోసం రాజ్యాంగంలోని సర్వ సమానత్వ నిబంధనను సడలించి సానుకూల వివక్ష సూత్రాన్ని ఆశ్రయించారు. అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం కోటా కల్పించాలంటే రాజ్యాంగంలోని సాంఘికంగా, విద్యావిషయకంగా అనే పదబంధాన్ని మార్చి ఆర్థికంగా అనే దానిని కూడా చేర్చవలసి ఉంటుంది. ఇంతటి క్లిష్టమైన నేపథ్యంలో ఈ బిల్లును లోక్‌సభ ఎన్నికల ముందు తీసుకువచ్చి కల్లోల జలాల్లో చేపల వేటకు ప్రధాని మోడీ ఎందుకు తల పెట్టారనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

ఆస్ట్రేలియాలో అద్భుత విజయం

ఆస్ట్రేలియా గడ్డపై క్రికెట్ టెస్ట్ సిరీస్ గెలవడం అంటే చరిత్రను సృష్టించడమే. విరాట్ కోహ్లి కెప్టెన్‌గా ఈ చరిత్ర సృష్టించింది భారత జట్టు. మొత్తం నాలుగు టెస్ట్ మ్యాచులు. రెండు మ్యాచుల్లో విజయం. ఒక మ్యాచ్ ఓడిపోయి, ఒక మ్యాచ్ డ్రాగా ముగించడం. చివరకు మొత్తం సిరీస్ ఇండియా కైవసం. నాలుగు మ్యాచుల్లో రెండు విజయాలతో విజయఢంకా మోగించడం కలా, నిజమా అనే ఫలితమిది. ఈ విజయం తర్వాత భారతదేశం ''బోర్డర్ గవాస్కర్'' ట్రోఫీ నిలబెట్టుకుంది.



ఇది అసాధారణ విజయం ఎందుకంటే, గత 71 సంవత్సరాల కాలంలో అంటే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతి నుంచి ఇప్పటి వరకు ఎన్నడూ ఆస్ట్రేలియా నేలపై భారత జట్టు టెస్ట్ సిరీస్ గెలుచుకున్నది లేదు. ఏడు దశాబ్దాల తర్వాత లభించిన గెలుపు. ఈ గెలుపు సాధించడంలో భారత టీములోని ప్రతి సభ్యుడు తనదైన పాత్ర పోషించారు. ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలిచిన తొలి టీమిండియా కెప్టెన్‌గా విరాట్ కోహ్లి ఆనందానికి అవధుల్లేవు. తర్వాత భారత్ ఆర్మీతో కలిసి హోటల్లో కూడా సంబరాలు చేసుకున్నారు. 'మేరె దేశ్ కీ ధర్తీ' పాటపై కోహ్లి డ్యాన్స్ చేసిన వీడియోను బిసిసిఐ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది

ఈ సిరీస్ సాధించిన కెప్టెన్‌గా విరాట్ కోహ్లి పేరు మారుమోగిపోతుంది. గమనించవలసిన మరో పేరు చేతేశ్వర్ పూజారా. 1258 బంతులను ఎదుర్కొని 521 పరుగులు, మూడు శతకాలతో తన సత్తా చాటిన యువక్రీడాకారుడు. భయంకరమైన ఆస్ట్రేలియా బౌలింగ్ అంత ప్రమాదకరమేమీ కాదని చాటి చెప్పాడు. భారత టెస్ట్ టీములో తన స్థానం కోసం గత కొంతకాలంగా ఫామ్ లేని పూజారా చాలా అవస్థలు పడుతున్నాడు. దక్షిణాఫ్రికాలో సాధించింది కేవలం 100 పరుగులు. యావరేజి 16.66. ఇంగ్లాండులో సాధించింది 278 పరుగులు, యావరేజి 39.71. పూజారా వంటి బ్యాట్స్‌మేన్ సామర్థ్యానికి తగిన పరుగులు కావివి. కాని ఈ సిరీస్‌లో తానేమిటో చాటి చెప్పాడు. 500కు పైబడి పరుగులు, యావరేజి 74.42. విమర్శకులు నోరెళ్ళబెట్టేలా చేశాడు. ఈ సిరీస్ తర్వాత భారత టీములో తన స్థానం పదిలపరచుకున్నాడు.

ఈ సిరీస్‌లో మెరిసిన మరో క్రికెట్ కిరణం మయాంక్ అగర్వాల్. ఇండియాలో జరిగిన అనేక మ్యాచుల్లో పరుగుల వరద సృష్టిస్తున్న ఈ యువకుడు చివరకు ఈ సిరీస్‌లో తన సత్తా అంతర్జాతీయ స్థాయిలో నిరూపించుకున్నాడు. నిజానికి మొదటి రెండు టెస్టుల్లో మయాంక్ పై సెలెక్టర్ల దృష్టి పడనే లేదు. కాని చివరి రెండు టెస్టుల్లో అవకాశం వచ్చింది. పృథ్వీ షా గాయపడడం వల్ల మయాంక్‌ను పిలిచారు. వచ్చిన అవకాశాన్ని మయాంక్ జారవిడవలేదు. కేవలం మూడు సార్లు బ్యాటింగ్‌కు వెళ్ళిన మయాంక్ 195 పరుగులు సాధించాడు. అందులో 70 పరుగులకు మించి సాధించిన స్కోర్లున్నాయి. 65 శాతం యావరేజితో భారతదేశానికి నమ్మకస్థుడైన ఓపెనర్ అని నిరూపించుకున్నాడు. భవిష్యత్తులో మరిన్ని విజయాలకు బాటవేసే క్రీడాకారుడిలా కనిపిస్తున్నాడు.

ఈ సిరీస్‌లో మెరిసిన మరో వజ్రం కుల్దీప్ యాదవ్. భారతదేశం స్పిన్ బౌలింగ్‌కి పెట్టింది పేరు. కాని అంతర్జాతీయ పిచ్‌లపై కుల్దీప్ యాదవ్ రాణిస్తాడా అనే సందేహాల వల్ల అవకాశాలు లభించలేదు. చివరకు నాల్గవ టెస్టులో మాత్రమే అవకాశం దొరికింది. వచ్చిన అవకాశాన్ని వాడుకుని, సిడ్నీలో చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్‌కి ముందు అంతర్జాతీయ మ్యాచుల్లో కేవలం ఒకే సారి ఆడిన అనుభవం ఉంది. 2018లో ఇంగ్లాండ్ టీముపై లారడ్స్ మైదానంలో ఆడాడు. 9 ఓవర్లలో 44 పరుగులిచ్చి నిరాశపరిచాడు. కాని సిడ్నీలో స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా తన ప్రాముఖ్యం చాటి చెప్పాడు. 99 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు భారత టీముకు స్పిన్ బలం మరింత పెరిగింది. రవి చంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా ఇప్పటికే మంచి స్పిన్నర్లుగా పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు కుల్దీప్ వారికి పోటీగా తన ప్రతిభ ప్రదర్శించాడు.

భారత బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ భూమ్రా, ముహమ్మద్ షమీ, ఇషాంత్ శర్మ అద్భుతంగా రాణిస్తున్నారు. గతంలో వెస్టిండీస్‌కి చెందిన మాల్కం మార్షల్, మైకెల్ హోల్డింగ్, జో గార్డర్ త్రయం పేస్ బౌలింగ్‌లో రికార్డులు సృష్టించింది. 34 సంవత్సరాల తర్వాత ఇప్పుడు భారతదేశానికి చెందిన ఈ ముగ్గురు అలాంటి రికార్డులే తిరగరాస్తున్నారు. 70 ఆస్ట్రేలియా వికెట్లలో 48 వికెట్లు ఈ ముగ్గురే పడగొట్టారు.

రిషభ్ పంత్ 2018లో ఇంగ్లాండుతో మొదటిసారి అంతర్జాతీయ సిరీస్ ఆడినప్పుడు స్కోర్ చేసింది కేవలం 27 యావరేజ్. సేనా సిరీస్ అంటే దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్; ఆస్ట్రేలియా దేశాల సిరీస్‌లో సెంచరీ చేసిన మొదటి వికెట్ కీపర్ రిషభ్. కాని స్థిరత్వం లేని ఆటగాడన్న విమర్శలు ఎదుర్కొన్నాడు. వెస్టిండీస్‌పై ఆడుతు వరుసగా 90కి మించిన స్కోరులు సాధించినా టెస్ట్ మ్యాచ్‌కి అవసరమైన నిలకడ లేదన్న విమర్శలు తప్పలేదు. ఈ సారి సిడ్నీలో 159 పరుగులు చేసి తనపై విమర్శలన్నింటికి జవాబు చెప్పాడు. స్థిరంగా ఒక ఇన్నింగ్స్ నిలబెట్టే సామర్థ్యం ఉందని నిరూపించాడు. భారత బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ భూమ్రా, ముహమ్మద్ షమీ, ఇషాంత్ శర్మ అద్భుతంగా రాణిస్తున్నారు. గతంలో వెస్టిండీస్‌కి చెందిన మాల్కం మార్షల్, మైకెల్ హోల్డింగ్, జో గార్డర్ త్రయం పేస్ బౌలింగ్‌లో రికార్డులు సృష్టించింది. 34 సంవత్సరాల తర్వాత ఇప్పుడు భారతదేశానికి చెందిన ఈ ముగ్గురు అలాంటి రికార్డులే తిరగరాస్తున్నారు. 70 ఆస్ట్రేలియా వికెట్లలో 48 వికెట్లు ఈ ముగ్గురే పడగొట్టారు. పేస్ బౌలింగ్ ద్వారా పడిపోయిన వికెట్ల యావరేజ్ 21.62. భారతదేశంలో ఫాస్ట్ బౌలింగ్ భవిష్యత్తులో అద్భుతంగా ఉంటుందన్న ఆశ కలిగిస్తున్నారు. కెప్టెన్‌గా కోహ్లి పద్ధతులు, ఆయన వైఖరి, టెక్నిక్ అన్నీ ఈ మధ్య కాలంలో విమర్శలకు గురయ్యాయి. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ పర్యటనల్లో కోహ్లి కెప్టెన్‌గా తీసుకున్న నిర్ణయాలు, వాటి ఫలితాలను చాలా మంది తీవ్రంగా విమర్శించారు. కాని ఈ సిరీస్‌లో కోహ్లి కెప్టెన్సీ అత్యద్భుతం. ఒక్క పెర్త్ టెస్టులో మాత్రమే పిచ్‌ను అర్థం చేసుకోవడంలో పొరబాటుచేసి, ఫాస్ట్ బౌలింగ్‌తో దాడి చేశాడు. ఆ ఒక్క పొరబాటు తప్ప ఈ సిరీస్‌లో కోహ్లి కెప్టెన్సీలో లోపాలెంచడం కష్టం. ఫీల్డులో తన టీముకు అద్భుతమైన నాయకత్వం అందించాడు. ఇప్పుడు భారత టీము అజేయంగా మారిందంటే అనుమానం లేదు.

* ప్రసేన్ జిత్ దే (ది క్వింట్)

చందమామ కథ కాదు సుమా


చైనాలో జానపద కథలు. పెద్దరాశి పెద్దమ్మ పిట్ట కథలు బోలెడు. వీటిని ఆబాల గోపాలం తమ ప్రాణంలా వింటారు. చందమామ బాగుంది నేడు.. చల్లగాలి బాగుంది చూడు అని పాటలు పాడుకోవడమే కాదు. చందమామ ఎం బాగుంది? దానిలోని వన్నెలేంది? చిన్నెలేంది? చల్లదనం ఏందీ? పిల్లగాలుల్లో రొదలేని సొదల వెనుకాల కథేందీ? అనే జిజ్ఞాస అంతకు మించిన తార్కికత చైనాను ముందుకు దూసుకువెళ్లనిస్తోంది. నాయనమ్మలో, తాతయ్యలో కథలు చెప్పేవారు. అనగనగా ఓ చంద్రుడు. చంద్రుడిలో ఓ రాకాసి కోన. అందులో ఒక బిలం . అందులో కుందేలు. ఆ కుందేలు బయటకు రాలేక, కదలలేక మెదలలేక పడి ఉంటుంది. ముసలమ్మ వస్తుంది....అని కథలను ఓ ఉత్తుత్తి కథలుగా కాకుండా నిజంగా జరిగిన దానిలా చెపుతూ ఉండేవారు. ఇప్పుడు ఈ చందమామ కథను చైనా నిజం చేసింది.

చైనా ఇంతకాలం ప్రపంచానికి తన శక్తి గురించి కథలు చెపుతూ ఉందని తేల్చిగా తీసి పారేస్తున్న దేశాలకు ఇప్పుడు తమ ఛాంగేతో చందమామ ఛేదనతో ముక్కులు పగిలే సమాధానం ఇచ్చి కూర్చుంది. ఛాంగే.. ఛాంగురే బంగారు రాజా.. అంటున్నట్లుగా సాగింది. ఛాంగే ఇది ఇప్పుడు చైనా నుంచి చంద్రుడి ఆవలి వైపునకు దూసుకుపోయి , అక్కడ తిష్టవేసుకుకూర్చున్న వ్యోమనౌక. ఆ ఛాంగే మామూలు ఛాంగేకాదు. అతి శక్తివంతం. చైనీయులు అపురూపంగా, అందంగా ఉండేఊ చంద్రుడిని చీనిలో ఛాంగే అని పిలుస్తారు. ఇప్పుడు చైనావారు తాము బహుదూరపు చందమామ దగ్గరికి పుట్టింటోళ్లు వెళ్లినట్లుగా ఛాంగేతో ఛాంగ్ ఛాంగ్ మంటూ వెళ్లారు. తోడుగా చంద్రుడిలోని నిజాల వెలికితీతకు పనికొచ్చే కుందేలును కూడా తీసుకువెళ్లారు. ఈ కుందేలు కూడా చైనా కథలలోనిదే. చంద్రుడిలో ఉన్నదనే కుందేలుకు ఉన్న పేరు యూతూను ఈ నౌకలోని ఓ భాగానికి పెట్టారు. ఇప్పుడు చంద్రుడిపై చైనా చంద్రుడు ఛాంగే. అందులోని కుందేలు యూతూ యమ చక్కర్లు కొడుతున్నాయి. మానవాళికి ఇప్పటికీ అంతుచిక్కని చంద్రుడి ఆవలివైపు రహస్యాలను చేరవేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నాయి.

ఇంతకాలం ప్రపంచంలోని జనం చంద్రుడిని కనబడుతూ వస్తూ పోతూ ఉన్న వాడిగానే గుర్తించారు. నెలవంక చంద్రుడు. పౌర్ణమి చంద్రుడు. క్షీణత. దశలవారిగా ప్రకాశ హీనత. ఆ చంద్రుడు కొంతకాలం తిరిగి కనబడకుండా పోవడం. ఈ మధ్యలోనే చంద్రుడి లెక్కలతోనే భూమిపై సాగే కాలం. కొన్ని చోట్ల చంద్రమాన కాల కొలమానం. అంతా ఇప్పటికీ ఈ రాత్రయిందా? పడుకున్నామా? తెల్లారిందా? బాపతుగానే సాగింది. కానీ ఈ లెక్కల వెనుక ఉన్న అసలు సిసలు లెక్కల సంగతి తేల్చేందుకు చైనా ఛీకారం చుట్టింది. చ చి చై చౌ అక్షరాలు చైనాకు అచొచ్చే పదాలు. ఈ ఒక్క రీజన్‌తోనే అంతకు మించిన విజన్‌తోనే చైనా ఇప్పుడు చంద్రుడి రహస్యాల వెలికితీతకు ముందుకు పోయిందేమో.....

కేవలం యుద్ధంతోనో, శాంతితోనో ప్రపంచాన్ని శాసించలేం. మనస్సులను గెల్చుకోలేం. దానిని మించి ఏదో చేయాల్సి ఉందనే సత్యాన్ని జిన్‌పింగ్ తనదైన నియంత ముద్రలోనే ఆవిష్కరించారు. ఇప్పుడు లోకాన్ని ఏలుతున్నది శాస్త్రం. అస్త్రాల కన్నా అణుపాటవం కన్నా మానవాళికి ఇంతవరకూ తెలియని లోగుట్ల ఛేదనతోనే ఎవరికి తెలియకుండానే ప్రపంచాన్ని ఏలవచ్చుననే నిజాన్ని చైనా గ్రహించింది. ప్రపంచమంతా ఉపగ్రహ ప్రయోగాల దగ్గర, అంగారకుడి ప్రాంగణాల వద్దనే చతికిల పడుతున్న దశలో కొన్ని దేశాలు ఇప్పుడే చంద్రుని వద్దకు పొయ్యేందుకు నడుంబిగిస్తున్న కాలంలో చైనా గుట్టుచప్పుడు కాకుండా అత్యంత కట్టుదిట్టమైన వ్యూహంతో చంద్రుడి ఆవలి వైపు అద్భుతాల ఆవిష్కరణకు ముందు కు సాగింది.

ఇప్పటి చైనా చంద్ర యాత్ర వెనుక దశాబ్దాల నాటి చరిత్ర ఉంది. అప్పట్లోనే చంద్రుడిలోని తరంగ శక్తిని అంచనావేసేందుకు చైనా ప్రత్యేకగా ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపింది. చంద్రుడిలో టన్నుల కొద్ది ఈ పౌన్యః తరంగాల శక్తితోనే చంద్రుడి ఆవలివైపు దర్శనం జరగడం లేదనే విషయాన్ని ఈ ఉపగ్రహం ద్వారా పసికట్టింది. ఈ శాటిలైట్ సేకరించిన కీలక అంశాలతో చైనా వ్యోమనౌక ఛాంగే ఇప్పుడు ఆ ఆకర్షణ శక్తిని అంతకు మించి చంద్ర పద్మవ్యూహాన్ని ఛేదించుకుని ముందుకు సాగింది.



ప్రపంచంలో అందులోనూ మరో అగ్రరాజ్యం అమెరికాతో చైనా నిరంతరం ఆయుధ ప్రయోగం లేని యుద్ధం చేస్తోంది. వాణిజ్యంగా సవాళ్లు విసిరింది. దౌత్యపరంగా తనకుంటూ లాబీని కూర్చుకుంది. ధృతరాష్ట్రుని కౌగిలి వంటిదని తెలిసినా అక్కున చేరేలా చేసుకుంది. అమెరికాలోని అన్ని సూపర్‌మార్కెట్లులో, మాల్స్‌లో చైనా సరుకులే ఇప్పుడు ట్రంప్ గారికి కొరకరాని కొయ్యలుగా మారాయి. అంతేకాదు చైనా సాంకేతిక నిపుణులే భారత్‌తో పోటీపడుతూ అమెరికాలో తమ ముద్ర వేసుకుంటున్నారు. ఈ దశలోనే ఒక్కసారి ఈ ప్రపంచపు నేలను గట్టిగా తన్నుతూ రివ్వుమంటూ మరో ప్రపంచపు ఆవలివైపు చైనా దూసుకుపోయింది. ఇది ప్రపంచంపై కమ్యూనిజం విజయం కాదు. చైనిజం విజయం అని చాటుకుంటూ పోయింది. రానున్న ఆ రానున్న కాలంలో చైనిజమే ప్రపంచిజం అవుతున్నదనే అంశాన్ని శక్తివంతంగా చాటేందుకు ఇప్పుడు ఈ ప్రయోగాన్ని సక్సెస్ చేసి కూర్చుంది. అదిగో నవలోకం వెలిసే మీ కోసం అంటూ ప్రపంచానికి ఆవల కూడా చైనా మావోల రాజ్యం పాతేందుకు రంగం సిద్ధం అవుతోంది. ప్రపంచంలో ఇప్పటికీ చైనా అంతుబట్టని రీతిలో ఉండే జడంగానే ఉంటోంది. అయితే ఈ జడఖడ్గం ఆవిష్కృతం కాని నిజాల మర్రిచెట్ల ఛేదనను మొదలుపెట్టింది. ఐరాస, కొరియా, పాకిస్థాన్, కశ్మీర్ .. రగిలే సముద్ర యుద్ధాలు సరిహద్దుల ఘర్షణలు. ఉగ్రవాద దాడులతో వందలు వేల మంది బలులు. దేశాలలో అధికారాల కోసం సాగే ఓట్లపాట్లు. ప్రభుత్వాలు అసెంబ్లీలు.. పార్లమెంట్లు. చట్టాలు.. అమలు కాని వైనాలు. మనుష్యుల మధ్య అంతరాలు. గడిచిపోతున్న తరాలు. ఇవన్నీ ప్రపంచానికి శ్మశాన వైరాగ్యాన్ని, ఖనన వాటిక నైరాశ్యాన్ని చితిమంటగా అంటిస్తున్న తరుణంలో ఇది కాదు.. మరో లోకం ఉందని చెప్పడానికా... అన్నట్లుగా చైనా.., చానా చానా చిత్రంగా చంద్రుడిని గెల్చివేసింది.

గెలుపు మలుపులో ప్రపంచాన్ని తన చుట్టూ మలుపేసుకుంది. నిజమే .. బక్కచిక్కిన మనిషి ఆకలికేకలు, నిరుద్యోగుల కార్మిక కర్షక శ్రేణుల బాధలు కష్టాలు కన్నీళ్ల గురించి పట్టించుకుని వారి కోసం ఏదైనా చేయాలనే ఇజాలకు అతీతం అయిన నిజం ముందు శత కోట్లాది ధనపు వ్యయపు శాస్త్రీయ ప్రయోగాలు శూన్యంలో పోసిన పన్నీరు అనే వాదన ఉండనే ఉంది. అయితే విశ్వం ఒక్కటే కాదు.. దానికి మించి ఉండే మరో వైపున మనకు శేష ప్రశ్నలు కాలనాగుల్లా బుసలు కొట్టే వనరులు, అందులోని విశేషాలతో మానవాళికి మంచి చేసేందుకు సాగే శాస్త్రీయ తపన మంచే చేస్తుందని చైనా చెపుతోంది. మరో గ్రహం వైపు దూసుకు వెళ్లి అక్కడ కూడా జెండాలు ఎగరేయడం కాదు.. అక్కడి ఉపరితలాన్ని కొల్లగొట్టడం కాదు, అక్కడి అపారశక్తుల సంగ్రహణం మానవాళికి ఏ విధంగా ఉపయుక్తం అవుతుందనేది గ్రహించి శాస్త్రీయతను సాంకేతికను వాస్తవికతను అనుసంధానంగా మలుచుకుంటేనే సంక్షేమమవుతుంది. జాబిల్లికి ఆవలివైపు యాత్ర వెనుక చైనీయుల సాంప్రదాయపు బహుదూరపు బాటసారుల జన్యులక్షణం .. పొట్టివారైనా గట్టివారనిపించుకునే త త్వం మెండుగా ఉంది.

సరిహద్దు కయ్యాలు. భారత్ నెత్తిని దాటుకుంటూ పాకిస్థాన్ వైపు కారిడార్ కారాలు మిరియాలు నూరుకుంటూ వెళ్లడాలు.. ఐరాసలో పొరుగుదేశానికి సరైన పీట పడకుండా అడ్డుకోవడానికి పేరొందిన చైనా మంచైనా చెడైనా తేల్చుకోవాలనే రీతిలో చంద్రున్ని అపూర్వంగా చేరుకుంది. ప్రపంచపు సరిహద్దులు దాటి చంద్రుడి ఆవలివైపు ఏదో చేయనుంది.. ఛాంగే వ్యోమనౌక చంద్రుడిలోని బిలాన్ని చేరుకుంది. ఈ బిలం ఏమిటనేది అత్యంత కీలక శాస్త్రీయ రహస్యంగా ఇన్నాళ్లూనిలిచింది. చంద్రుడి వెనుక వైపు ఉపరితలంలోని ఈ దక్షణ ధృవ ప్రాంతపు అయిట్కెన్ బిలం 186 కిలోమీటర్ల వెడల్పు.. 12 కిలోమీటర్ల లోతుతో ఉంది. సౌర కుటుంబంలోని అతి పెద్ద ఉపరితల గుంతలలో ఇది ఒకటి. ఖగోళ శిలల ఘర్షణల పరిణామాల నేపథ్యంలో కోటానుకోట్ల ఏళ్ల క్రితం శిలల రాపిడి మధ్య ఈ బిలం ఏర్పడిందని చైనా శాస్త్రీయంగా నిర్థారించుకుంది. చంద్రుడిని వెనుకవైపు నుంచి శిల బలంగా ఢీకొనడంతో ముందు వైపు ఉండే ఉపరితల అంతర్భాగ పొరలలోని విశేష పదార్థాలు వెలుపలికి వచ్చి ఉంటాయని విశ్లేషించారు. చంద్రుడి ఆవలివైపునకు అమాంతంగా వెళ్లడం బస్సులోనో, కారులోనో దూసుకువెళ్లినంత తేలిక కాదు. చంద్రుడిలో నుంచి అత్యంత శక్తివంతమైన రేడియో తరంగాలు ఎప్పుడూ ప్రసరిస్తూ ఉంటాయి. అవి తన వెనుక వైపు దూసుకువచ్చేఅపరిచితుడిని అడ్డుకుంటాయి. 1960 –70 ప్రాంతాలలో అమెరికా వ్యోమగాములు ఈ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు కీలక సమస్యలు ఎదుర్కొన్నారు. భూమిపై ఉండే కేంద్రానికి, వీరికి మధ్య అనుసంధానపు రేడియో సంబంధాలు తెగిపొయ్యాయి. దీనితో అమెరికా చంద్రుడి వైపు ఆ వెనుక వైపు చూడటం మానేసింది. అయితే వదిలేసి వెళ్లిన అసంపూర్తి అప్పటి వైఫల్యం నుంచే చైనా ఇప్పుడు విజయాన్ని సాధించుకుంది. తనదైన ప్రత్యేక శాటిలైట్‌ను రూపొందించుకుంది. చంద్రుడి నిరోధక తరంగాల ప్రభావంలేని ప్రాంతాన్ని నిర్థారించుకుని చైనా ఉపగ్రహం చాలా కాలం గా సమాచారం సేకరిస్తోంది. దీనితోనే ఇప్పుడు చైనా వ్యో మనౌక చంద్రుడి పెరట్లోకి దొంగలా దర్జాగా చేరుకుంది. భూమికి చంద్రుడికి మధ్య ఉండే సమతౌల్య స్థితి కక్ష్య వద్ద లంగరు వేసుకోవడంలో సఫలం అయ్యి ఛాంగే ఇప్పుడు చంద్రుడినే ఖంగు తిన్పించింది. ఆకర్షణను ధిక్కరించి నిలుచుంది. ఇది గుట్టుచప్పుడు కాకుండా కాపలాల కన్నుగప్పి సాగించే చొరబాటే. కానీ శాస్త్రీయ విజయాలలో పాటించాల్సిన మెళకువ.. సైన్స్ ఉషోదయంలో మరో కువకువ.. ఇంతకూ చంద్రుని ఆవలి వైపు ఉన్నది చీకటే. చీకట్లో వెతుకులాట సాగాల్సిందే. ఇదో చీకటి ఖండం. అయితే ఇందులోనే విశ్వానికి అవసరం అయిన శక్తి ఇమిడి ఉందనే సూత్రీకరణకు అనుగుణంగానే చైనా పరిశోధన సాగుతోంది. చంద్రుడి ఆవలివైపు కీలక ప్రయోగంతో అక్కడి బిలపు రహస్య ఛేదనతో కోటానుకోట్ల ఏళ్ల నాటి ఖగోళ విస్ఫోటనం, చంద్రుడిలో ఉత్పాతం దానితో ఆవిర్భవించిన శక్తి.. విశ్వ రహస్యాల వెలికితీతకు వీలు అవుతుందని అన్నిదేశాలూ గ్రహించాయి. తన వైపు రావద్దని బలంగా అడ్డుకునే శక్తి అసలు లోగుట్టు పసిగట్టి, అది ఎంతవరకు మానవాళికి ప్రయోజనకరంగా మారుతుందనేది లెక్కకడితే అది చైనా ఒక్కటే సాధించిన విజయంగా రికార్డు కాదు..


మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది.. పదండి ముందుకు అంటూ కొత్తదనం కోసం పరుగులు తీసే భూగోళపు శాస్త్రజ్ఞుల మేథస్సు ఆవిష్కరణల విజయం అవుతుంది. చంద్రుడు.. ఆవలివైపు... ఖగోళ శిలల రాపిడి... బిలం.. అడ్డుకునే కెరటాల వంటి శక్తి తరంగాలు.. ఏదో తెలుసుకుని తీరాలనే ఆరాటాలు, పోరాటాల నుంచే ఏదైనా జరుగుతుందనేది చైనా చంద్రహాసంలోని అంతర్థానం అయితే మంచిదే. ఇది ఇంతకే పరిమితం కావాలి.. అంతకు మించి ఈ చంద్ర ప్రయోగం ఆవలివైపూ ఏదైనా ఉంటేనే చిక్కు.. ప్రపంచం వెతుక్కుంటుంది మరో దిక్కు....

* జగన్మోహన్

ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థుల ఆత్మహత్య

ఒత్తిడి తట్టుకోలేక ముగ్గురు 'ఐఐటీ' విద్యార్థుల ఆత్మహత్య. రాజస్థాన్ కోట నగరంలో విషాదం. ర్యాంకులు, మార్కులు, విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. బతకడం కోసం, విజ్ఞానం కోసం నేర్చుకోవాల్సిన చదువులు. యువతను మానసిక ఒత్తిడికి గురిచేసి వారి హృదయాలను చిత్తడి చేసేస్తున్నాయి. తాజాగా రాజస్థాన్‌లోని కోట సిటీలో ముగ్గురు ఐఐటి విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. బలవన్మరణానికి పాల్పడి ప్రాణాలు విడిచారు. రెండు రోజుల్లో ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం కోట నగరంలో సంచలనం.

రాజస్థాన్‌లోని కోట సిటీ ఐఐటీ జెఇఇ కోచింగ్ సెంటర్స్ హబ్‌గా గుర్తింపు పొందింది. దేశం నలుమూలల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు ఐఐటి జెఇఇ కోచింగ్ కోసం ఇక్కడికి




వస్తుంటారు. కోటలోని మహవీర్ నగర్‌లో ఐఐటి జెఇఇ ఎంట్రెన్ టెస్ట్ కోసం శిక్షణ తీసుకుంటున్న జీతేశ్ గుప్తా... సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. బీహార్ రాష్ట్రంలోని సివా జిల్లా హర్థోభర ప్రాంతానికి చెందిన జీతేశ్ గుప్తా వయసు 19 ఏళ్లు. ఎన్నిసార్లు ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయకపోవడంతో పక్కగది విద్యార్థికి ఫోన్ చేసి అడిగారు. అతను వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు జీతేశ్. కోట సిటీలోనే ఓ కోచింగ్ సెంటర్‌లో నీట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న 17 ఏళ్ల దీక్షా సింగ్ 16 ఏళ్ల దీపక్‌లు కూడా సూసైడ్ చేసుకున్నారు. రెండు రోజుల్లో ముగ్గురు విద్యార్థులు సూసైడ్ చేసుకుని చనిపోవడంతో స్థానికంగా సంచలనం చేసిందీ సంఘటన. కేవలం కోట సిటీలోని కోచింగ్ సెంటర్లలోనే ఈ ఏడాది మొత్తం మీద 19 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి చేయడంతో పాటు... హోమ్ వర్క్, స్టడీ అవర్స్, డైలీ ఎగ్జామ్స్, వీక్లీ టెస్ట్. ఇలా కోచింగ్ సెంటర్లలో క్షణం తీరిక లేకుండా విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నారు శిక్షణా కేంద్రాల నిర్వాహకులు. విద్యార్థుల ఇష్టాయిష్టాలు, వారి శక్తిసామర్థ్యాలతో సంబంధం లేకుండా కోచింగ్ సెంటర్లు 100 శాతం ఫలితాలు లక్ష్యంగా చూపిస్తూ పిల్లలపై ఒత్తిడి తెస్తున్నాయి. మార్కులు రాకపోతే ఇంక దేనికీ పనికిరావనే అభద్రతా భావాన్ని విద్యార్థుల్లో పెంచుతున్నాయి. ఈ టెన్షన్ వాతావరణాన్ని తట్టుకోలేక ఏటా వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. రాజస్థాన్‌లోని కోట కోచింగ్ సెంటర్లలోనూ ఇదే జరుగుతోంది.

– రావుల రాజేశం

సకుటుంబం

మహిళల ఆత్మగౌరవం పెంచేది



మహిళలు ఇంటి నుండి బయటకు వస్తే మూత్ర విసర్జన ఒక పెద్ద సమస్య. పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నా ,అపరిశుభ్రంగా ఉంటాయి. కాలేజీ, రెస్టారెంట్లు, పర్యాటక ప్రదేశాలు, మాల్స్ లేదా సినిమా హాల్స్ ప్రదేశాల్లో మహిళలు మూత్ర విసర్జన కోసం నిత్యం అసౌకర్యానికి గురవుతుంటారు. గర్భిణీ మహిళలు, మోకాలి నొప్పులున్న వారు, కూర్చొని మూత్రం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. బయటకు చెప్పుకోలేని ఇలాంటి సమస్యలను నుండి మహిళలను విముక్తి చేయడానికి, మగాళ్లు లాగే నిలబడి సౌకర్యవంతంగా పోసుకోవడానికి ఒక అరుదైన డివైస్ ఇపుడు వచ్చింది. దాని పేరు 'పీ కోన్' డిస్పోసల్ యూరినేషన్ డివైస్. ప్రదీప్ యాడ్ ఇండియా సంస్థ దీనిని తెలంగాణ మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చింది.

ప్రతీ ఇంటికీ అవసరమైనది

మహిళలు వేలాది సంఖ్యలో ఉపయోగించే టాయిలెట్స్ అపరిశుభ్రంగా మారుతాయి. వాటిని వాడటం వలన స్త్రీలకు మూత్ర సంబంధ వ్యాధులు వస్తున్నాయి. ఇది అందరూ అలోచించాల్సిన పెద్ద సమస్య. ప్రతీ ఇంట్లో సమస్య దీనికి సరికొత్త పరిష్కారం ఈ 'పీ కోన్' . గర్భిణీ స్త్రీలు కూడా అంటురోగాలకు గురవుతున్నారు. వీటి నివారణకు ఈ డివైస్ ఎంతగానో ఉపయోగ పడుతుంది'' అని ప్రముఖ యువనటులు రామ్ కార్తీక్, ప్రణీత్ రెడ్డి వీటిని మార్కెట్‌లోకి విడుదల చేస్తూ అన్నారు.



ఆత్మగౌరవం మొదలయ్యేది అక్కడే..

'' తరతరాలుగా స్త్రీలు ఎదుర్కొంటున్న ఈ సున్నిత సమస్యను గుర్తించిన తమ సంస్థ, రీసెర్చ్ చేసి ఈ పీ కోన్ ని తయారు చేశాం. దీని ద్వారా ఎలాంటి పబ్లిక్ టాయిలెట్స్‌లోనైనా, పరిశుభ్రం లోపించినా, సునాయాసంగా పీ కోన్ ని ఉపయోగించి, నిలబడి మూత్ర విసర్జన చేయవచ్చని, ఈ విధానం వలన యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్(మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు) రాకుండా ఉంటాయి. ఇది పోర్టబుల్, డిస్పోజల్ కోన్ దీన్ని మహిళలు తమ హ్యాండ్ బాగ్ , హ్యాండ్ పర్సులో వుంచుకోవచ్చు. మగాళ్లలాగే మహిళలు కూడా ఇక నిలబడి పోసుకోవచ్చు. వారి ఆత్మగౌరవం మొదలయ్యేది అక్కడే'' అని మన తెలంగాణ ప్రత్యేక ప్రతినిధితో పిఎపి, నేషనల్ సేల్స్ మేనేజర్ అపూర్వ త్రిపాఠి అన్నారు.

మహిళల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు

నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ నిర్వహించిన ఇటీవలి అధ్యయనం:

* పురుషుల కన్నా మహిళలలో యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ ఎక్కువగా వస్తున్నాయి.
* భారతదేశంలో 10 మందిలో 7 గురు యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ సమస్యను ఎదుర్కొంటున్నారు.
* సుమారుగా 50 నుంచి 60 శాతం మంది స్త్రీలు వారి జీవితకాలంలో కనీసం ఒకసారి యుటిఐతో బాధపడుతున్నారు. మన దేశంలో సుమారుగా 117 మిలియన్ స్త్రీలు పబ్లిక్ టాయిలెట్‌లను ఉపయోగి స్తున్నారు. అక్కడి బ్యాక్టీరియా వల్లనే యుటిఐ సమస్యలు ఎదురవు తున్నా యని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి సమస్యలకు చక్కని పరి ష్కారం ఈ కొత్త సాధనం. అన్ని షాపింగ్ మాల్స్‌లో 'పీ కోన్' లు లభ్యమవుతాయని ఉత్పత్తి దారులు తెలిపారు. తెలంగాణ గ్రామీణ మహిళల్లో యుటిఐ సమస్యలు రాకుండా అవగాహన కల్గించే కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ఈ సందర్భంగా అపూర్వ చెప్పారు.

శ్యాంమోహన్,
మన తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి



ఫొటోలు పదిలంగా!

పిల్లలు చేసే ప్రతి అల్లరినీ ఆకతాయి సన్నివేశాలను బంధించి పదిలపరుచుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. గర్భిణిగా తనలో వచ్చే మార్పులనీ గుర్తుగా దాచుకోవడం కూడా ఓ జ్ఞాపకమే. అలా కోరుకునే గర్భిణులు, కొత్తగా తల్లులైన వారికోసమే బేబీగ్రామ్ యాప్. ఇందులో ఫొటోలే కాదు... వాటన్నింటినీ ఆల్బమ్‌లా పదిలపరుచుకోవచ్చు. ఫొటో తీసేటప్పుడు ఆటోమాటిక్ స్టిక్కర్లు కనిపిస్తాయి. అంతేకాదు ఫొటో తీశాక దాని మీద ఏదయినా రాసుకోవచ్చు. ఇందుకోసం పది రకాల ఫాంట్లు ఉంటాయి. యాప్‌లో పిల్లల పేర్లు ముందుగా నమోదు చేయొచ్చు. కొందరు పిల్లలు ఫొటోలు, సెల్ఫీల సమయంలో దిక్కులు చూస్తుంటారు. వారి ముఖం కెమెరా వైపు తిప్పాలంటే ఏవైనా శబ్దాలు చేయాలి. ఈ యాప్‌లో పిల్లల్ని ఆకట్టుకునే పది రకాల శబ్దాలు కూడా ఉంటాయి.

జుట్టు రాలిపోకుండా ఉండాలంటే...!



ప్రతి ఒక్కరికీ ఒకటే సమస్య అదే జుట్టు ఊడిపోవడం. టీనేజీలోకి అడుగుపెట్టినప్పటి నుంచీ ఏదో ఒక సందర్భంలో ప్రతి ఒక్కరికీ ఈ సమస్య ఎదురవుతూనే ఉంటుంది. పోషకాల లేమి, ఇతర అనారోగ్యాలే వల్లే ఇలా కాకపోవచ్చు. ఒక్కోసారి మనం చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల కూడా జుట్టు ఊడిపోవచ్చు.

కొందరు జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది అనే ఉద్దేశంతో రోజూ తలస్నానం చేస్తుంటారు. అలా చేయడం అస్సలు మంచిది కాదంటున్నారు నిపుణులు. షాంపూల్లోని రసాయనాల ప్రభావం జుట్టు కుదుళ్ల మీద పడుతుంది. ఎదుగుదల ఉండకపోగా ఉన్నది కూడా రాలుతుంది. సమయం లేదంటూ ఇంకొందరు సరిగ్గా తలస్నానం చేయరు. అసలు జుట్టుని ఏ మాత్రం పట్టించుకోరు. దానివల్ల జుట్టు ఎండుగడ్డిగా మారుతుంది. ఊడిపోతుంది.

జుట్టు తత్వాన్ని బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి. వారంలో తప్పనిసరిగా రెండు సార్లు తలస్నానం చేయాలి. అంతేకాదు చేసిన ప్రతిసారీ ఎక్కువ నీళ్లతో కడిగేసుకోవాలి. లేదంటే షాంపూల్లో రసాయనాలు అలానే ఉండిపోయి జుట్టు ఎదుగుదలకు అడ్డుపడతాయి. అలాగే బిగుతుగా జడ అల్లుకోవడం, రబ్బరు బ్యాండు పెట్టుకోవడం, బలంగా లాగి ముడివేయడం, ఎక్కువ పిన్నులు పెట్టడం లేదంటే పూర్తిగా వదిలేయడం వంటివి చేయకూడదు. ఇందువల్ల జుట్టు రాలిపోతుంది. జుట్టును బంధించకుండా వదులుగా ఉండేలా చూసుకోవాలి.

జీర్ణశక్తి కోసం..!



అల్లంలోని ఔషధ గుణాలు అందరికీ తెలిసినవే. అజీర్తి తగ్గడానికీ జీవక్రియ వేగం పెరగడానికీ తోడ్పడే అల్లం, నోటి దుర్వాసనీ తగ్గిస్తుందని జర్మనీలోని టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్‌కు చెందిన నిపుణులు పేర్కొంటున్నారు. ఎందుకంటే అల్లంలోని జింజెరాల్ లాలాజలంలోని ఎంజైములని ప్రేరేపించి దుర్వాసనకి కారణమైన పదార్థాల మీద దాడి చేయడం ద్వారా ఆ వాసన లేకుండా శ్వాస తాజాగా ఉండేలా చేస్తుంది. ముఖ్యంగా కొన్ని సెకన్లలోనే లాలాజలంలో సల్ఫేడ్రిల్ ఆక్సిడేజ్ అనే ఎంజైమ్ శాతాన్ని పెంచగలిగే గుణం ఈ జింజెరాల్‌కి ఉందని గుర్తించారు. ఇందుకోసం కాసిని అల్లం ముక్కల్ని నమిలినా లేదా దంచి నీళ్లలో వేసి మరిగించి తాగినా మంచిదేనట. పైగా ఈ అల్లం నీటిని తాగడం వల్ల గ్యాస్ సమస్యలూ తగ్గుతాయని సదరు నిపుణులు పేర్కొంటున్నారు. ఇందులోని ఘాటైన 6 – జింజెనాల్ బరువును కూడా తగ్గిస్తుంది.

ఫోన్ మర్యాదలు పాటించండి

ఈ రోజుల్లో స్మార్ట్‌ఫోన్ లేనివారుండరు. రోజుకొక రింగ్ టోన్ పెట్టుకునేవారుంటారు. పబ్లిక్‌లో చాలా మంది ఇతరులను పట్టించుకోకుండా ఫోన్‌ను ఇష్టం వచ్చినట్లు వాడుతుంటారు. ఫోన్‌కు సంబంధించిన కొన్ని మర్యాదలు పాటించరు.

సాధారణంగా కార్పొరేట్ ఆఫీసుల్లో నిశ్శబ్దంగా పని చేసుకుంటుంటారు. ప్రతి ఒక్కరూ డెడ్‌లైన్‌లతో పోటీపడుతూ ఉంటారు. అలాంటి సమయాల్లో మన ఫోన్ పెద్దగా మోగడం వల్ల అందరి ఏకాగ్రత దెబ్బతింటుంది. అందువల్ల ఫోన్‌ను సైలెంట్ మోడ్‌లో కానీ లేదా వైబ్రేషన్‌లో గానీ పెట్టుకోవాలి.




సమయ సందర్భాలను బట్టి రింగ్ టోన్ సెట్ చేసుకుంటే బాగుంటుంది. ఒక్కోసారి మన రింగ్‌టోన్స్ ఇతరులను చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. మీకు మొబైల్ కంపెనీ అందించినవాటికే పరిమితంకండి. సినిమా పాటలూ, సంభాషణలు వంటివి పెట్టుకోవడం హుందాగా ఉండదు. అంతేకాకుండా మీ ఫోన్ నుంచి వినిపించే బాణీని బట్టే కొందరు మీ వ్యక్తిత్వాన్ని అంచనా వేసే అవకాశం ఉంది. అలాంటప్పుడు మీ మొబైల్ సంగీతం మీకు ప్రతికూలంగానూ మారొచ్చు. ముఖ్యమైన మీటింగుల్లో, ప్రెజెంటేషన్‌లు జరుగుతున్నప్పుడు ఫోన్‌ను సైలెంట్ మోడ్‌లో పెట్టుకోవాలి.అంతగా అర్జంటు అయితే పక్కకు వెళ్లి మాట్లాడాలి. అక్కడే ఉండి ఎస్ఎంఎస్‌లు పంపడం, వంగి మాట్లాడటం వంటివి ఫోన్ మర్యాదలు కావు. మీ సహోద్యోగి, సీనియర్, ఇంకెవరో మీతో మాట్లాడుతూ ఉన్నప్పుడు అలాంటప్పుడు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో సమాధానాలు ఇస్తూ కూర్చోవడం మర్యాద అనిపించుకోదు. వాటిని కాసేపు కట్టేసి మాట్లాడాల్సిందే. అంతేకాదు.. ఇలాంటి భేటీలప్పుడు ఫోన్ వస్తే అటువైపు వారితో వీలున్నంత తక్కువగా సమాధానమిచ్చి పెట్టేయాలి. అలాకాకుండా మాటల్ని కొనసాగిస్తే.. మీ పక్కన కూర్చున్నవారి సమయాన్ని మీరు అగౌరవపరిచినట్టే లెక్క.

చిట్కాలు



* గిన్నెలకు గ్రీజు మరకలు అంటితే సబ్బునీళ్లలో వెనిగర్ కలిపి రుద్దితే పోతాయి.
* ఇత్తడి, రాగి పాత్రలను మగ్గిన అరటిపండు గుజ్జుతో తోమితే కొత్తవాటిలా మెరుస్తాయి.
* తులసి ఆకులను నిత్యం మూడు పూటలా భోజనానికి ముందు నములుతుంటే అసిడిటీ రాకుండా చూసుకోవచ్చు. అలాగే దీని వల్ల తిన్న ఆహారం కూడా సరిగ్గా జీర్ణమవుతుంది.

పొడిచర్మానికి...



ఏమాత్రం అశ్రద్ధ చేసినా ఈ కాలంలో చర్మం అస్సలు మన మాట వినదు. తేమను కోల్పోయి, పగుళ్లు ఏర్పడి అసహ్యంగా కనిపిస్తుంది. కొంచెం సమయం తీసుకుంటే చర్మాన్ని చక్కగా తాజాగా ఉంచుకోవచ్చు. అవేంటో చూద్దాం...

* పెరుగుతో చాలా ఉపయోగాలున్నాయి.
* ఒక పెద్ద చెంచా చొప్పున పెరుగు, నువ్వుల నూనె తీసుకుని కలిపి ముఖానికి బాగా పట్టించాలి. పదిహేను నిమిషాలు ఆగి గోరువెచ్చటి నీటితో కడిగేయాలి.
* చిన్న కప్పు అరటిపండు గుజ్జులో రెండు చెంచాల తేనె కలపాలి. దీన్ని ముఖానికి పట్టించి, పావుగంటయ్యాక కడిగేయాలి. దీనివల్ల పొడిచర్మం మృదువుగా మారుతుంది.
* గుడ్డులోని తెల్లసొనను ముఖానికి రాయాలి. ఇది పూర్తిగా ఆరాక వేడినీటిలో ముంచిన మెత్తటి వస్త్రంతో తుడవాలి. గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే చర్మం బిగుతుగా ఉంటుంది. అయితే ఈ పూత వేసుకున్నప్పుడు మాట్లాడకూడదు.
* చెంచా చొప్పున నిమ్మరసం, తేనె, సెనగపిండి తీసుకుని అన్నింటినీ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి పదినిమిషాలాగి కడిగేయాలి. ఇది జిడ్డుచర్మం వారికి చక్కగా ఉపయోగపడుతుంది.

మన రంగవల్లులు


19 చుక్కలు
3వరుసలు
3 వచ్చే వరకు





వి. సంగీత
ఆర్‌టిసి క్రాస్ రోడ్స్,
హైదరాబాద్

15 చుక్కలు
చుక్క విడిచి చుక్క
1వచ్చే వరకు



ఆర్కెపల్లి శాలిని,
మాచినోనిపల్లి



స్వీట్లేవి

(మొదటిపేజీ తరువాయి)

కలిసిన టిఆర్‌ఎస్ ఎంపిలు ఈ మేరకు పార్టీ తరఫున ఒక విజ్ఞాపనపత్రాన్ని సమర్పించారు. తమ పార్టీకున్న ఎంపిల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే వెయ్యి చదరపు మీటర్ల స్థలం లభిస్తుందని, నాలుగైదు ప్రాంతాల్లో స్థలాలను చూశామని, అన్నింటికంటే రాజేంద్రప్రసాద్ రోడ్డులో ఉన్న స్థలం సౌకర్యంగా ఉంటుందన్న నిర్ణయానికి వచ్చామని టిఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోడికి వివరించారు. పార్టీ కార్యాలయం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించాల్సిందిగా ఇప్పటికే పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు లేఖ రాశామని, వీలైనంత తొందరగా పార్టీ కార్యాలయం నిర్మాణాన్ని చేపట్టనున్నందున అవసరమైన అనుమతులను మంజూరుచేయాల్సిందిగా కోరామని వివరించారు. తమ పార్టీ అధినేత కెసిఆర్ సైతం వీలైనంత తొందరగా పార్టీ కార్యాలయాన్ని నిర్మించాలని ఆలోచనతో ఉన్నారని వివరించారు. పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ నుంచి తొందరగా అనుమతి మంజూరయ్యేలా చొరవ తీసుకోవాల్సిందిగా ప్రధానికి టిఆర్‌ఎస్ ఎంపిలు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కోరుకుంటున్న రాజేంద్రప్రసాద్ రోడ్డు 'ఇన్‌స్టిట్యూషనల్ జోన్‌'లో ఉన్నందున అక్కడి స్థలాన్ని ఆ పరిధి నుంచి మార్చాల్సిన అవసరం ఉందన్న అంశం కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. ప్రధానితో భేటీ అయినవారిలో జితేందర్‌రెడ్డితో పాటు లోక్‌సభాపక్ష ఉప నేత వినోద్‌కుమార్, ఎంపిలు జోగినపల్లి సంతోష్ కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, జి.నగేశ్, బిబి పాటిల్, ప్రొఫెసర్ సీతారాం నాయక్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్, ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ వేణుగోపాలచారి తదితరులు ఉన్నారు.

మాకు స్వీట్లేవి? ప్రధాని ప్రశ్న

తెలంగాణ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని మరోమారు ఏర్పాటు చేసిన తనకు స్వీట్లు ఇవ్వలేదేంటని టిఆర్‌ఎస్ ఎంపిలను ప్రధాని మోడీ ప్రశ్నించారు. 'రెండోసారి ముఖ్యమంత్రిగా కెసిఆర్ బాధ్యతలు చేపట్టినా నాకు స్వీట్లు తినిపించరా? ఇంత గొప్ప మెజారిటీతో గెలిచినా నాకు స్వీట్ మాత్రం అందలేదు. అన్నీ మీలో మీరే పంచేసుకున్నారు. పండగ చేసుకున్నారు. ఇప్పుడైనా స్వీట్ ఇస్తారేమో అని ఎదురుచూశా' అని మోడీ తనదైన శైలిలో జితేందర్‌రెడ్డి సహా టిఆర్‌ఎస్ ఎంపిలను ప్రశ్నించారు. జితేందర్‌రెడ్డి కలుగజేసుకుని, 'మీకు ఇవ్వాల్సిన స్వీట్స్‌ను మా పార్టీ నాయకుడు ఈ మధ్య మిమ్మల్ని స్వయంగా కలిసినప్పుడే ఇచ్చి ఉంటారేమో. ఆయన చేతుల మీదుగా ఇస్తేనే మాకు కూడా సంతోషం. అందుకే మేం ఇవ్వడం తీసుకురాలేదు. తెలంగాణ నుంచి తప్పకుండా మీకు స్వీట్లు వస్తాయి. కేంద్ర మంత్రులందరికీ ఎంపిలుగా మేమైతే స్వీట్లు ఇచ్చాం' అని వివరించారు.

నన్ను సస్పెండ్ చేసే దమ్ము లేదు: సర్వే

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన అక్రమాలను కప్పిపుచ్చేందుకు మొన్న జరిగిన ఎన్నికల్లో టిఆర్‌ఎస్ పార్టీకి కోవర్ట్‌గా పనిచేసి ఎంతో మంది సినియర్ కాంగ్రెస్ నాయకుల ఓటమికి కారణమయ్యాడని ఆరోపించారు. పోటాపోటీ ఓట్లతో గెలిచిన ఉత్తమ్‌కు నిజంగా ఆత్మాభిమానం ఉంటే పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేసి తన సచ్ఛీలతను నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీని భ్రష్టుపట్టిస్తూ ,పార్టీ పదవులను అమ్ముకున్న ఉత్తమ్‌కు తనను సస్పెండ్ చేసే దమ్ముందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమైన కుంతియా , ఉత్తమ్ కుమార్ రెడ్డిలు హైకమాండ్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికార పార్టీకి ,చెందిన సీఎం కేసీఆర్ గెలిచినా ,మెజారిటీ తగ్గడానికి ఓట్ల తొలగింపే కారణమని గుర్తించి తమ పార్టీ నాయకులకి దిశానిర్దేశం ఇచ్చి ఓట్ల నమోదు కార్యక్రమాన్ని ఒక బృహత్తరకార్యక్రమంగా చేస్తున్నారని కొనియాడారు. అదే కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఓటమికి ఈవిఎంలని కుంటి సాకులతో మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ ఎక్కడైనా ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందా అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతే నైతిక బాధ్యత వహించి నాటి పీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య తన పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఓటమిపాలై నెల గడుస్తున్న ఇంకా పీసీసీ పదవిని పట్టుకుని వేలాడుతున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మొదటి నుంచి దళితులు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ వస్తున్నారని , ఉత్తమ్ చేస్తున్న పనులకు కాంగ్రెస్ పార్టీకి దళితులు దూరమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అలోక్ వర్మ పిటిషన్‌పై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ : తన అధికారాలను రద్దుచేసి, బలవంతంగా సెలవుమీద పంపిన కేంద్రప్రభుత్వం చర్యను సవాల్ చేస్తూ సిబిఐ అధిపతి అలోక్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు ఇవ్వవచ్చని భావిస్తున్నారు. సిబిఐలో అత్యున్నత స్థాయి అధికారులైన అలోక్ వర్మ, రాకేశ్ అస్థానాకు మధ్య తీవ్రమైన విభేదాలు రావడంతో గత ఏడాది అక్టోబర్‌లో వారిద్దరినీ ప్రభుత్వం సెలవుపై పంపింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం తనపై తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ వర్మ పిటిషన్ దాఖలు చేశారు. పిల్లుల మాదిరి కొట్లాడుకుంటున్న ఆ ఇద్దరు అధికారులనూ సెలవు మీద పంపడం కన్నా మరో మార్గం లేదని ప్రభుత్వం వాదించింది.

మిషన్ ఇరిగేషన్



(మొదటిపేజీ తరువాయి)

చేసి, సాగునీళ్లు అందిస్తుందనే విశ్వాసంతో ప్రజలు తమకు మరోసారి అవకాశం ఇచ్చారని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ఈ టర్మ్‌లోనే అన్ని ప్రాజెక్టులనూ నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని కెసిఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు, వర్క్ ఏజన్సీలు ఇందుకు సహకరించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

నిధులకు కొరత లేదు

ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా నిధులు సేకరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత కూడా వాటి నిర్వహణ కోసం అవసరమైన నిధులను బడ్జెట్‌లోనే కేటాయిస్తామని వెల్లడించారు. రైతులకు సాగునీరు ఇవ్వడంతో పాటు పారిశ్రామిక అవసరాలకు, ప్రజల త్రాగునీటి అవసరాలకు కూడా ఎంత నీరు అవసరమవుతుందో లెక్క కట్టి, ఏ ప్రాజెక్టు నుంచి ఎంత నీరు వాడాలో నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో మొదట చెరువులు నింపడానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. దీనికోసం సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి ఆలస్యమైనట్లయితే తొలుత చెరువులు నింపడానికి అవసరమైన ఏర్పాట్లను మాత్రం యుద్ధ ప్రాతిపదికన చేయాలని స్పష్టం చేశారు.

ఆరు గంటల సుదీర్ఘ సమీక్ష

ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్ సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం వివిధ శాఖల ఉన్నతాధికారులు, సాగునీటిపారుదల శాఖ ఇంజనీర్ చీఫ్, పలువురు ఇంజనీర్లతో ఆరు గంటల పాటు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఇటీవలే అన్ని ప్రాజెక్టుల పనులను స్వయంగా సందర్శించి వచ్చిన రిటైర్డు ఇంజనీర్లు, వివిధ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రభుత్వ ముఖ్య అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతీ ప్రాజెక్టు పురోగతిపై రిటైర్డు ఇంజనీర్ల బృందం ముఖ్యమంత్రికి వివరించింది. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో ఎక్కడ ఏ లోపం ఉందో చర్చించి, అక్కడికక్కడే లోపాన్ని సవరించడానికి అధికారులకు తగిన సూచనలు చేశారు. పనుల్లో జాప్యం జరుగుతున్న చోట, జాప్యానికి కారణాలను తెలుసుకుని పరిష్కార మార్గాలను చూపారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే వర్క్ ఏజన్సీలను మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రజల సాగునీటి ఆకాంక్షలను నెరవేర్చాలి

''తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు దశాబ్దాల తరబడి పోరాడారు. ప్రాణాలు కూడా అర్పించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే సాగునీరు వస్తుందని ఆశ పడ్డారు. మొదటి టర్మ్‌లో సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించాం. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించే పనులు చేపట్టాం. అన్ని పనులూ పురోగతిలో ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వానికున్న విశ్వసనీయతను ప్రజలు గుర్తించారు. ప్రాజెక్టులు పూర్తి చేయడం ఈ ప్రభుత్వం వల్లనే సాధ్యమవుతుందని విశ్వసించారు. ఈ కారణంతో టిఆర్‌ఎస్‌కు మళ్లీ ఓటు వేసి గెలిపించారు. టిఆర్‌ఎస్ గెలుపుకు 75% ఇదే కారణం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీటిని అందించాం. వలసలు పోయిన వారు వాపస్ వచ్చారు. ఈ పరిస్థితి చూసే అక్కడి ప్రజలు ఆ జిల్లాలోని ఒక్కటి మినహా మిగిలిన 13 సీట్లలో టిఆర్‌ఎస్‌ను గెలిపించారు. ఈ టర్మ్‌లో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి, తెలంగాణలో కోటి ఎకరాల్లో నీరు పారించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఐదేళ్ల పూర్తి సమయం మనకుంది. రాజకీయ సుస్థిరత కూడా ఉంది. నిధులకు కొరత లేదు. రైతులకు సాగునీరు అందివ్వడమే ధ్యేయంగా పనిచేయడానికి పునరంకితమవుదాం'' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

ప్రశంసలు పుష్కలం.. కేంద్రం నుంచి ఆర్థిక సాయం సున్నా

''తెలంగాణ రాష్ట్రం వెనుకబడింది. సాగునీటి రంగంలో వివక్షకు గురైంది. అందుకోసమే ఇక్కడి ప్రజలు పోరాటం చేశారు. కాబట్టి తెలంగాణలో ఓ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించండి అంటూ ప్రధాని మోడీకి అనేక సార్లు చెప్పాను. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ. 20 వేల కోట్లు లేదా రూ. 30 వేల కోట్లిచ్చి సాయపడండి అని వేడుకున్నా. అయినా నరేంద్రమోడి డబ్బులు ఇవ్వలేదు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరిస్తున్న తీరును చూసి దేశమంతా మెచ్చుకున్నది. 'వాటర్‌మాన్ ఆఫ్ ఇండియా' రాజేందర్ సింగ్ వరంగల్ జిల్లా నెక్కొండలో చెరువులోనే పుట్టిన రోజు చేసుకుని మిషన్ కాకతీయ పనులను మెచ్చుకున్నారు. దేశమంతటి నుంచీ ప్రశంసలు వచ్చాయి. నీతి ఆయోగ్ కూడా 'మిషన్ కాకతీయ' గొప్ప పథకమంటూ కితాబునిచ్చింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు కలిపి రూ. 24వేల కోట్లివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అయినా సరే, నరేంద్ర మోడీ ప్రభుత్వం 24 రూపాయలు కూడా ఇవ్వలేదు. ఈ సారి కేంద్రంలో మనది క్రియాశీల పాత్ర ఉంటుంది. కావాల్సిన నిధులు రాబట్టుకునే అవకాశం ఉంటుంది. దీంతో పాటు మన రాష్ట్ర ఆదాయాభివృద్ధి రేటు కూడా బాగుంది. మొదటి నాలుగు సంవత్సరాలలో 17.17 శాతం వృద్ధి రేటు ఉంటే, ఈ సంవత్సరం ఇప్పటివరకు 29.17 శాతం వృద్ధి రేటు నమోదైంది. నిధులకు కొరత లేదు. ప్రాజెక్టులు కట్టుకోవడమే మన లక్ష్యం'' అని ముఖ్యమంత్రి ఆ సమావేశంలో అధికారులకు స్పష్టం చేశారు.

వర్షాకాలంకల్లా గోదావరి జలాలు పొలాలకు చేరాలి : గోదావరి నదిలో తెలంగాణకు 950 టిఎంసిల నీటి వాటా ఉందని, సమైక్య రాష్ట్రంలోనే ఇది ఖరారైందని, దీని ప్రకారమే మనం గోదావరిపై కాళేశ్వరం, తుపాకుల గూడెం, సీతారామ ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందించాల్సి ఉందని, హైదరాబాద్‌కు కూడా తాగునీటిని అందించాల్సి ఉందని, ఇదే లక్ష్యంతో ఆ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఎండాకాలంలోనే పనులన్నింటినీ పూర్తిచేసి, వర్షాకాలంకల్లా ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు చెరువుల ద్వారా పొలాలకు చేరాలని అధికారులకు స్పష్టం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలు, కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపుహౌజుల నిర్మాణాలను పూర్తి చేసి ఎల్లంపల్లి, మిడ్ మానేరు వరకు నీళ్ళను తీసుకురావాలని సూచించారు. మేడిగడ్డ నుంచి ప్రతీ రోజు రెండు టిఎంసిల చొప్పున నీరు తీసుకోవాలని, మూడు బ్యారేజిల ద్వారా 36 టిఎంసిల నీళ్లు, ఎల్లంపల్లిలో 20 టిఎంసిల నీళ్లు నదిలోనే అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వచ్చిన నీటిని వచ్చినట్లు పంపింగ్ చేసి చెరువులకు మళ్లించాలని స్పష్టంచేశారు. ఎల్లంపల్లి దాకా వచ్చిన నీటిలో ఒక టిఎంసిని మిడ్ మానేరు ద్వారా శ్రీరాంసాగర్ కాల్వలకు మళ్లించాలని, మరో టిఎంసి నీటిని మల్లన్న సాగర్ వైపు మళ్లించాలని వివరించారు. మల్లన్న సాగర్ ద్వారా ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో నిర్మించే బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్‌కు ఆ నీటిని తరలించాలని, మల్లన్న సాగర్ ద్వారానే హైదరాబాద్ మంచినీళ్ల కోసం నిర్మిస్తున్న 10 టిఎంసిల రిజర్వాయర్‌కు నీళ్ళను పంపాలని తెలిపారు. హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్, ఘనపురం ఆయకట్టుకు సాగునీటిని అందించాలని, గండిపేట, హిమాయత్ సాగర్ చెరువులనూ నింపాలని స్పష్టం చేశారు. వాటి ద్వారా క్రమం తప్పకుండా నీటిని విడుదల చేస్తూ మూసీ నది మురికిని వదిలించాలన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ లాగా అభివృద్ధి చేస్తామని, దానికి కూడా గోదావరి నీటినే అందించాలని స్పష్టంచేశారు. చివరికి మూసీ నది నీళ్ల ద్వారా పాత నల్గొండ జిల్లా పొలాలకు నీరు చేరాలని పేర్కొన్నారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించి, అమలు చేయాలని ఆ సమావేశంలో అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

దేవాదులను పూర్తి స్థాయిలో సమీక్షించాలి

గోదావరి నదిపైన నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉందని, ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత తుపాకుల గూడెం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది కనుక ఆ నీటిని ఉపయోగించుకోవడానికి బ్యారేజి కడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఏడాదికి 75 టిఎంసిలకు పైగా నీటిని తీసుకునే అవకాశం ఉందని, ఇప్పుడున్న డిజైన్లు, కాల్వలు, ఇతర నిర్మాణాలు పెద్దగా ఉపయోగపడేలా లేనందున మొత్తం పాత వరంగల్ జిల్లాకు దేవాదుల ద్వారానే నీటిని అందించాలని అధికారులకు సిఎం స్పష్టం చేశారు. పాఖాల, రామప్ప, గణపురం, లక్నవరం చెరువులను నింపాలని, తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్‌ను నిర్మించి, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాలకు నీరివ్వాలని స్పష్టం చేశారు. దీని కోసం మొత్తం ప్రాజెక్టును సమీక్షించి కొత్త ప్రతిపాదనలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

'సీతారామ'తో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

దుమ్ముగూడెం దగ్గర నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని, మే నెలలో కూడా దుమ్ముగూడెం వద్ద ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీరివ్వాలని అధికారులకు సిఎం కెసిఆర్ సూచించారు. బయ్యారం వరకు నీటిని తీసుకురావాలని, ఎస్‌ఆర్‌ఎస్పి ఆయకట్టుకూ నీరు అందాలని స్పష్టం చేశారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన నిర్మాణాలను చేపట్టాలని ముఖ్యమంత్రి వివరించారు.

పాలమూరు ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టాలి

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి (ప్రస్తుత వికారాబాద్) జిల్లాలకు సాగునీరు అందివ్వడానికి ఉద్దేశించిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో వేగం పెరగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా మహబూబ్ నగర్ జిల్లా ప్రజల్లో ప్రభుత్వంపై ఎంతో నమ్మకం వచ్చిందని, పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి, మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయాలని స్పష్టం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 70 టిఎంసిల వరకు నీటిని తీసుకునే అవకాశం ఉందని, మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేసే ఈ ప్రాజెక్టును ఆ జిల్లాకు చెందిన రాజకీయ నాయకులే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని కెసిఆర్ గుర్తుచేశారు. దానివల్లే కొంత జాప్యం జరిగిందని, ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నంత వేగంగా ఇకపై పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం పనులు జరగాలని స్పష్టం చేశారు. అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

తొలుత చెరువులను నింపాలి

ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటితో ముందుగా చెరువులు నింపాలని సిఎం కెసిఆర్ ఆదేశించారు. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను ఉపయోగించుకుని చెరువులను నింపేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాగునీటితో పాటు, తాగునీటికి ఎంత నీరు అవసరమవుతుందో, భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని అంచనాలు తయారు చేసి, నీటి కేటాయింపు జరపాలని సిఎం కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటి పారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ రావు, అనిల్ కుమార్, హరిరామ్, ఓఎస్‌డి (సాగునీటిపారుదల) శ్రీధర్ దేశ్ పాండే, సలహాదారు పెంటారెడ్డి, సిఇలు వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాస రెడ్డి, బి.శంకర్, కె.బంగారయ్య, వి.సుధాకర్, వి.నర్సింహ, ఆర్.మధుసూదన్ రావు, వి.రమేశ్, టి.ఖగేందర్, రిటైర్డు ఇంజనీర్లు శ్యాం ప్రసాద్ రెడ్డి, చంద్రమౌళి, వెంకటరామారావు, వేణుగోపాలరావు, రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకటేశం, సత్తిరెడ్డి, రమణానాయక్, ఎస్.ముత్యంరెడ్డి, జగదీశ్వర్, జియావుద్దీన్, ఇంద్రసేనారెడ్డి, కెప్టెన్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ ఎంఎల్‌ఏగా స్టీఫెన్‌సన్

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎల్‌ఏగా కొనసాగిన స్టీఫెన్‌సన్‌ను రెండవ శాసనసభలోనూ నియమించాలని మంత్రివర్గం అభిప్రాయపడింది. ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్‌లో సోమవారం జరిగిన మంత్రివర్గ తొలి సమావేశంలో ఈ నిర్ణయం జరిగింది. ముఖ్యమంత్రితో పాటు హోం మంత్రి మహమూద్ ఆలీ ఈ సమావేశంలో పాల్గొన్నారు. నామినేటెడ్ శాసనసభ్యుడి నియామకంపై రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం శాసనసభలో ఆంగ్లోఇండియన్ సభ్యులెవరూ లేనందువల్ల స్టీఫెన్‌సన్‌ను రాజ్యాంగంలోని 333వ అధికరణం ప్రకారం నియమిస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ గెజిట్‌ను కూడా విడుదల చేశారు. కొత్తగా కొలువుదీరిన శాసనసభలో స్టీఫెన్‌సన్ నామినేటెడ్ ఎంఎల్‌ఏగా కొనసాగనున్నారు.

సభ్యులతో పాటే ప్రమాణ స్వీకారం

''సాధారణంగా నామినేటెడ్ సభ్యుడి నియామకంలో జాప్యం జరుగుతూ ఉంటుంది. దీనివల్ల నామినేటెడ్ సభ్యులు ఇతర సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేయడం సాధ్యపడదు. ఫలితంగా వారు విలువైన పదవీ కాలాన్ని కోల్పోతారు. ఈ సమస్యను నివారించడానికి తెలంగాణ ప్రభుత్వం తన మొదటి కేబినెట్ సమావేశంలోనే అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యుడి నియామకంపై నిర్ణయం తీసుకుంది. చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఇతర సభ్యులతో పాటుగానే ప్రమాణ స్వీకారం చేయడానికి వీలుగా అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యుడి నియామకం జరపాలని ఈ సమావేశంలో నిర్ణయం జరిగింది'' అని ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

గంగా జమునా తహజీబ్‌కు ప్రతీక

తెలంగాణలో గంగా జమునా తహజీబ్ సంప్రదాయాన్ని కొనసాగించడానికి ప్రభుత్వం అసెంబ్లీకి సంబంధించిన వ్యవహారాల్లో నిర్ణయాలు తీసుకుంటున్నదని, అందులో భాగమే ప్రోటెమ్ స్పీకర్‌గా ముస్లిం వర్గానికి చెందిన ముంతాజ్ అహ్మద్ ఖాన్ నియామకం, అసెంబ్లీ నామినేటెడ్ సభ్యుడిగా క్రిస్టియన్ మతానికి చెందిన ఆంగ్లో ఇండియన్ ఎల్విస్ స్టీఫెన్‌సన్ నియామకం అని ప్రభుత్వం పేర్కొంది. మంత్రివర్గం కూడా గంగా జమునా తహజీబ్‌కు అనుగుణంగా స్టీఫెన్‌సన్ పేరును ఖరారు చేసిందని, దీనికి సంబంధించి గవర్నర్‌కు ప్రతిపాదనలు కూడా పంపిందని పేర్కొంది. చట్టసభల్లో ఆంగ్లో ఇండియన్ల ప్రాతినిధ్యం ఉండాలనే రాజ్యాంగ నిబంధన మేరకు తెలంగాణ అసెంబ్లీలో ఈ నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఎన్నికల సంఘానికి అభినందన

గతేడాది డిసెంబర్ నెలలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలను అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించినందుకు భారత ఎన్నికల సంఘాన్ని మంత్రివర్గ సమావేశం అభినందించింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్ కుమార్‌ను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా మంత్రివర్గం ప్రత్యేకంగా అభినందించింది. గత నెల 7వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఒకే దశలో పోలింగ్ నిర్వహించిన ఎన్నికల సంఘం తొలి నుంచీ పకడ్బందీ నిర్వహణా ఏర్పాట్లు చేయడంతో ఒక్క చోట కూడా రీపోలింగ్‌కు, రీ కౌంటింగ్‌కు ఆస్కారం లేకుండా, హింసాత్మక చర్యలకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

మూడు భాషల్లో రాజ్యాంగం, అసెంబ్లీ నిబంధనల ప్రతులు

తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికైన శాసనసభ్యులకు భారత రాజ్యాంగం ప్రతులను తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో అందజేయడానికి శాసనసభ కార్యదర్శి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అసెంబ్లీ నియమ నిబంధనలకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని, పుస్తకాలను కూడా మూడు భాషల్లో ముద్రించి అందించాలని నిర్ణయించింది.

ప్రభుత్వ సూచన మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఈ చర్యలు తీసుకున్నారు. శాసనసభ, శాసనమండలిలో వివిధ అంశాలకు సంబంధించిన నిబంధనలు, పుస్తకాలు, బుక్‌లెట్లు, ఇతర సమాచారం ఇకపైన సభ్యులకు మూడు భాషల్లో అందనుంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ ప్రతులను అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహచార్యులు ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రికి చూపించారు.

అగ్రవర్ణాలలో పేదలకు 10%

(మొదటిపేజీ తరువాయి)

మెజార్టీతో ఆమోదించుకుని తీరాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఇక ఈ కోటా కల్పనకు సంబంధించి కేంద్ర న్యాయ శాఖ మంత్రిత్వశాఖ తగు విధంగా సమాయత్తం అయినట్లు వెల్లడైంది. అగ్రవర్ణాల జాబితాలో ఉన్నప్పటికి దేశవ్యాప్తంగా అసంఖ్యాకులు ఆర్థికంగా బలహీనంగా ఉన్నారు. వీరికి ఇప్పటి వరకూ ఈ వర్గానికి ఎటువంటి రిజర్వేషన్ల కోటా లేదు. ఓ వైపు లోక్‌సభలో రాఫెల్ డీల్‌పై కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాలు తీవ్రస్థాయి నిరసనలకు దిగుతున్న తరుణంలో కేంద్ర కేబినెట్ అత్యంత కీలకమైన కోటాకు ఆమోదం తెలిపింది. మంగళవారం జరిగే పార్లమెంట్‌లో సంబంధిత కోటా బిల్లుకు రంగం కూడా సిద్ధం చేసుకుంది. ఇప్పటివరకూ రిజర్వేషన్లతో ఎటువంటి ప్రయోజనం దక్కకుండా ఉండి, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి ఈ రిజర్వేషన్ల ఫలాలు అందుతాయని అధికారవర్గాలు తెలిపాయి. కుల ఆధారిత రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అయితే ఈ పదిశాతం రిజర్వేషన్ల కోటా తీసుకురావడంతో దీనికి పార్లమెంట్ ఆమోదం దక్కితే కోటా పరిధి 50 శాతం దాటిపోతుంది. ప్రస్తుతం ఉద్యోగాలు, విద్యారంగంలో ఎస్‌సి, ఎస్‌టిలు, ఓబిసిలకు కలిపి మొత్తం ఉన్న కోటా 50 శాతంగా ఉంది, ఇప్పుడు ప్రతిపాదిత పదిశాతం రిజర్వేషన్లను కూడా తీసుకువస్తే మొత్తం కోటా 60 శాతానికి చేరుతుంది. కేంద్రం తీసుకున్న తాజా కోటా నిర్ణయంతో అగ్రవర్ణాలకు చెందిన బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు (ఠాకూర్లు), జాట్లు, మరాఠాలు, భూమిహారాలు, కొమటి వైశ్య వంటి పలు వ్యాపార కులాలు, కాపులు , కమ్మలు ఇప్పటివరకూ లేని ప్రయోజనం పొందుతారు. ఇతర మతాలలోని పేదలు కూడా దీనినుంచి ప్రయోజనం పొందుతారని అధికార వర్గాలు తెలిపాయి.రాజ్యాంగంలోని నిబంధనల మేరకు రిజర్వేషన్ల కల్పనకు కులాల వారిగా ఆర్థిక పరిస్థితుల ప్రాతిపదికను ఖరారు చేయలేదు. కులాల వారిగానే రిజర్వేషన్ల కోటాకు వీలు కల్పించారు. ఇప్పుడు తొలిసారిగా దీనికి అతీతంగా జనరల్ కేటగిరిలోని వారికి కూడా కోటా కల్పించాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 5, 5లను కూడా సవరించాల్సి ఉంటుందని విశ్లేషించారు. లోక్‌సభలో తా ము తీసుకువచ్చే సవరణ బిల్లు ఆమోదం పొందితే దానికి అనుగుణంగా సవరణలు అమలులోకి వస్తాయని, అగ్రవర్ణాలు, తరగతులకు చెందిన వారిలోని పేదలకు రిజర్వేషన్లు దక్కుతాయని కేం ద్ర మంత్రి ఒకరు తెలిపారు. పార్లమెంట్‌లోని ఉపభయసభలలో మూడింట రెండొంతుల మెజార్టీ ఉంటేనే రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గుతుంది. ఈ బిల్లు కోసం రాజ్యసభ సమావేశాలను ఒక రోజు పొడిగించారు.

చారిత్రక నిర్ణయం : పాశ్వాన్

కేంద్రం తీసుకున్న నిర్ణయం చారిత్రకం అని, దళిత నేత కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ వ్యాఖ్యానించారు. కేంద్రం ఎత్తుగడలలో ఇదో భాగం అని, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్‌లో సరైన మెజార్టీ లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాలకు పార్లమెంట్ చివరి రోజున దీనిని ప్రవేశపెడుతున్నారని కా ంగ్రెస్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ విమర్శించా రు.

ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి కొలమానం

వ్యక్తికి రూ 8 లక్షల కంటే తక్కువ వార్షికాదాయం, 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి, వెయ్యి చదరను అడుగుల కంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు, నోటిఫైడ్ పురపాలికల పరిధిలో 150 గజాల కన్నా తక్కువ స్థలం, నోటిఫైడ్ కాని మున్సిపాల్టీల పరిధిలో 200 గజాల కంటే తక్కువ స్థలం ఉన్న వారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగా పరిగణిస్తారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లుకు రాజ్యసభలో ప్రతిపక్షం అనివార్యంగా మద్దతు ఇవ్వాల్సి ఉంటుందని బిజెపి వర్గాలు విశ్వసిస్తున్నాయి. రాజ్యసభలో అధికార పక్షానికి సరైన బలం లేదు. కోటా బిల్లుకు రాజ్యసభలో ప్రతిపక్షాలు వ్యతిరేకంగా స్పందిస్తే వారు సమాజంలోని అగ్రవర్ణాల మద్దతును పోగొట్టుకుంటారని, అందుకే వారు బిల్లుకు ఆమోదం తెలిపితీరుతారని బిజెపి ఆశిస్తోంది. అగ్రవర్ణాలలోని పేదలకు కోటాల కోసం చాలా కాలంగా మరాఠాలు, జాట్స్,కాపులు ఇతరులు ఉద్యమాలకు దిగారు. కొన్ని చోట్ల నెలల తరబడి హింసాత్మక నిరసనలు జరిగాయి. . అయితే హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్రలలో అగ్రవర్ణాల బలహీనవర్గాల వారికి ఈ కోటా కల్పనకు చట్టాలు తీసుకువచ్చాయి. అయితే వీటిని సుప్రీంకోర్టు ఇంద్రా సవహ్నే కేసులో కొట్టివేసింది. కోటకు 50 శాతం పరిమితిని ఖరారు చేసింది. ఈ దశలో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని అంశాలను ప్రస్తావించింది. ఆర్థిక వెనుకుబాటు తనం గురించి కాకుండా కేవలం విద్యా సామాజిక వెనుకబాటు తనం, అణగారిన తనం, ప్రత్యేకించి ఎస్‌సి, ఎస్‌టి ఆదివాసీలకు దీనిని వర్తింపచేయాలనే విషయాన్నే రాజ్యాంగం నిర్ధేశించిందని తెలిపారు. అయితే మారిన పరిస్థితులలో అన్ని కులాలలో ఆర్థికంగా వెనుకబడ్డ వారు దయనీయంగా ఉ న్నారని వారికి కోటా కల్పించాల్సి ఉందని పలు రాష్ట్రాల అ సెంబ్లీలు తీర్మానాలు చేశాయని బిజెపి నేత ఒకరు తెలిపారు.

దేశంలోని అత్యధిక , అగ్రవర్ణాల మద్దతుకు ఎత్తు?

ఈ కోటా బిల్లును తీసుకువచ్చినందున దీని ఆమోద అనామోదాలతో సంబంధం లేకుండా సార్వత్రికంగా అన్ని వర్గాల నుంచి మద్దతును సమీకరించుకుని ఇటీవలి నష్టాన్ని పూడ్చుకోవచ్చునని బిజెపి ఈ పాచిక విసిరిందని విశ్లేషిస్తున్నారు. దీనిని తొలిసారిగా తాము తీసుకువచ్చిన ఘనత , బిల్లును తీసుకువచ్చిన ప్రచారం, దీనిని ప్రతిపక్షాలు అడ్డుకుంటే దానిపై నిందలకు దిగడం, అన్నింటికి మించి రాఫెల్ ఇతర అంశాలపై ఒక రూట్‌లో వెళ్లుతున్న జాతీయ స్థాయి చర్చను ఇటువైపు మళ్లించేందుకు దీనిని తలపెట్టారు. కోటా 50 శాతం దాటవద్దనే సుప్రీం తీర్పును ఉల్లంఘించే స్థాయిలో మోడీ తీసుకున్న నిర్ణయం చట్టాలకు వ్యతిరేకం అని విమర్శకులు తెలిపారు. ఇటీవలి కాలంలో కీలకమైన మూడు ఉత్తరాది, మధ్యప్రాంత రాష్ట్రాలలో బిజెపి ఓటమికి కారణాలను విశ్లేషించుకుని అగ్రవర్ణాలను తిరిగి మచ్చిక చేసుకునేందుకు లోక్‌సభ ఎన్నికల ఓట్ల కీలక వ్యూహంతోనే ఈ కోటాకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రత్యర్థి పార్టీలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో ఓటమికి కారణం మొదటి రెండు రాష్ట్రాలలో ప్రాబల్యపు అగ్రవర్ణాలు తమ కోటాకు బిజెపి రక్షణ కల్పించలేదనే భగ్గుతోనే దెబ్బతీశారని బిజెపి విశ్లేషించుకుంది.

పలు హోటళ్లపై జీహెచ్‌ఎంసీ కొరడా

నగరంలోని బావర్చి హోటల్ సీజ్



మన తెలంగాణ/సిటీ బ్యూరో : నగరంలోని ముషీరాబాద్‌లో గల బావర్చీ హోటల్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. బల్క్ గార్బేజ్‌ను ఉత్పత్తి చేస్తూ పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ కంపోస్ట్ ఎరువుల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయకపోవంతో అధికారులు బావర్చీ హోటల్‌పై చర్యలు చేపట్టారు. దీంతో పాటు కూకట్‌పల్లి సర్కిల్ నిజాంపేట్‌లోని సహారా కేఫ్ రెస్టారెంట్‌లో అపరిశుభ్రంగా కిచెన్ నిర్వహించదంతో సీజ్ చేశారు. అదే విధంగా వ్యర్థాలను డ్రైనేజీలో వేయడం, సీల్డ్ చాంబర్‌లను నిర్మించుకోకపోవడంతో త్రిపురా బార్ అండ్ రెస్టారెంట్‌కు రూ. 20 వేల జరిమానా విధించారు. మూసాపేట్ సర్కిల్‌లోని దేవి గ్రాండ్ హోటల్‌లో అపరిశుభ్ర వాతావారణం, ధృవీకరించని మాంసం ఉపయోగించడం, డ్రైనేజీలో వ్యర్థాలను వేయడం తదితర కారణాల వల్ల రూ. 30,100లను జీహెచ్‌ఎంసీ అధికారులు జరిమానాగా విధించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణ చట్టం అనుసరించి 50 కిలోలకు పైగా వ్యర్థాలను ఉత్పత్తి చేసే వారు తప్పని సరిగా కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలి. అయితే 50 కిలోలకు బదులుగా వంద కిలోల వ్యర్థాలను ఉత్పత్తి చేసే హోటళ్లు, రెస్టారెంట్‌లు, పంక్షన్‌హాళ్లు విధిగా కంపోస్ట్ ఎరువుల తయారీ యూనిట్‌లను డిసెంబర్ 25లోపు ఏర్పాటు చేయాలని జహెచ్‌ఎంసీ నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, పంక్షన్‌హాళ్లు, కళ్యాణ మండపాలు, బాంకెట్ హాళ్లకు ఇప్పటికే పలుమార్లు నగర మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ ఎం.దానకిషోర్‌లు యాజమానులతో సమావేశాలు నిర్వహించారు.

తెలంగాణ 'పద్మ'ల ప్రతిపాదనలు ఇవే!

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రతీ ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే 'పద్మ' అవార్డుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొద్దిమంది పేర్లను ప్రతిపాదిస్తుంది. ఈ సంవత్సరం వివిధ రంగాలకు చెందిన మొత్తం పదిహేను మంది పేర్లను కేంద్ర హోం మంత్రిత్వశాఖకు పంపింది. ఇందులో ఇద్దరు పద్మభూషణ్ అవార్డుకు కాగా, మిగిలినవారంతా (13 మంది) పద్మశ్రీ అవార్డుల కోసం. అత్యధికంగా కళా రంగం తరఫున ఎనిమిది మంది, సాహిత్యం తరఫున ఇద్దరు, వాణిజ్యరంగం తరఫున ఇద్దరు, సామాజిక కార్యకర్తలుగా ఇద్దరిని, ఇతరుల విభాగం కింద మరొకరిని సిఫారసు చేసింది. పద్మభూషణ్‌కు సిఫారసు చేసినవారిలో ఆనంద శంకర్ జయంత్ పద్మభూషణ్ (కళారంగం), శంతను నారాయణ (వాణిజ్య విభాగం)లు ఉన్నారు.

కళారంగం తరఫున... ఆనంద్ శంకర్ జయంత్, జయప్రద రామ్మూర్తి, గడ్డం సమ్మయ్య, బొంగు నర్సింగ్‌రావు, దరూరి శేషాచారి/దరూరి రాఘవాచారి, కందగట్ల నర్సింహులు, గుత్తా మధుసూధన్‌రెడ్డి, వార్సి బ్రదర్స్ (ఖవ్వాలి కళాకారులు నజీర్ అహ్మద్ ఖాన్, నసీర్ అహ్మద్‌ఖాన్)ల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. సామాజిక రంగం నుంచి బూసాని బాబూరావు వర్మ, సరోజ్ బజాజ్‌ల పేర్లను, సాహిత్యం/విద్యా రంగం నుంచి ఆచార్య ఎన్. గోపి, రవ్వా శ్రీహరి పేర్లను, వాణిజ్య రంగం నుంచి ఉడుముల లక్ష్మ ణ్ నారాయణరెడ్డి, శాంతను నారాయణ్ పేర్లను, ఇతరుల విభాగం తరఫున మండేలా పాండు రంగారావు పేర్లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది.

పండుగకు ప్రత్యేక రైళ్లు.. అదనపు బోగీలు

మన తెలంగాణ / హైదరాబాద్ : సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్ళే హమ్‌సఫర్ ప్రత్యేక రైలును దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీ, సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీల సదుపాయాన్ని కల్పించారు. ప్రయాణికుల రద్దీతో పాటు సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని శాశ్వత ప్రాతిపదికన చేసిన ఈ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతి ఎక్స్‌ప్రెస్ ఒక ఎసి త్రి టయర్ బోగిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.దీనికి సంబంధించిన వివరాలు..

సికింద్రాబాద్ టు భువనేశ్వర్ హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు : 08508 నెంబర్ గల ప్రత్యేక రైలు ఈ నెల 11వ తేదీన సికింద్రాబాద్‌లో రాత్రి 9:50 గంటలకు బయలుదేరి ఆ తర్వాత రోజు సాయంత్రం ఐదు గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 08507 నెంబర్ గల ట్రైన్ ఈ నెల 10వ తేదీన భువనేశ్వర్‌లో సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి తర్వాత రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఎసి త్రి టయర్ కోచ్‌లతో బయలుదేరే ఈ ట్రైన్ కుర్ధా రోడ్, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, కాజీపేట స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తోంది.

సైబర్ క్రైమ్ నేరస్థుడి అరెస్ట్

రూ.6లక్షల 50వేల నగదు స్వాధీనం





మన తెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి:ఆన్‌లైన్‌లో పేటిఎం ద్వారా రూ.7,92,500 నగదు దొంగతనం చేసిన హైద్రాబాద్ బండ్లగూడకు చెందిన సైబర్ నేరస్తుడు గజ్జల బాలరాజును మహబూబాబాద్ టౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రూ.6లక్షల 50వేల నగదుతోపాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్‌పి రావుల గిరిధర్ తెలిపారు. సోమవారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన కదనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం అయ్యగారిపల్లికి చెందిన సిహెచ్ లావణ్య మహబూబాబాద్ యాక్సిస్ బ్యాంకులో తన అకౌంట్‌లో నుండి తనకు తెలియకుండానే రూ.1,70,000, అలాగే తన భర్త ఆంధ్రాబ్యాంకు అకౌంట్ నుండి రూ.6,22,500లు తన భర్తకు తెలియకుండా పేటిఎం అకౌంట్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు కాజేశారని పిర్యాదు చేశారు. ఆమె పిర్యాదు మేరకు టౌన్ సిఐ ఎస్. రవికుమార్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు కేసును పరిశోధజంచి పేటియం వారి సహాయంతో నేరస్థుడు గజ్జల బాలరాజును ఖచ్చితమైన సమాచారంతో మహబూబాబాద్ ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్‌లో అరెస్ట్‌చేసి అతనివద్ద నుండి నగదుతోపాటు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్పి గిరిధర్ తెలిపారు. నిందితుడు బాలరాజు, సిహెచ్‌నవీన్ ఇద్దరూ కలిసి రేషన్‌బియ్యం దందా చేస్తూ ఉంటారు. ఈ దందాలో బాలరాజు డబ్బులు కలక్షణ్ చేసి నవీన్‌కు ఇస్తూ ఇతనికి సహాయకారిగా ఉంటూ అతని ఇంట్లో అయ్యగారిపల్లిలో ఉండేవాడు, బాలరాజు తన మొబైల్స్‌లో నవీన్, భార్య లావణ్యల ఎటిఎం కార్డుల ద్వారా వారికి తెలియకుండా పేటియం అకౌంట్స్ క్రియేట్ చేసి పెట్టుకున్నాడు. సుమారు 6నెలల క్రితం నవీన్ మరిపెడ పోలీస్‌స్టేషన్‌వారు పిడి యాక్ట్ క్రింద కేసులో అతన్ని వరంగల్ సెంట్రల్ కి పంపించారు. ఈ సమయంలో బాలరాజు ఏ పని లేకుండా తిరుగుతూ ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో మొబైల్ ఫోన్ ద్వారా పేటియం నుంచి లావణ్య, నవీన్‌కు చెందిన అకౌంట్‌ల నుండి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకుని ఓటిపిని డిలీట్ చేసినుట్ల ఎఎస్పి తెలిపారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేసిన పోలీసులను మహబూబాబాద్ ఎస్పి నంద్యాల కోటిరెడ్డి అభినందించారు.

కలపకు కనురెప్ప

- కలప స్మగ్లింగ్‌పైఉక్కుపాదం
- ఎంతటివారైనా చర్యలు తప్పవు
- తరచూ పాల్పడితే పి.డి చట్టం కింద కేసు
- సహకరించే అధికారులపైనా చర్యలు
- పోలీసుల సాయంతో అటవీ శాఖ పకడ్బందీ ప్రణాళిక
- గతంలో నక్సలైట్ల కారణంగా అటవీ సిబ్బంది అడవుల్లోకి వెళ్ళలేదు
- ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు
- వర్షాకాలం నుంచి ఏడాదికి వంద కోట్ల మొక్కలు నాటాలి
- సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి కెసిఆర్



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కలప స్లగ్లింగ్‌కు అవకాశమే లేనివిధంగా అటవీశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించారు. అవసరాన్ని బట్టి పోలీసుల సహకారాన్ని తీసుకుని కలప స్మగ్లరపై ఉక్కుపాదం మోపాలని, తరచూ స్మగ్లింగ్ కు పాల్పడే వారిపై పి.డి. చట్టం కింద కేసు నమోదు చేయాలని స్పష్టం చేశారు. కలప స్మగ్లర్లు ఎంతటి వారైనా, సామాజికంగా ఎంత పలుకుబడి కలిగిన వ్యక్తి అయినా, ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా చర్యలు కఠినంగానే తీసుకోవాలని ఆదేశించారు. కలప స్మగ్లింగ్‌కు సహకరించే అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గతంలో నక్సలైట్ల కారణంగా అడవుల్లోకి వెళ్లడం సాధ్యం కావడంలేదనే సాకులు చెప్పేవారని, కానీ ఇప్పుడు అలాంటి సమస్య లేదని, అడవులను కాపాడడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పోలీస్, అటవీ అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటు చేసుకుని అడవుల పరిరక్షణకు, కలప స్మగ్లింగ్ నివారణకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకం, స్మగ్లింగ్ నివారణ తదితర పలు అంశాలపై సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. హోం మంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సలహాదారు అనురాగ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, డిజిపి మహేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.కె. ఝా, సీనియర్ అధికారులు ఎస్.నర్సింగ్ రావు, రామకృష్ణ రావు, రాజీవ్ త్రివేది, నిరంజన్ రావు, స్మితా సభర్వాల్, రాజశేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ప్రియాంకా వర్గీస్, పలువురు అటవీశాఖ, పోలీస్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు నాలుగంచెల విధానం

రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణను నాలుగు విభాగాలుగా విభజించుకుని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో అధికారులకు వివరించారు. చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మొక్కలను పెంచడం, అడవులను పునరుద్ధరించడం, హైదరాబాద్ నగరం లోపలా బయటా పచ్చదనాన్ని పెంచడం, కలప స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడం తదితరాలపై నిర్దిష్ట కార్యాచరణ రూపొందించుకుని రంగంలోకి దిగాలని సూచించారు.

''అడవుల్లో మొక్కలు సహజంగానే పెరుగుతాయి. అడవుల ద్వారా లభించే పచ్చదనమే ఎక్కువ. ఒక వైపు అడవులు నశించిపోతూ ఉంటే, హరితహారం లాంటి కార్యక్రమాల ద్వారా ఎన్ని చెట్లు పెంచినా పెద్దగా ప్రయోజనం ఉండదు. అడవులను కాపాడితే పచ్చదనాన్ని కాపాడినట్లే. అడవులను కాపాడడమంటే, భూమిధర్మాన్ని, ప్రకృతి ధర్మాన్ని కాపాడినట్లే'' అని ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కలప స్మగ్లింగ్ వల్ల అడవులకు పెద్ద ముప్పు వాటిల్లుతోందని, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కలప స్మగ్లింగ్ జోరుగా సాగుతున్నదని, కొంతమంది కలపను స్మగ్లింగ్ చేయడమే పనిగా పెట్టుకున్నారని, అలాంటి ప్రాంతాలను, వ్యక్తులను గుర్తించాలని సిఎం స్పష్టమైన సూచనలు చేశారు.

ఎంతటివారైనా ఉపేక్షించొద్దు :

కలప స్మగ్లింగ్ చర్యలు చోటుచేసుకునే ప్రాంతాల్లో నిబద్ధత కలిగిన అధికారులను నియమించాలని, కలప స్మగ్లింగ్‌ను అరికట్టడమే లక్ష్యంగా వారు పనిచేయాలని స్పష్టం చేశారు. పోలీసుల సహకారంతో అటవీశాఖ అధికారులు పకడ్బందీ కార్యాచరణను రూపొందించాలని, సాయుధ పోలీసుల సహకారాన్ని తీసుకుని కలప స్మగ్లింగ్‌ను వంద శాతం అరికట్టాలని ఆదేశించారు. కలప స్మగ్లింగ్‌కు పాల్పడే వారు ఎవరైనా, ఎంతటివారైనా ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్మగ్లింగ్‌కు సహకరించే అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వివరించారు. స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నవారిలో రాజకీయ నాయకులు ఉన్నా వారిని వదిలిపెట్టవద్దని, టిఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులే ఈ పని చేసినా ఉపేక్షించవద్దని, తొలుత వారిపైనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గతంలో నక్సలైట్ల కారణంగా అడవుల్లోకి వెళ్లడం సాధ్యం కావట్లేదంటూ అటవీశాఖ అధికారులు, సిబ్బంది సాకులు చెప్పేవారని, ఇప్పుడు రాష్ట్రంలో అలాంటి సమస్య లేదని, అడవులను కాపాడడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. పోలీసు, అటవీ శాఖల అధికారులు సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు ఇండ్లు నిర్మించుకునే సందర్భంలో 'ఎంత కావాలంటే అంత కలప అందిస్తాం' అంటూ కొందరు అధికారులు తరచూ చెపుతుంటారని సిఎం గుర్తుచేశారు. అడవుల్లో చెట్లు నరకడం వల్లనే వివిధ అవసరాలకు కలప సమకూరుతున్నదని, ఇలాంటి అక్రమాన్ని అరికట్టాలని సూచించారు.

కొత్త 'సా మిల్లు'లకు అనుమతి లేదు :

కట్టె కోత మిషన్ల (సామిల్స్) నిర్వహణపై కూడా పకడ్బందీ నియంత్రణ ఉండాలని, కొత్తగా ఎలాంటి 'సా మిల్లు'లకు అనుమతి ఇవ్వవద్దని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సూచించారు. అడవులను రక్షించడంతో పాటు, చెట్ల నరికివేత వల్ల కనుమరుగైపోయిన అడవిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. 'రూట్ స్టాక్'ను ఉపయోగించుకుని అడవుల పునరుద్ధరణ చేపట్టాలని సూచించారు. సామాజిక అడవుల అభివృద్ధి కన్నా, అటవీ ప్రాంతంలో అడవి పెంచడం సులువు అని, ఎక్కువ ఉపయోగం అని సిఎం అన్నారు.

ఇకపై ఏటా వంద కోట్ల మొక్కలు నాటాలి

'తెలంగాణకు హరితహారం' కార్యక్రమం కింద ప్రతీ ఏటా నాటే మొక్కల సంఖ్యను పెంచాలని, రానున్న వర్షాకాలం నుంచి ఏడాదికి వంద కోట్ల చొప్పున మొక్కలు నాటాలని, దీనికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ''హైదరాబాద్ నగర పరిధిలో ఒక టిన్నర లక్షల ఎకరాల మేరకు అటవీ బ్లాకులున్నాయి. కానీ అందులో చెట్లులేవు. ఈ అటవీ బ్లాకుల్లో పెద్ద ఎత్తున చెట్లను పెంచాలి. దేశ రాజధాని నగరం ఢిల్లీలో ప్రస్తుతం విపరీతమైన వాయు కాలుష్యం ఉంది. చెట్లు లేకపోవడం, వాహన కాలుష్యం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. హైదరాబాద్ నగరంలో కూడా వాహనాల సంఖ్య పెరుగుతోంది. కాలుష్యమూ పెరుగుతోంది. దీన్ని నివారించాలంటే చెట్లు పెంచడం ఒక్కటే మార్గం. అన్ని పార్కులు, అటవీ బ్లాకుల్లో విరివిగా చెట్లు పెంచాలి. వాటిలో వాకింగ్ పాత్‌లను కూడా నిర్మించి ఉపయోగంలోకి తేవాలి'' అని ముఖ్యమంత్రి సూచించారు. చెట్ల పెంపకం కార్యక్రమానికి నిధుల కొరత లేదని, కాంపా నిధులు, 'నరేగా' (గ్రామీణ ఉపాధి హామీ పథకం) నిధులు, బడ్జెట్ నిధులు, నగర పాలక సంస్థల ద్వారా వచ్చే నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చదనం పెంచడానికి తీసుకునే చర్యలకు నిధుల కొరత ఉండదని, చిత్తశుద్ధితో పనిచేయాలని సిఎం స్పష్టం చేశారు.

కోలుకుంటున్న సాయికృష్ణ

- నేడు కెటిఆర్‌ను కలవనున్న తల్లిదండ్రులు
- సిఎం కార్యాలయం నుండి సమాచారం సేకరణ
- కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ సహాయం కోరిన ఎంపి
- కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే శంకర్‌నాయక్







మన తెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి : అమెరికాలో దుండగుల కాల్పుల్లో గాయపడ్డ సాయికృష్ణ అపస్మారక స్థితి నుండి కొలుకుంటున్నట్లు మహబూబాబాద్‌లో అతని తల్లిదండ్రులు పూస ఎల్లయ్య, శైలజ తెలిపారు. ఈ నెల 3న రాత్రి 12గంటల సమయంలో అమెరికాలో మహబూబాబాద్‌కు చెందిన ఎస్‌ఎస్ పూర్తిచేసి పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్న సాయికృష్ణపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపిన సంఘటన విధితమే. కాల్పుల్లో భుజం పైన, ముఖంపైన బులెట్ గాయాలతో గాయపడ్డ సాయికృష్ణ స్పృహ కోల్పోవడంతో అతన్ని దగ్గరలో ఉన్న హేన్రి ఫోర్డ్ ఆసుపత్రిలో తల్లిదండ్రుల అనుమతితో చికిత్స పొందుతున్నాడు. అతనికి మూడు శస్త్ర చికిత్సలు చేశారని, ఇప్పుడిప్పుడే సైగల ద్వారా విషయాన్ని చెపుతున్నాడని, ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డట్లేనని అమెరికా నుంచి సమాచారం అందినట్లు వారు తెలిపారు. ఈ మేరకు సోమవారం సిఎం కార్యాలయం నుండి తమ వద్ద సమాచారం సేకరించారని, సాయికృష్ణకు సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకురావల్సిందిగా కోరారని, మంగళవారం కెటిఆర్‌ను కలిసేందుకు వారు వెళుతున్నట్లు చెప్పారు. అలాగే మహబూబాబాద్ ఎంపి అజ్మీరా సీతారాంనాయక్ కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌ను కలిసి మాట్లాడినట్లు, తమకు సహాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఫోన్‌ద్వారా తెలిపారని వారు చెప్పారు. అలాగే మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సాయికృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం నుండి తగిన సహాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు, వారిని ఓదార్చారు. ఆయనతోపాటు టిఆర్‌ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాసరెడ్డి, డిఎస్‌పి నరేష్‌కుమార్ కూడా పరామర్శించి వివరాలు సేకరించారు.

కొడుకును చూడాలని తపిస్తున్న తల్లిదండ్రులు

దుండగుల కాల్పుల్లో గాయపడ్డ సాయికృష్ణను చూడాలని అతని తల్లిదండ్రులు తపిస్తున్నారు. దేశంకాని దేశంలో తన కొడుకుకు ఎవరు ఆసరాగా ఉంటారని, తమను తక్షణమే అక్కడకు పంపించి తన కొడుకును చూసే భాగ్యం కలిగించాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు.

తొలి రోజు పంచాయతీ నామినేషన్లు

- సర్పంచ్ పదవికి 3030,
- వార్డు సభ్యుల పోస్టులకు 3827 దాఖలు
- 4479 పంచాయతీలకు గాను 4337లకే ఎన్నికల నోటీసులు



మన తెలంగాణ/హైదరాబాద్: తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థిత్వానికి మొదటి రోజు మొత్తం 3030 నామినేషన్లు వచ్చాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 4479 గ్రామ పంచాయతీలకు తొలిదఫాలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు 4337 పంచాయతీలకు రిటర్నింగ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. జగిత్యాల జిల్లాల్లో 131 పంచాయతీలకు గాను 69 పంచాయతీలకే ఎన్నికల నోటీసు ఇచ్చారు. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 80 గ్రామ పంచాయతీలు, వార్డులకు సంబంధించి ఎటువంటి రిపోర్ట్ ఇవ్వలేదని ఎన్నికల సంఘం తెలిపింది. మొదటి విడతలో 39,822 వార్డులకు గాను రిటర్నింగ్ అధికారులు 39,100 వార్డులకు నోటీసులు విడుదల చేశారు. వీటికి 3827 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా సిద్ధిపేటలో జిల్లాలో సర్పంచ్ అభ్యర్థిత్వానికి 257 నామినేషన్లు వేయగా అత్యల్పంగా (జగిత్యాల్ మినహా) జోగులాంబ గద్వాల జిల్లాలో 25 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక వార్డు సభ్యుల అభ్యర్థిత్వానికి సంగారెడ్డిలో 492 నామినేషన్లు, ఆదిలాబాద్ జిల్లాల్లో 23 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఇదిలా ఉండగా నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం, చాంలెడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.స్వరూప రాణి నిబంధనలకు విరుద్ధంగా కుటుంబ సభ్యులను నాలుగు వార్డులకు పంచడంపై ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు ఆ జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

ఆర్‌టిసి, సింగరేణి ఉద్యోగులూ పోటీకి అర్హులే

తెలంగాణ రాష్ట్ర రోడ్డ రవాణా సంస్థలో, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌లుగా పోటీ చేసేందుకు అర్హులేనని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఒక ఆర్‌టిసి ఉద్యోగి స్పష్టత కోరిన నేపథ్యంలో ఎన్నికల సంఘం సోమవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. అయితే టిఎస్‌ఆర్‌టిసి, సింగరేణిలో ఎమ్‌డి, మేనేజర్, సెక్రటరీగా ఉన్నవారు పోటీకి అనర్హులు అని చెప్పింది.

కోడ్ అక్కడికే పరిమితం

ఎన్నికల కోడ్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు 2018 మోడల్ కోడ్‌కండక్ట్‌లో 3ఎకు సవరణ చేసింది. దీని ప్రకారం గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగే ప్రాంతాలకే కోడ్ వర్తిస్తుందని, రాష్ట్రం మొత్తం కాదని తెలిపింది.

17న అసెంబ్లీ, 19న కౌన్సిల్ సమావేశాలు



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17వ తేదీన, కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 19న ప్రారంభమవుతాయని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. ఈ మేరకు లాంఛనంగా సమన్లను జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర రెండవ అసెంబ్లీ తొలి సమావేశాలు ఈ నెల 17వ తేదీన ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతాయని, కౌన్సిల్ సమావేశాలు (11వ సెషన్) ఈ నెల 19న ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతాయని గవర్నర్ పేరుతో అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీకి గత నెల 7న ఎన్నికలు జరిగి 11న ఫలితాలు వెలువడడంతో ఎన్నికైన సభ్యులంతా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. ఇందుకోసం ముఖ్యమంత్రి రెండు రోజుల క్రితం వివిధ శాఖలు, అసెంబ్లీ కార్యదర్శితో సమావేశం నిర్వహించారు. ప్రోటెమ్ స్పీకర్ చేతుల మీదుగా రెండవ అసెంబ్లీకి ఎన్నికైన సభ్యులందరి చేత ప్రమాణ స్వీకారం చేయించాల్సి ఉన్నందున ఈ నెల 16వ తేదీన సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా ఎంఐఎం చార్మినార్ శాసనసభ్యులు ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రోటెమ్ స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రభుత్వం పేర్కొంది. ఈ నెల 17వ తేదీన ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి, హోం మంత్రి సహా శాసనసభ్యులందరి చేత ప్రోటెమ్ స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అనంతరం మధ్యాహ్నం శాసనమండలి ఆవరణలోనే భోజనాన్ని అసెంబ్లీ కార్యాలయం ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం తర్వాత స్పీకర్ ఎన్నికకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమై నోటిఫికేషన్ వెలువడుతుంది. ఆ ప్రకారం ఈ నెల 18వ తేదీన స్పీకర్ ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుంది. శాసనసభాపక్ష నేతగా ముఖ్యమంత్రి కెసిఆర్, ప్రతిపక్ష నేత, వివిధ పార్టీల శాసనసభాపక్ష నేతలు కొత్తగా ఎన్నికైన స్పీకర్‌ను సీట్లో కూర్చోపెడతారు. అనంతరం బిఏసి సమావేశాన్ని నిర్వహించి తదుపరి అసెంబ్లీ సమావేశాలపై నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 11.30 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. ఆ తర్వాతి రోజు (జనవరి 20న) గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు చర్చలు జరిపిన అనంతరం సభ ఆమోదం తెలుపుతుంది.

అభివృద్ధే లక్ష్యంగా తండాల అడుగులు

మన తెలంగాణ/ చందుర్తి : పాలకవర్గాలను ఏకగ్రీవం చేసుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్న టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ ప్రకటనకు రాజన్న సిరిసిల్లా జిల్లాలో విశేష స్పందన లభిస్తుంది. ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎన్నుకుంటే ప్రభుత్వం నుండి రూ.10లక్షలు, ఎమ్మెల్యే నిధుల నుండి రూ.15లక్షలు మంజూరవుతాయని, ఆ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని గ్రామస్థులు అనుకుంటున్నారు. ఇప్పటికే పలు గ్రామాలు సమావేశం ఏర్పాటు చేసి పంచాయతీ పాలక వర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం చేయగా, తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని నూతనంగా ఏర్పడ్డ దేవుని తండా గ్రామంలో ఏకగ్రీవంగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా భూక్య పంతులు నాయక్, ఉప సర్పంచ్ గుగులోతు సునీత, వార్డు సభ్యులుగా ఆజ్మీరా ప్రమీల, భూక్య సూర్యకిరణ్, నూనవత్ పద్మ, నూనవత్ రాజు, ఆజ్మీర కవిత, నూనవత్ రాజు, భూక్య కవితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని రాజారాం తండా గ్రామ ప్రజలు సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికలను ఏకగ్రీవంం చేసుకున్నారు. సోమవారం తండావాసులు సమావేశమై గ్రామాభివృద్ధి కోసం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. సర్పంచుగా ఇస్లావత్ సరిత, ఉప సర్పంచ్‌గా చంద్రునాయక్‌లను ఎన్నుకున్నారు. తండా ఎస్టి మహిళకు కేటాయించారు. చింతకుంట గ్రామం నుండి వేరైన ఈ తండాకు రాజారం తండా గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. ఇక్కడ 177 మంది ఓటర్లు ఉన్నారు. వార్డు సభ్యులను రెండు రోజుల్లో ఏకగ్రీవం చేసుకుంటామన్నారు.

చరిత్ర తిరగరాసిన సుజాతనగర్ పంచాయతీ


మన తెలంగాణ/కొత్తగూడెం : రాజకీయాల్లో పంతానికి పట్టుదలకు నిదర్శనం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాని సుజాతనగర్ గ్రామ పంచాయతీ. ఈ పంచాయతీకి జరిగిన ఉప ఎన్నికల్లో దాదాపు మూడు దశాబ్దాల పైగా కొనసాగిన సిపిఎం పరిపాలనకు టిఆర్ఎస్ చెక్‌పెట్టి తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు అప్పటి ఎమ్మెల్యే జలగం వెంకటరావు రచించిన వ్యూహ ఫలించి కొంతకాలమైనా సరే టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఆ పంచాయతీ సర్పంచ్ పీఠమెక్కించారు. వివరాల్లోకి వెళితే జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉండే సుజాతనగర్ పంచాయతీ పాలన దాదాపు 36 ఏళ్లపాటు సిపిఎం ఆధ్వర్యంలోనే కొనసాగింది. గతంలో ఉమ్మడి సుజాతనగర్ పంచాయతీకి సిపిఎంకు చెందిన కున్సోతుధర్మ, కాసాని ఐలయ్య, గందమళ్ల భాస్కర్, కాసాని ఐలయ్య సతీమణి కాసానిలక్ష్మి దాదాపు 37 ఏళ్లపాటు సర్పంచ్‌లుగా పనిచేశారు. ఐలయ్య మూడు పర్యాయాలు 17 ఏళ్లపాటు (మూడేళ్లు ఎన్నికలు జరగలేదు), కున్సోతుధర్మ రెండు పర్యాయాలు పదేళ్లు, గందమళ్ల బాస్కర్ ఐదేళ్లు, కాసాని లక్ష్మి నాలుగేళ్లు సర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం కాసానిలక్ష్మీ అనారోగ్యం కారణంగా మృతి చెందటంతో అక్కడ ఉప ఎన్నికల అనివార్యమైంది. 2018 జనవరి 29న ఉప ఎన్నికలు జరగ్గా అందులో పుష్పావతి 1165 ఓట్ల మెజారిటీతో గెలిపొందారు. సిపిఎం బలపర్చిన అభ్యర్థి కాసాని పావనికి 2132 ఓట్లు రాగా, పుష్పావతికి 3258 ఓట్లు లభించాయి. అయితే కొంతకాలమే పదవీకాలం ఉంటుందని తెలిసినప్పటికీ ఎలాగైనా ఆ పంచాయతీలో టిఆర్ఎస్ బోణీ కొట్టాలని భావించి పోటీ చేసి గెలిచారు. సుజాతనగర్, నాయకులగూడెం, లక్ష్మిదేవిపల్లి, కోమటిపల్లి, మంగపేట, నిమ్మలగూడెం, పంచాయతీలుగా విభజించారు.

జేబు దొంగ అరెస్టు



మనతెలంగాణ, చార్మినార్ : కుమారుడికి చికిత్స కోసం విదేశం నుంచి నగరానికి వచ్చిన ఒక వ్యక్తి జేబులోని నగదను తస్కరించి పోలీసులకు పట్టుబడ్డ ఒక జేబు దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 1400 అమెరికా డాలర్లు, 5000 అఫ్ఘానీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపి ఎస్.చైతన్యకుమార్, ఇన్‌స్పెక్టర్ కె.మధు మోహన్‌రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం...సయ్యద్ మీర్‌వైస్ రహీమీది ఫరాషత్ హర్షా జిల్లా, అఫ్ఘానిస్తాన్ దేశం. అతని ఆరేళ్ళ కుమారుడు ఫయాజ్‌కు అనారోగ్యంగా ఉండటంతో నగరంలోని ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స చేయించటానికి 2018 డిసెంబర్, 29న హైదరాబాద్‌కు వచ్చాడు. ఈనెల 4న మధ్యాహ్నం ప్రార్థనల కోసమని మక్కా మసీదుకు వచ్చాడు. తన కుర్తా జేబులో 1400 యుఎస్ డాలర్లు, 5000 అఫ్ఘాని కరెన్సీని పెట్టుకున్నాడు. ప్రార్థనలనంతరం నిందితుడు మీర్జా రహమత్ బేగ్, మీర్‌వైస్ రహీమీ జేబులో గల నగదును గమనించాడు. రద్దీని అదనుగా చేసుకొని అతడు ప్రార్థనా మందిరం నుంచి బయటకు వచ్చే సమయంలో రహీమీ జేబులోని నగదును కాజేశాడు. వట్టేపల్లి నైస్ హోటల్ సమీపంలో నివసించే మీర్జా రహమత్ బేగ్ (20) పాత నేరస్థుడు. బేగంబజార్, చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ల పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డారు. చోరీలకు పాల్పడుతూ జల్సాలు చేస్తుంటాడు. ద్విచక్ర వాహనాలపై తిరగటం, హుక్కా సేవించడం అతనికి అలవాటు. దొంగిలించిన కరెన్సీని మార్చేందుకు పలు ప్రయత్నాలు చేసి విఫలమయ్యాడు. ఈ క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నగదును స్వాధీనం చేసుకొని, అతనిని తదుపరి విచారణ నిమిత్తం హుస్సేనీఆలం పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుండెపోటుతో విద్యార్థి మృతి



మన తెలంగాణ/ పూడూర్ : గుండె పోటుతో విద్యార్థి మృతి చెందిన సంఘటన పూడుర్ మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే పూడుర్ మండలం కడగండ్ల గ్రామానికి చెందిన ప్రవీన్ కుమార్ (23) సోమవారం మధ్యాహ్నం ఒయులో గుండెపోటుతో మృతిచెందాడు. విషయాన్ని గ్రామంలోని కుటుంబ సభ్యులకు తెలపడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. చేతికి వచ్చిన కుమారుడు ఇక తిరిగిరాడన్న విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మండల పరిధిలో స్నేహితులందరూ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అందరితో కలుపుగోలుగా ఉండేవాడు ఇలా చనిపోవడం ఎంతో ఆవేదనకరమని స్నేహితులు, గ్రామస్తులు విషాదవదనంతో పేర్కొన్నారు.

చలి తీవ్రతకు ఇద్దరు మృతి

మన తెలంగాణ/చెన్నారావుపేట : గత వారం రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో మండల కేంద్రానికి చెందిన కోరే కొంరమ్మ, పైసా మల్లయ్య సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ మండలాధ్యక్షులు కంది క్రిష్టారెడ్డి మృతదేహాలపై పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంటా ఎంపిటిసి కుమారస్వామి, ఎఎంసి డైరెక్టర్ రఫి, నాయకులు కుండె కుమాస్వామి, నర్సింగరావు, సాంబయ్య, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మండల కేంద్రానికి చెందిన కోరె కొంరమ్మ, పైసా మల్లయ్యలు చలి తీవ్రతతో మృతి చెందగా జడ్‌పిటిసి జున్నుతుల రాంరెడ్డి, మృతదేహాలపై పూలమాల వేసి నివాళులు అర్పించి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కుండె మల్లయ్య, మహేందర్‌రెడ్డి, బొంత శ్రీను, సూర రంజిత్ , చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

చేతివృత్తికి మరింత ఊతం

మట్టిపాత్రల తయారీపై కుమ్మరులకు ప్రత్యేక శిక్షణ



మన తెలంగాణ/నిర్మల్ ప్రతినిధి : మట్టితో తయారు చేసిన కుండలు, ప్రమిదలను చూడగానే కుమ్మరులు గుర్తుకొస్తారు. అయితే మార్కెట్‌లోకి ఎప్పటికప్పుడు కొత్తగా వస్తున్న ప్రమిదలు, కుండలు వీరి ఉపాధి అవకాశాలను దెబ్బ తీస్తున్నాయి. అదే సమయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ వృత్తిదారులు మార్పును అందిపుచ్చుకోలేకా చతికిల పడిపోతున్నారు. ఇప్పటికే వృత్తిలో కొనసాగుతున్న వారిని మినహాయిస్తే కొత్తగా వచ్చే వారు కరువవుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో కుమ్మరివృత్తి అంతరించిపోయే ప్రమాదం ఉందనే భావన అందరిలోనే నెలకొంది. ఈ నేపథ్యంలో కుమ్మరులకు ఇతర ఆవశ్యక వస్తువుల తయారీపై శిక్షణ ఇస్తే ఫలితం ఉంటుందని భావించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే బిసి కార్పొరేషన్ ద్వారా విడుతల వారిగా ప్రత్యేక శిక్షణ అందించి వారి ఉపాధికి ఊతమిచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. ఔత్సాహికులు దీనిని సద్వినియోగం చేసుకున్నారు. కుమ్మరుల వృత్తికి చెరువు మట్టే జీవణాధారం. చెరువు నుండి సేకరించిన మట్టిని తొలుత బాగా ఆరబెడుతారు. మట్టి పూర్తిగా ఆరిపోయిన తరువాత దాన్ని చుర్ణంలా చేసి జల్లెడపడుతారు. దీని వలన రాళ్లు, చెత్త వంటివి ఉంటే తొలగిపోతాయి. నాణ్యమైన మట్టి రేవు మాత్రమే మిగులుతుంది. దీనిని నీటితో కలిపి మెత్తగా చేస్తారు. కాళ్లతో బాగా తొక్కి కుండలు, ప్రమిదలు ఇతర మట్టి వస్తువులు తయారు చేసేందుకు అనువుగా మలుస్తారు. ఈ మట్టిని కుమ్మరిచక్రంపై ఉంచి దాని వేగాన్ని నియంత్రిస్తూ వివిధ రకాల వస్తువులను రూపొందిస్తారు. ఇలా తయారైన వస్తువులను బట్టిలో బాగా కాలుస్తారు. దీని వలన మట్టిలో ఉన్న నీటి కణాలు పూర్తిగా అవిరైపోతాయి. ఇలా తయారైన వస్తువులను విపనిలో విక్రయిస్తారు. ఇది వరకు కుమ్మర కుటుంబాల ఆవరణలో చాలా చోట్ల కుమ్మరి చక్రం ప్రత్యేక బట్టిలు కనిపించేవి. చెరువులోని మట్టిని సేకరించి దాని సాయంతో కుండలు, ప్రమిదలు తయాలు చేసేవారు. కుటుంబ సభ్యులంతా ఇందులో భాగస్వాములు అయ్యేవారు. అయితే వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వృత్తిలో మార్పు రాకపోవడంతో వీటిని ఆధరించే వారు తగ్గిపోయారు. తక్కువ ధరలో వివిధ రకాల అకృతుల్లో మట్టి ప్రమిదలు, ఇతర వస్తువులు విపణిలో లభిస్తుండడంతో కుమ్మరులకు పని తగ్గిపోయింది. కళ ప్రత్యేకమే అయిన తగిన మార్యదర్శనం ప్రోత్సాహం లేకపోవడంతో కుమ్మరుల ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి.

విడతల వారీగా ...

నిర్మల్ జిల్లా పరిధిలో సుమారు 12వేల కుమ్మర కుటుంబాలు ఉన్నాయి. ఇందులో కేవలం 600లోపు కుటుంబాలు మాత్రమే ఇంకా కుమ్మర వృత్తిని అంతోఇంతో కొనసాగిస్తున్నారని ఆ సంఘ నాయకులు ఇది వరకు చేపట్టిన సర్వేలో స్పష్టమైంది. అందుకే శిక్షణా తరగతులు అనివార్యమని భావించి ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఉన్నవారికి అవకాశాలు కల్పిస్తూ వృత్తిన సంరక్షించేలా విడతల వారిగా ఈ శిక్షణ అందజేస్తున్నారు. ఇందుకోసం జిల్లా పరిధిలో ఒక్కో మండలం నుండి ఇద్దరు చొప్పున మొత్తం 40 మందిని ఎంపిక చేశారు. తొలి విడతలో మట్టితో ప్రమిదలు, గణపతి విగ్రహాల తయారీపై అవగాహన కల్పించారు. రెండో విడతలో నీళ్ల సీసాలు, జెగ్గులు, టీ కప్పులు, గ్లాసుల తయారీని జిల్లా కేంద్రంలోని టిఎన్‌జిఓ భవనంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో నేర్పించారు. మూడో దఫాలో ఫ్రిజ్, కుక్కర్, వంట పాత్రల తయారీలో మెలుకువలు తెలియజేయనున్నారు. ఇవన్ని మట్టితో తయారు చేసేవే. మన్నికతో ఈ వస్తువులను తయారు చేసేలా సన్నద్ధం చేస్తుండడంతో వినియోగదారులకు ప్రయోజనం చేకూరింది.

ఆర్. రాజు/శిక్షకుడు:



నిర్మల్ జిల్లా నుండి తొలుత ఐదుగురిని ప్రధాన శిక్షకులుగా ఎంపిక చేశారు. మట్టితో నీళ్ల సీసాలు, జెగ్గు, టీ కప్పులు, గ్లాసులను తయారు చేయడంపై ఇటీవల భూధాన్‌పోచంపల్లిలో ఐదు రోజుల పాటు శిక్షణ అందించారు. అక్కడ మెలుకువలు నేర్చుకొని ఇక్కడ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 30 మందికి శిక్షణ అందించాం. మూడు రోజుల శిక్షణలో అందరూ ఉత్సాహంగా నేర్చుకున్నారు. ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఆవశ్యక వస్తువులను తయారు చేస్తుండటంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ఆశిస్తున్నాం.

కనుమరుగవుతున్న అద్దాల రవిక

- సాంప్రదాయాన్ని మింగేసిన పాశ్చాత్య సంస్కృతి
- లంబాడీలు అంటే గుర్తుకొచ్చేది వేషధారణ





మనతెలంగాణ/కారేపల్లి : లంబాడా గిరిజనులు అంటే గుర్తుకొచ్చేది ప్రత్యేక వస్త్ర ధారణ ఉన్న బంజారా మహిళ చిత్రం కళ్ళలో మెదులుతుంది.బంజారాల పండుగలు,పెళ్ళిళ్ళు, పేరంటాలకే కాదు నిత్యం ప్రత్యేకంగా తయారుచేసిన వస్త్రాలనే మహిళలు, పురుషులు ధరించేవారు. మల్లెలో తళుక్కున మెరిపించే బంజారా మహిళల వస్త్రధారణ గత చరిత్రగా మిగిలిపోతుంది. ప్రాశ్యాత్య పోకడలు బంజారాల సంస్కృతి, సంప్రదాయం అలంకారణపై గట్టి ప్రభావాన్ని చూపింది. పూర్వం బంజారా మహిళలు తమ దుస్తులను తామే చేతి అల్లికలతో కుట్టుకునేవారు. కుట్టులో ఎంత నైపుణ్యం ఉంటుందో దానిని చూస్తే అర్థమవుతుంది. దారాలతో అల్లి పూసలు, అద్దాలె, వెండిబిళ్ళలు అమర్చిన రవిక (కాళి) నడుమునుండి నెత్తివరకు ధరించే ఓణి(టుక్రి) ప్రత్యేకమైన లంగా (గాగ్రీ) అనాటి మహిళలు దుస్తులు వీటితోపాటు అలంకారం కోసం రెండు చేతులకు నిండుగా ధరించే రబ్బరు గాజులు (బలియా). వీటిమధ్యలో వెండి కడియం (కోల్డా) చెవులకు వెండి బుట్టలు (టోప్లి) ముక్కుకు బంగారపు రింగు (బురియా), కాళ్ళకు ధరించే ఇత్తడి కడియాలు (కస్యే, వాంకిడి)తోపాటు మెడలో వెండి కడియం (హస్లీ), వెండి గొలుసు(హర్) ధరించి నిండుగా సంప్రదాయం ఉట్టిపడేది. అనాటి బంజారాలు ఎక్కువగా వెండి అభరణాలను వాడేవారు. పురుషులకు ప్రత్యేక వస్త్రధారణ లేకపోయినా తప్పనిసరిగా తోకలాగా వేలాడే తలపాగా (రుమాల్) ప్రత్యేకంగా వాడేవారు. నేటి యువత అధునిక ఫ్యాషన్‌కు తగ్గటుగా ప్రాశ్యాత్య దుస్తుల (రెడీమేడ్)కు అలవాటుపడటంతో పాతకాలం గిరిజన మహిళలు తప్ప నేటితరం ఈ దుస్తులను వాడటం పూర్తిగా మరిచిపోయింది. దీనితో గిరిజన దుస్తులు ధరించిన మహిళలు చాలా అరుదుగానే పల్లెలో కనిపిస్తున్నారు. వృద్దులైన మహిళలు నేటికి సంప్రాదాయ దుస్తులను ధరిస్తున్నారు.

డ్రెస్ కుడితే కూలీ పడటం లేదు
గుగులోత్ రంగి, భాగ్యనగర్ తండా



బంజారా డ్రెస్ అసాంతం చేతికుట్టే కాబట్టి డ్రెస్‌కు ఇరవై రోజులు పడుతుంది. ఒక డ్రెస్ కుడితే రూ.1000 రోజుకు వంద కూడా పడదు. దీంతో ఖాళీ సమయంలో కుడుతుంటాం. గిరాకీ కూడా సరిగా ఉండదు. ముసలివారు తప్ప ఇప్పటివాళ్ళు ఈ రకం దుస్తులు వాడటం లేదు. మెటీరియల్‌కే ఎక్కువ ఖర్చు అవుతుంది. రేక కుడితే రూ.500 దానిలో రూ.300 దాకా అద్దాలు, దారాలు, పూసలకే పోతుంది. 30ఏండ్లనుండి ఈ డ్రెస్‌లు కుడుతున్నాను. కుట్టిన జతలను అంగడి (సంత)లో అమ్మకానికి పెడతాం.

అ దుస్తుల్లో అందమే వేరు : బాదావత్ కళ్యాణి, గిద్దవారిగూడెం

ప్రత్యేకంగా తయారుచేసిన ఈ దుస్తులు వేసుకుంటే అమ్మాయిలు అందంగా ఉంటారు. మా అమ్మమ్మ, మా నానమ్మలు వాళ్ళ బట్టలను వారే కుట్టుకునేవారు. నేటి యువత ఉద్యోగాలు, ఉపాధి పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్తుండటంతో ఆ ప్రాంతంలో చేసే పనికి అనుగుణంగా దుస్తులు ధరించాల్సి వస్తుంది. ఈ బంజారా దుస్తులు పట్టణాలలో కానరావు. పల్లెలోనే ముసలోళ్లే ధరిస్తున్నారు. ఖరీదు ఎక్కువగా ఉండటంతో ముసలివారు కూడా మామూలు దుస్తులు వేసుకుంటున్నారు.

బిజెపి నుంచి పలువురు టిఆర్ఎస్‌లో చేరిక

మన తెలంగాణ/పెద్దపల్లి : టిఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు వివిధ పార్టీల నాయకులు, యువత ఆకర్షితులై గులాబీ తీర్థం తీసుకుంటున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం బిజెపికి చెందిన కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్ పేట గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యుడు దొమ్మటి శ్రీనివాస్, తాజా మాజీ ఉప సర్పంచ్ దొమ్మటి రజితలతోపాటు లక్ష్మిపూర్ (రాయపేట) గ్రామానికి చెందిన పలువురు బిజెపి సీనియర్ నాయకులు టిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నాయకులకు గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో సిఎం కెసిఆర్ నిరుపేదల అభివృద్ధి కోసం ప్రవేశపెడుతున్న పథకాలే ఆకర్షింపచేస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసి స్వరాష్ట్రం సాధించిన టిఆర్ఎస్‌తోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామీణ ప్రజలు, నాయకులు, అధికారుల సహకారంతో మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. అనంతరం పూరెల్ల శ్రీనివాస్, మల్లెపూల కుమార్, తోట శ్రీకాంత్, సంగ శ్రీనివాస్, మహేందర్, రాజనర్సు, మధూకర్, శ్రీనివాస్, కుమార్, రమేష్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు బండ రవీందర్‌రెడ్డి, నాయకులు ఉమ్మారెడ్డి సమ్మిరెడ్డి, రవీందర్‌రెడ్డి, చేరాలు, భద్రయ్య, అశోక్, రాజేశంలు పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే టిఆర్ఎస్ కండువా కప్పారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కొట్టె రవి, తుల మనోహర్‌రావు, రాయగట్టు, కుమార్, బండ మల్లారెడ్డి, దేవేందర్ రెడ్డి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

పులి చర్మం తరలిస్తున్న ఐదుగురి అరెస్టు

మన తెలంగాణ / ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ వద్ద కారులో తరలిస్తున్న పులి చర్మాన్ని స్వాధీనం చేసుకుని అందులో ఉన్న ఐదుగురు నిందితులను అటవీ శాఖ అధికారులు ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందుతులను అటవీ శాఖ అధికారులు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఒ అప్పయ్య మాట్లాడుతూ ఇటీవల పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్న కేసులో మొత్తం ఆరుగురిని నిందితులుగా అనుమానిస్తున్నామన్నారు. అందులో ఐదుగురిని అందుపులోకి తీసుకున్నామని చెప్పారు. మరో నిందితుడి ఆచూకీ కోసం అటవీ అధికారులు విస్తృతంగా గాలిస్తున్నారని చెప్పారు. సంతోష్, రాజేందర్, నరేష్, ప్రకాష్, కిషన్, మునియా అనే ఆరుగురు వ్యక్తులకు ఈ కేసుతో సంబంధం ఉందని పేర్కొన్నారు. అయితే చంపిన పులి చర్మాన్ని రూ.ఇరవై ఐదు లక్షలకు బేరం కుదుర్చుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిందన్నారు. కేసు పూర్తి వివరాలను మరి కొన్ని రోజుల్లో వెల్లడిస్తామని పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకుల సమావేశంలో ఎఫ్‌డిఒ చంద్రశేఖర్, డిప్యూటి ఎఫ్ఆర్ఒ గులాబ్ సింగ్, ఎఫ్‌బిఒలు ప్రశాంత్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన బతుకుల్లో వెలుగు

- రూ.7 కోట్ల సబ్సిడీతో జిల్లాలో 613 ట్రైకార్ యూనిట్లు
- ఆశ్రమ స్కూళ్లలో ఉత్తమ బోధన



మన తెలంగాణ/వికారాబాద్ జిల్లా ప్రతినిధి : అడవిబిడ్డల బతుకుల్లో ట్రైకార్ వెలుగు నింపుతోంది. వ్యవసాయమే కాకుండా ఉపాధి అవకాశాలను పెంపొందించుకుంటున్నారు. ప్రభుత్వం గిరిజన ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) ద్వారా చేయూతనిస్తోంది. గడచిన ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 613 యూనిట్లు వచ్చాయి. రూ.10 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా రూ.7 కోట్ల సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.3 కోట్ల ఆర్థిక సహాయాన్ని బ్యాంకులు అందిస్తున్నాయి. ఇప్పటి వరకు తండాల్లో 200 యూనిట్లు ఉపయోగంలోకి వచ్చాయి. వాటి ద్వారా గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. మూడు మాసాలుగా ఎన్నికల కోడ్ అడ్డుపడింది. దాని వల్ల మిగిలిన యూనిట్లు ఇంకా ప్రారంభించలేదు. రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు యూనిట్‌లను అందించారు. యూనిట్ విలువ రూ.5 లక్షలకు మించరాదన్న నిబంధనలున్నాయి. ట్రైకార్ కింద 9 ప్రాధాన్యాతాంశాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. వాటిలో కిరాణాషాపులు, ఆటోలు, టెంట్‌హౌజ్‌లు, ఆటో ట్రాలీలు, గేదెలు, కోళ్ల ఫారాలు, ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు అందజేశారు. గిరిజన రైతులు వ్యవసాయం చేసేందుకు సబ్సిడీ ట్రాక్టర్లు మంజూరు చేశారు. చాలా మంది సద్వినియోగం చేసుకుంటున్నారని జిల్లా గిరిజన సంక్షేమాధికారి రత్నం పోటాజీ తెలిపారు. ఎన్నికల తర్వాత మిగిలిన లబ్దిదారులకు యూనిట్లను అందజేస్తామని చెప్పారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గిరిజన తండాల్లో యూనిట్లు వెలిశాయి. పరిగి సెగ్మెంట్‌లోని కులకచర్ల, దోమ, తాండూరు సెగ్మెంట్‌లో పెద్దేముల్, బషీరాబాద్, కొడంగల్ నియోజకవర్గంలో బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో ఎక్కువ తండాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా లక్ష వరకు గిరిజన జనాభా ఉంది. ఇక గిరిజన ఆశ్రమ పాఠశాల ద్వారా విద్యార్థులకు సకల వసతులు లభిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వం ఖరీదైన స్పోర్ట్స్ బూట్లు, బట్టలు, క్రీడా వసతులు, పుస్తకాలు, ట్యూషన్లు, ఇతర సామగ్రి అందజేస్తోంది. జిలాలలో ఆరు ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మర్పల్లి, కులకచర్లలో బాలుర, బండవెనకచర్ల, రాంపూర్, బొంరాస్‌పేటలో బాలికల పాఠశాలల్లో విద్యార్థుల బోధన సాగుతోంది. వాటితో పాటు జిల్లా వ్యాప్తంగా ఐదు గిరిజన హాస్టళ్లను విద్యార్థులను సద్వినియోగం చేసుకుంటున్నారు. వికారాబాద్, తాండూరు, ముజాహిద్‌పూర్, పరిగి, కొడంగల్‌లో ఉన్నాయి. వికారాబాద్, పరిగిలో కళాశాల హాస్టళ్లు పని చేస్తున్నాయి. బండవెనకచర్లలో ప్రభుత్వ ఆశ్రమ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ ఆశ్రమ స్కూళ్లు, కళాశాలల్లో 3800 గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యాసంవత్సరానికి ఉచిత దుస్తులు, గ్లాసులు, ప్లేట్లు, స్పోర్ట్స్ బూట్లు, స్పోర్ట్స్ డ్రెస్సులు, బెడ్డింగ్ సామగ్ర అందజేశారు. ఈసారి రూ.4 లక్షల విలువైన రగ్గులు పంపిణీ చేశారు. 453 మంది టెన్త్ విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ గైడ్లు అందజేశారు. డిక్షనరీ, కంపాక్స్ పంపిణీ చేశారు. గతేడాది 90 శాతం ఫలితాలు సాధించినందున ఈసారి కూడా మంచి ఫలితాలు సాధించాలని ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ప్రతి విద్యార్థికి ట్యూషన్ కూడా చెప్పిస్తున్నారు. నాలుగు సబ్జెక్టులకు ప్రత్యేక టీచర్ల ద్వారా తరగతులు బోధిస్తున్నారు. ఫిబ్రవరి నుంచి టెన్త్ పరీక్షలకు సన్నాహక క్లాసులు ఇప్పించనున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బంకర్ బెడ్లు అందజేసింది. ప్రభుత్వం మెస్‌ఛార్జీలను పెంచడం వల్ల వారికి ఎంతగానో మేలు చేకూరుతున్నది. ఇటీవల విద్యార్థులు క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. డిసెంబరు 24న ప్రారంభమైన జిల్లా స్థాయి క్రీడల్లో గిరిజన ఆశ్రమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందుకోసం సోమవారం 40 మంది విద్యార్థులు భద్రాచలం బయలుదేరారు. ఈనెల 8, 9, 10వ తేదీల్లో పోటీలు జరుగనున్నాయి.

నేడు, రేపు దేశవ్యాప్త బంద్

- ట్రేడ్ యూనియన్ల పిలుపుతో రోడ్డుపైకి రానున్న కార్మికసంఘా లు
- నిలిచిపోనున్న ప్రజారవాణా
- కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైలురోకో, రోడ్డురోకోలు



మన తెలంగాణ/హైదరాబాద్ :దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునివ్వడంతో ప్రజా వ్యవస్థకు ఇబ్బందులు కలగనున్నాయి. ఈనెల 8,9వ తేదీల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు భారత్‌బంద్‌తో పాటు సమ్మెకు పిలుపునిచ్చాయి. కార్మికసంఘాల పిలుపుమేరకు ఈ బంద్‌లో బ్యాంకు ఉద్యోగ సంఘాలు కూడా పాల్గొనాలని నిర్ణయించాయి. అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. ట్రేడ్ యూనియన్ల బిల్లు 2018 సవరణ ద్వారా ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని సిఐటియు జాతీయ కార్యదర్శి తపన్‌సేన్ గుప్తా ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈ బిల్లు ఆమోదం పొందితే కార్మిక సంఘాల అధికారాలకు తెరపడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి 4 లేబర్ కోడ్‌లను మారుస్తోందని, కనీస వేతనాలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మార్చడం లేదని కార్మికసంఘాలు ఆరోపిస్తున్నాయి. దేశ ప్రజలకు నష్టం కలిగించేలా పెద్దనోట్ల రద్దు, జిఎస్టి, ప్రభుత్వ రంగ బ్యాంకులను నాశనం చేసేలా ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం తదితర విధానాలను అవలంభిస్తోందని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తోందని, ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేయడంలో భాగంగా 15 మంది కోటీశ్వరులకు రూ.4.50 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను ఎత్తివేసిందని కార్మికసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

సమ్మెలో 10 పెద్ద ట్రేడ్ యూనియన్లు

ఈ సందర్భంగా కార్మికసంఘాలు తమ 12 డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచినట్టు తెలిపాయి. 10 పెద్ద ట్రేడ్ యూనియన్లు ఈ సమ్మెలో పాల్గొననున్నట్టు కార్మిక సంఘాలు తెలిపాయి. ఆలిండియా కిసాన్ మహాసభ కూడా ట్రేడ్ యూనియన్ల సమ్మెను స్వాగతించింది. ఈ సమ్మెలో భాగంగా భారత్‌బంద్, రైల్‌రోకో, రోడ్‌రోకో, నిరసన ప్రదర్శనలు, ఇతర ఆందోళనలు నిర్వహించనున్నారు. పబ్లిక్ సెక్టార్, చిన్న పరిశ్రమలు, ప్రైవేటు రంగ ఉద్యోగులు, నౌకాశ్రయాల్లో పనిచేసే వారు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఉద్యోగులు ఈ బంద్‌లో పాల్గొననున్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగానికి వ్యతిరేకంగా ఈ బంద్ చేపట్టనున్నట్టు కార్మిక సంఘాలు ప్రకటించాయి. కార్మిక సంఘాల భారత్‌బంద్ పిలుపు మేరకు ఆల్ అస్సాం స్టూడెంట్ యూనియన్, మరో 30 ప్రజా సంఘాలు కూడా 8న అస్సాం బంద్‌కు పిలుపునిచ్చాయి. నార్త్ ఈస్ట్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ కూడా ఈ బంద్‌లో పాల్గొననున్నట్టు ప్రకటించింది. అస్సాంతోపాటు 7 ఈశాన్య రాష్ట్రాలు కూడా పాల్గొననున్నాయి.

బిజెపి హయాంలో పెరిగిన రైతు ఆత్మహత్యలు: రైతుసంఘం

రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం ఓ ప్రకటనలో పిలుపునిచ్చింది. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆరోపించింది. ప్రకృతి వైపరీత్యాల పరిహారం చెల్లించ లేదని, బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదని, 2018 ఆగస్టు 9న జైల్‌భరో, ఆగస్టు 14న జనజాగరణ, సెప్టెంబర్ 5న ఢిల్లీ ర్యాలీ, నవంబర్ 29, 30వ తేదీల్లో ఢిల్లీలో ర్యాలీ జరిగినప్పటికీ కేంద్రం సమస్యలు పరిష్కరించడానికి ముందుకు రాలేదని ఆ సంఘం ఆరోపించింది. ఈనేపథ్యంలో 12 డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందుంచినట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. 8,9వ తేదీల్లో జరిగే దేశవ్యాప్త బంద్‌లో భాగంగా గ్రామబందు, రాస్తారోకో, రైలురోకోలు జయప్రదం చేయాలని రైతుసంఘం పిలుపునిచ్చింది.

దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా పట్టివేత

- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పి విష్ణు ఎస్ వారియర్
- చోరీ వస్తువులు స్వాధీనం... నిందితుల్లో ఒకరు పరార్



మన తెలంగాణ / ఆదిలాబాద్ : ఆదిలాబాద్ వన్ టౌన్, టూటౌన్, రూరల్, మవాల పోలీసు స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని ఆదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ పోలీసు హెడ్ క్వార్టర్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మవాలలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మహ్మద్ మోయిస్, రాంనగర్‌కు చెందిన రాంటెంకి రాజేశ్వర్, సలీంలు జిల్లా కేంద్రంలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వీరు 20 వరకు దొంగతనాలు చేశారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. సోమవారం ఉదయం పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు పంచాయతీ ఎన్నికల సందర్భంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం రావడంతో విచారించారు. అయితే వీరు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో ఒప్పుకున్నారని విలేకరుల సమావేశంలో పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి 20 లక్షల 80వేల నగదుతోపాటు ఆటో, మూడు కిలోల గంజాయి, ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 20 దొంగతనాల్లో వీరు 29 లక్షల 80 వేలను అపహరించగా అందులో నుంచి 20 లక్షల 80 వేలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మహ్మద్ మోయిస్, రాంటెంకి రాజేశ్వర్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి మోహన్, డిఎస్పి నర్సింహారెడ్డి, రూరల్



సిఐ ప్రదీప్, ఎస్ఐ హరిబాబు, మవాల ఎస్ఐ ముజాహిద్, ఎల్ రాజు, గంగాధర్, హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ సిరాజ్ ఖాన్, కానిస్టేబుళ్లు సురేష్, విజయ్ ప్రభాకర్, మహిళ కానిస్టేబుల్ సోని తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలతో కళకళలాడుతున్న పాఠశాల



మన తెలంగాణ/నవాబ్‌పేట్ : ప్రాథమికోన్నత పాఠశాలకు కలర్ వేయించి, స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాలు వేయించడంతో పాఠశాల అందంగా కళకళలాడుతుందని ఎంఇఒ గోపాల్ ప్రశంసించారు. సోమవారం నవాబ్‌పేట్ మండలంలోని మాదారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రమీల, గ్రామ సర్పంచ్ రాములు సంయుక్త ఆధ్వర్యంలో రూ.60 వేల ఖర్చుతో పాఠశాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారని ఆయన కొనియాడారు. ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 7వ తరగతి వరకు తరగతులు నడుపబడుతున్నాయన్నారు. పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య 76. పాఠశాలలో ప్రతి తరగతి గదిని పరిశీలించి స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాలు బాగున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని పాఠశాలలను ఇదే మాదిరిగా చేస్తే ఆదర్శపాఠశాలలుగా రూపాంతరం చెందుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సర్పంచ్ సమక్షంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ కలర్, చిత్రాలు వేయించేందుకు ఖర్చు ఎవరెవరు భరించారని ఆయన ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, దాతల ఆర్థిక సహకారంతో కలర్, స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాలు వేయించామని ఆయన చెప్పారు. గతంలో గ్రామ సర్పంచ్ రాములు పాఠశాలకు పోడి యం, కుర్చీలు, బ్యాండ్, డ్రమ్ ఇచ్చారన్నారు. గ్రామం యూత్ సంఘాలు బెంచీలు కూడా అందజేశారని ఎంఇఒకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, రాణి, పూలమ్మ, వసంత, లత, విద్యా వాలంటీర్స్ అనిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏడుపాయలలో వేలం పాట

మన తెలంగాణ/పాపన్నపేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవాని మాత ఆలయంలో మాఘఅమావాస్య మహాజాతర ఉత్సవాలకు సంబంధించి వివిధ వస్తువుల విక్రయాలకు సంబంధించిన వేలం పాట నిర్వహించనున్నట్లు పాలక మండలి చైర్మేన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఇఒ మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన నిర్వహించే వేలం పాటకు సంబంధించి ఆసక్తిగల అభ్యర్థులు దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో మెదక్ ఇండియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సొమ్మును జమచేసి డ్రాఫ్ట్‌తో వేలంలో పాల్గొనాలని తెలిపారు. జాతరలో విక్రయించే కొబ్బరి కాయలు, బొండాలకు గాను రూ.6 లక్షలు, ఒడి బియ్యం పోగుచేసుకునే హక్కు కోసం రూ.3 లక్షలు, జాతర అనంతరం 9 నెలల పాటు కొబ్బరికాయలు విక్రయించుకునే హక్కు కోసం రూ.6 లక్షలు, ఒడి బియ్యం పోగు చేసుకునే హక్కు కోసం రూ.6లక్షలు, దేవస్థానం వద్ద టెంట్లు, వంట సామగ్రి సమకూర్చేందుకు రూ.6లక్షలకు డిమాండ్ డ్రాఫ్ట్‌తో ఈ వేలం పాటలో పాల్గొనాలని వారు తెలిపారు.

ఆన్‌లైన్ స్లాట్ విధానం సక్సెస్

- మధ్యాహ్నం వరకు రోజుకు 18 మందికి అవకాశం
- అమ్మకం, కొనుగోలు దారులకు కలిసివస్తున్న సమయం
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో నూతన ఒరవడి



మన తెలంగాణ/హైదరాబాద్ : వినియోగదారుల సౌకర్యం కోసం రిజిస్ట్రేషన్ శాఖ మరిన్ని ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెట్టాలనుకుంటోంది. గతంలో మ్యారేజ్‌కు సంబంధించిన ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకునేలా కొత్త విధానానికి శ్రీకారం చుట్టిన తరహాలోనే పాస్‌పోర్టు విధానానికి అవలంబిస్తున్న విధానంలాగ ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న వారికి భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకునేలా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా నూతన విధానాన్ని తీసుకురావాలనుకుంటోంది. పైలట్ ప్రాజెక్టు పద్ధతిన కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేసిన ఈ విధానం విజయవంతం అయినట్టు అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మకందారులు, కొనుగోలుదారుల సమయం కలిసిరావడంతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయంలో వినియోగదారుల తాకిడి తగ్గుతుందని ఆ శాఖ భావిస్తోంది. ప్రస్తుతం అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం వలన చాలావరకు రిజిస్ట్రార్లపై ఒత్తిడి తగ్గిందని పేర్కొన్నారు. మధ్యాహ్నం వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు మాత్రమే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తుండడంతో కొంతమేర సిబ్బందికి పనిభారం తగ్గిందని పేర్కొన్నారు.

141 సబ్ రిజిస్ట్రార్ కార్యాల-యాల్లో

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దీనిని ప్రవేశపెట్టాలని గతంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజి సర్క్యులర్ జారీ చేసింది. రోజుకు 18 మంది చొప్పున ఆన్‌లైన్ విధానంలో స్లాట్‌ను బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేయించుకునేలా విధి, విధానాలను రూపొందించింది. ఉదయం 10.30 గంటల నుంచి 1.30 నిమిషాల వరకు స్లాట్ బుక్ చేసుకున్న వారికి సమయం కేటాయిస్తుంది. స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అదేరోజున డాక్యుమెంట్లను అందచేస్తోంది. స్లాట్ కేటాయించే సమయానికి నేరుగా సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి భూమి లేదా, ప్లాట్, ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు కొనుగోలుదారులు డాక్యుమెంట్ రైటర్ వద్ద డాక్యుమెంట్ తయారుచేసుకొని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించేవారు. ఆ తరువాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు డాటా ఎంట్రీ చేసి రిజిస్ట్రేషన్ చేసేవారు. కానీ ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నప్పటి నుంచి కొనుగోలుదారులే ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ పూర్తి చేసుకొని డాక్యుమెంట్‌ను తయారు చేసుకునే విధానం అమలలోకి వచ్చింది.

నవంబర్ 1వ తేదీ నుంచి ఈ విధానం

ఇలా నవంబర్ 1వ తేదీ నుంచి ఈ విధానం అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు. చాలాచోట్ల దీనికి అనూహ్య స్పందన వస్తున్నట్టు అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల మాత్రం వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో యధావిధిగా స్లాట్ బుక్ చేసుకోకుండా కార్యాలయాలకు వస్తుండడంతో దీనిపై మరింత ప్రచారం కల్పించాలని ఆ శాఖ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లతో పాటు వచ్చిన స్లాట్‌లకు సంబంధించిన డాటాను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. కొన్ని కార్యాలయాల్లో అసలు స్లాట్‌ను బుక్ చేసుకోలేదని, మరికొన్ని చోట్ల అరకొరగా స్లాట్ బుకింగ్‌లు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే ముందు ఆన్‌లైన్ ప్రీ రిజిస్ట్రేషన్ డాటా ఎంట్రీకి అవకాశం ఇవ్వడం వలన ప్రజలు తమ ఇళ్ల నుంచే ఇంటర్నెట్ ద్వారా డాక్యుమెంట్‌ను తయారు చేసుకునేలా ఆ శాఖ ప్రొఫార్మాను రూపొందించింది. ఎలక్ట్రానిక్ చలానా నమూనాతో పాటు ఆ రుసుము వివరాలు కూడా రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోనే ఉంచారు. ఆన్‌లైన్ డాక్యుమెంట్ ఎంట్రీ పూర్తి కాగానే పది అంకెలతో కూడిన నంబర్ వస్తుంది. ఆ నంబర్ సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తే వెంటనే దానిని ఆన్‌లైన్‌లో చూసి తప్పులు ఉంటే సరిచేస్తారు. దీనివలన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిభారం తగ్గడంతో పాటు ప్రజలకు సమయం కూడా ఆదా అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం

స్టాంపులు, రిజిస్ట్రేషన్ కమిషనర్ చిరంజీవులు

ఆన్‌లైన్ స్లాట్ విధానం వలన అందరికీ సమయం కలిసి వస్తుంది. చాలాచోట్ల ఈ విధానం సక్సెస్ అయ్యింది. కొన్ని చోట్ల దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం కల్పించాలని నిర్ణయించాం. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. ఈ విధానం వలన సిబ్బంది, అధికారులపై పనిభారం తగ్గింది.

పాములు విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు



మన తెలంగాణ / హైదరాబాద్ : పాములు విక్రయిస్తున్న ఇద్దరిని అటవీశాఖ అధికారులు ఘట్‌కేసర్ మండలంలోని చౌదర్‌గూడ గ్రామంలోని ఒక ఇంట్లో అదుపులోకి తీసుకున్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద వారిపై కేసులు నమోదు చేసి రెండు పాములను స్వాధీనం చేసుకున్నారు. పైథాన్ అనే ముఖ్యమైన ఒకటవ రకం జాతికి చెందిన పాములను విక్రయించడానికి కొద్దిమంది ప్రయత్నిస్తున్నారనే సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు మేడ్చేల్ జిల్లా ఘట్కేసర్ మండలం చౌదర్‌గూడ గ్రామంలోని ఇంటికి చేరుకున్నారు. ఆ ఇంటిలో సోదాలు చేయగా పైథాన్, బ్రాంజ్ బ్యాక్ పాములుగా గుర్తించారు. చట్ట విరుద్ధంగా వీటిని అమ్మేందుకు ప్రయత్నించడంతో పాటు ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో వీటిని మెడలో వేసుకొని ప్రదర్శించే ఫొటోలు పెట్టారు. కొనుగోలుదారులను ఆకర్షించడానికే ఇలా పోస్టింగ్‌లు చేసినట్లు అధికారులు గుర్తించారు. వీటిని విక్రయించేందుకు ప్రయత్నించిన శరన్ మోస్‌తోపాటు వనోరస్ ప్రవీణ్‌లపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు నమో దు చేశారు. రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌లో హాజరుపర్చడంతో వీరిని మూడు నుంచి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమాను విధించినట్లు అధికారులు వివరించారు.

కెటిఆర్‌ను కలిసిన టిటిఎఫ్ నాయకులు



మనతెలంగాణ/హైదరాబాద్ : పాఠశాల విద్యాశాఖలో హేతుబద్ధమైన సర్వీసు రూల్స్ రూపొందించి వెంటనే పదోన్నతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తెలంగాణ భవన్‌లో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు మధ్యంతర భృతిని ప్రకటించాలని, సిపిఎస్ విధానం రద్దు చేయాలని కోరారు. కెటిఆర్‌ను కలిసిన వారిలో టిటిఎఫ్ అధ్యక్షుడు ఇ.రఘునందన్, ప్రధాన కార్యదర్శి కె.రమణ, నాయకులు పి.వెంకటేష్, డి.రాజయ్య, సుమిత్రానంద్, జి.వేణుగోపాలరావు, వి.చంద్రం తదితరులు ఉన్నారు.

కేంద్ర కేబినెట్ నిర్ణయంపై బ్రాహ్మణ ఫ్రంట్ హర్షం

మన తెలంగాణ/హైదరాబాద్ : అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ల కోసం కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై బ్రాహ్మణ ఫ్రంట్ అఖిల భారత ఉపాధ్యక్షులు వల్లూరి పవన్‌కుమార్, గంగు ఉపేంద్రశర్మలు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఈ నిర్ణయం వలన అగ్రవర్ణాలైన బ్రాహ్మణ, కమ్మ, వెలమ, రెడ్డి, ఆర్య వైశ్య, రాజవంశస్థులు, రాజ్‌పుత్‌లకు మేలు కలుగుతుందని వారు పేర్కొన్నారు. అగ్రకులాల వారికి విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అగ్రవర్ణాల్లోని పేదల ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. 2018 అక్టోబర్ నెలలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో బ్రాహ్మణ జాతీయ ఫ్రంట్‌లో 24 రాష్ట్రాల బ్రాహ్మణ నాయకులు చేసిన తీర్మానాలు చూసి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. సిఎం కెసిఆర్ కూడా అగ్రవర్ణాల్లోని పేదలకు న్యాయం చేయాలని ఆలోచిస్తున్నారని ఆయన తెలిపారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో అగ్రవర్ణాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

13 నుంచి స్వీట్ ఫెస్టివల్..వెయ్యికిపైగా రుచులు



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రతీ ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పతంగుల ఉత్సవంతోపాటు ఈసారి మిఠాయిల ఉత్సవం (స్వీట్ ఫెస్టివల్) కూడా నిర్వహిస్తోంది. ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ స్వీట్ ఫెస్టివల్‌లో నగరంలోనూ, తెలంగాణ రాష్ట్రంలో స్థిరపడిన వివిధ రాష్ట్రాలు, విదేశీయులు స్వయంగా ఇండ్లలో తయారు చేసిన మిఠాయిలు, తీపి పదార్థాలను ప్రదర్శనకు ఉంచుతారని రాష్ట్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. కైట్ ఫెస్టివల్‌తో పాటే స్వీట్ ఫెస్టివల్ కూడా ఉంటుందని తెలిపారు. నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే స్వీట్ ఫెస్టివల్‌లో ఈసారి వెయ్యికి పైగా మిఠాయిల రుచులు ఉంటాయని తెలిపారు. గతేడాది జరిగిన స్వీట్ ఫెస్టివల్‌కు సుమారు ఎనిమిది లక్షల మంది హాజరయ్యారని, ఈసారి అది పదకొండు లక్షలకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఈసారి కైట్ ఫెస్టివల్‌కు 19 దేశాల నుంచి 42 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్లు, 60 మంది జాతీయ కైట్ ఫ్లయర్లు హాజరవుతున్నారని తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు జరిగే పతంగుల ఉత్సవంలో భారీ స్థాయి పతంగులు కూడా ఉంటాయని తెలిపారు.

స్వీట్ ఫెస్టివల్‌లో ఐదు వేల మంది

కైట్ ఫెస్టివల్‌తోపాటు జరిగే స్వీట్ ఫెస్టివల్‌లో ఈసారి వెయ్యికిపైగా మిఠాయిల రుచులు ఉంటాయని, సుమారు ఐదు వేల మంది పాల్గొంటున్నారని నిర్వాహకురాలైన మలయాళీ అసోసియేషన్ కన్వీనర్ లిబ్బీ బెంజమిన్ తెలిపారు. 'కిచెన్ టు ఎరీనా' అనే నినాదంతో ఈసారి వంటింట్లోని తీపి రుచులను యావత్తు ప్రపంచానికి తెలియజేసేలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతేడాది స్వీట్ ఫెస్టివల్‌ను సుమారు ఏడున్నర లక్షల మంది సందర్శించారని, ఈసారి ఆ సంఖ్య పది లక్షల వరకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కుల మత ప్రాంతాలకు అతీతంగా అన్ని రకాల రుచులను అందించడం ఈ ఫెస్టివల్ ఉద్దేశమని తెలిపారు.

పోలియో బాలుడికి కెటిఆర్ చేయూత



మన తెలంగాణ / హైదరాబాద్ : పోలియో వ్యాధితో రెండు కాళ్ళు దెబ్బతిన్న రామగుండం నియోజకవర్గానికి చెందిన శివసాయి అనే బాలుడికి టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేయూతనందించారు. తక్షణమే శివసాయిని ఆస్పత్రిలో చేర్పించాలని గ్రేటర్ హైదరాబాద్ టిఆర్ఎస్ నేత కట్టెల శ్రీనివాస్ యాదవ్‌ను ఆదేశించారు. బాలుడి వైద్యానికయ్యే మొత్తం ఖర్చును తానే భరిస్తానంటూ కెటిఆర్ హామీ ఇచ్చారు. రామగుండం నియోజకవర్గ ఎంఎల్‌ఏ చందర్‌తో తెలంగాణ భవన్‌కు వచ్చిన శివసాయి కెటిఆర్‌ను కలిసి తన ఆవేదనను వివరించారు. వైద్య ఖర్చుల కోసం పడుతున్న ఇబ్బందులను తెలిపారు. పోలియో కారణంగా చదువుకోడానికి ఎదురవుతున్న సమస్యలను కూడా కెటిఆర్‌కు విన్నవించుకున్నాడు. అన్ని విధాలా ఆదుకుంటానని శివసాయికి కెటిఆర్ హామీ ఇచ్చి పార్టీ తరఫున పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని భరోసా కల్పించారు. ఆ మేరకు పార్టీ కార్యకర్తలకు కూడా కెటిఆర్ ఈ బాలుడి విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

రామయ్యను దర్శించుకున్న హైకోర్టు జస్టిస్



మన తెలంగాణ / భద్రాచలం : సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని హైకోర్టు జస్టిస్ ఎ రాజశేఖరరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. సోమవారం ఆయనకు దేవస్థానం సిబ్బంది ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాన్ని, భక్తాంజనేయస్వామి వారి ఆలయాన్ని దర్శించుకుని తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను వివరించి, ఆశీర్వచనాలు పలికారు.

దూసుకురానున్న 5G



టెక్నాలజీ రోజురోజుకు ముందుకు దూసుకుపోతోంది. దానికి తగ్గట్లుగానే 1జీ, 2జీ, 3జీ అంటూ ఒక్కో జనరేషన్ అమితవేగంతో ముందుకొస్తోంది. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏంటంటే 4జీ పూర్తి స్థాయిలో రానే లేదు. ఇప్పుడు 5జీ అంటూ ప్రపంచం ఉరుకులు పరుగులు పెడుతోంది. మొబైల్ నెట్‌వర్క్, కమ్యూనికేషన్ రంగంలో ఇప్పటి వరకు మనం 2జీ, 3జీ, 4జీ టెక్నాలజీలను చూశాం. ఈ క్రమంలో చాలా ప్రాంతాలలో ఇప్పటికే 4జీ నెట్ వర్క్ అందుబాటులో ఉంది. 4జీ సేవలకంటే గొప్ప అనుభూతిని 5జీ పరిచయం చేయనుంది. వీటివల్ల ఉపయోగాలు.. ఎలా పనిచేస్తాయి. దీనిపై ఓ స్మార్ట్ లుక్కేయండి..

5 జీ అంటే ఫిఫ్త్ జనరేషన్ మొబైల్‌ఫోన్ టెక్నాలజీ. మొబైల్‌ఫోన్, ఇంటర్నెట్ సేవలు అందించే ఐదో తరం నెట్‌వర్క్ టెక్నాలజీ అన్నమాట. కొంచెం వివరంగా చూస్తే.. మొబైల్‌ఫోన్ నెట్‌వర్క్ టెక్నాలజీ సుమారుగా ప్రతి పదేళ్లకోసారి సమూలంగా మారిపోతుంది. తొలుత 1980వ దశకంలో మొదటి తరం(1జీ) టెక్నాలజీ ఆధారంగా మొబైల్‌ఫోన్ సేవలు అందాయి. తర్వాత 1990వ దశకంలో రెండో తరం(2జీ), 2000 నుంచి మూడోతరం (3జీ), 2004 నుంచి నాలుగో తరం(4జీ) అన్నమాట. ఈ 5జీతో రెప్పపాటులో సినిమా డౌన్‌లోడ్ అయిపోతుంది. వాయిస్, వీడియో కాల్స్ చేస్తే ఒక్క సెకను కూడా అంతరాయం కలగదు. మొబైల్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు.. డివైస్ ఏదైనా సరే.. ఇలా బటన్ నొక్కి కమాండ్ ఇచ్చేలోపే అలా సమాచారం ప్రత్యక్షమైపోతుంది. కొత్త తరం టెలికమ్యూనికేషన్స్ టెక్నాలజీ '5జీ' రాకతో ఇవన్నీ సాధ్యం కానున్నాయి.

టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. తరం మారుతున్న కొద్దీ నెట్‌వర్క్ సేవలు అనూహ్యంగా వేగం పుంజుకున్నాయి. ప్రస్తుతం అత్యధిక వేగంగా పనిచేసే 4జీ నెట్‌వర్క్ 1800 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీలో పనిచేస్తుంది. 4జీ వేగం 42 ఎంబీపీఎస్ కాగా, 5జీ వేగం సెకనుకు 10 గిగా బిట్స్. వీడియోలు, ఫొటోలు, ఫోన్‌కాల్స్ ఇప్పటి కన్నా 16 రెట్లు స్పష్టంగా అందుతాయి. మొబైల్‌ఫోన్, ఇంటర్‌నెట్ సేవల ప్రసారంలో విరామం 4జీ నెట్‌వర్క్‌లో 60 మిల్లీ సెకన్లు. 5జీ నెట్‌వర్క్‌లో ఈ విరామం దాదాపుగా జీరో సెకను. 5జీ రాకతో టెలీకమ్యూనికేషన్స్‌లో సమూల మార్పులు వస్తాయి.5జీ నెట్‌వర్క్‌లో సిగ్నళ్లు 73,000 మెగా హెర్ట్జ్ హైఫ్రీక్వెన్సీలో ప్రసారమవుతాయి. అంతేకాదు ఫేస్‌బుక్, గూగుల్ కంటే ఎక్కువ డేటాను ఈ 5జీలో పొందవచ్చు. 5జీ సిగ్నళ్లను వాడుకోవాలంటే మొబైల్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లకు కొత్త సాంకేతిక మార్పులు తప్పనిసరి. కొత్త వైఫైలు, రిసీవర్లు, కొత్త మొబైల్‌ఫోన్ టవర్లు కూడా అవసరం. ఇప్పటికే భారతీ ఎయిర్టెల్, చైనా టెలికాం విక్రయకర్త హూవై భారతదేశం లో మొట్ట మొదటి 5G నెట్‌వర్క్ పరీక్షను విజయవంతంగా నిర్వ హించారు. కేంద్ర ప్రభుత్వం కూడా 4జీ సేవల కంటే మెరుగయిన 5జీ సేవలను అందిం చడానికి సన్నద్ధమౌ తోంది. పూర్తి స్థాయిలో ఈ 5జీ సేవలను ఆనందించ డానికి మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

ఏం చేసినా డిఫరెంటే..!





ఎప్పుడూ సోషల్ మీడియాలో తనదైన మార్క్‌తో హల్‌చల్ చేసే బిగ్‌బి అమితాబ్‌బచ్చన్ ఇన్‌స్ట్రాగామ్‌లో తాజాగా చేసిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పోస్ట్‌ని చూసిన కొందరు బిగ్‌బిని ప్రశంసిస్తుంటే మరికొందరు విమర్శిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఇంతకీ విషయమేంటని అనుకుంటున్నారా.. అమితాబ్ తన ఆకారాన్ని పోలి వున్న నల్లని రాయికి కాస్త షేడింగ్ చేసి, తెల్లని పెయింట్‌తో తన గడ్డాన్ని వేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. అంతే కొందరూ మా బిగ్‌బి ఏం చేసినా డిఫరెంటే అంటుంటే, మరికొందరు ఏమిటీ వికృత చేష్టలని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మీరేమైనా దేవుడా అంటూ మరికొందరు ప్రశ్నించారు. కానీ ఏది ఏమైనా సెలబ్రిటీలు ఏం చేసినా ఒక ట్రెండే. అప్‌లోడ్ చేసిన కొన్ని గంటలలోనే ఈ పోస్ట్ వేల లైక్స్‌ని సొంతం చేసుకుంది.

అదిరేటి లుక్‌తో రకుల్

హల్‌చల్



తెలుగు, హిందీ, తమిళ భాషలలో సినిమాలు చేస్తూ ఎప్పుడూ బిజీబిజీగా గడిపే రకుల్ ప్రీత్‌సింగ్ సమయం దొరికితే చాలు జిమ్‌కి వెళ్ళి కసరత్తులు చేస్తుంది. ఫిట్‌నెస్ అంటే ప్రాణం పెట్టే ఈ అమ్మడు మిగతా హీరోయిన్స్‌కి సాధ్యం కాని బరువులను సైతం అవలీలగా ఎత్తేస్తుంది. అంతే కాదు ఫిట్‌నెస్ పై మక్కువతో ఈ ముద్దుగుమ్మ సెలబ్రిటీల కోసం గచ్చిబౌలిలో సొంతంగా జిమ్‌ని కూడా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సినిమాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఫిట్‌గా ఉండే రకుల్ తాజాగా ఎయిర్‌పోర్ట్‌లో తళుక్కున మెరిసింది. వైట్ ప్యాంట్, టాప్ జాకెట్‌తో అదిరిపోయే డ్రెస్‌తో కనిపించిన రకుల్‌ని చూసి అభిమానులు మంత్రముగ్ధులయ్యారు. ఇప్పుడు ఆ ఫోటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తూ అందరి మదిని కొల్లగొడుతున్నాయి.

సీఎం భార్య డాన్స్ అదుర్స్

వైరల్





మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సతీమణి అమృత డాన్సింగ్ టాలెంట్‌తో అదరగొట్టింది. కుమార్తెతో కలిసి బాలీవుడ్ మూవీ బాజీరావ్ మస్తానీ సినిమాలోని పాటకు అదిరిపోయే స్టెప్పులేసింది. ఈ వీడియోను అమృత తన సోషల్ మీడియా అకౌంట్లలో పోస్ట్ చేసింది. తన కూతురితో కలిసి డ్యాన్స్ చేయడం ఎంతో జోష్ ఇచ్చిందంటూ నెటిజన్లతో తన ఆనందాన్ని పంచుకుంది. అమృత తన బంధువుల వివాహానికి హాజరయింది. అక్కడ జరిగిన సంగీత్‌లో తన కుమార్తె దివిజతో.. అది కూడా ఒకే కలర్ డ్రెస్సులో మెరిసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా.. ముఖ్యమంత్రి సతీమణి డ్యాన్సింగ్ టాలెంట్ అదుర్స్ అంటూ నెటిజన్లు కూడా ఫిదా అవుతున్నారు.

'పిల్లా..' పాటకు నెటిజన్లు ఫిదా



శేఖర్ కమ్ముల దర్శకత్వంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, సాయి పల్లవి హీరో హీరోయిన్లు గా నటించిన 'ఫిదా' చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.ఈ చిత్రంలో తన అభినయంతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయింది సాయి పల్లవి. ముఖ్యంగా సాయి పల్లవి మీద తెరకెక్కించిన 'వచ్చిండే 'పాట ఈ సినిమాకే హైలెట్ గా నిలిచింది. ఇప్పటికీ ఈ సాంగ్ కి ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. నెటిజన్లు ఇప్పటికీ ఈ సాంగ్‌ని చూసి ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం 'వచ్చిండే ' వీడియో సాంగ్ యూట్యూబ్ లో సంచలనాల దిశగా దూసుకెళ్తుంది. ఇప్పటివరకు 173 మిలియన్ల (73 కోట్లు) వ్యూస్ తెచ్చుకుని.. రికార్డ్ సృష్టించింది. శక్తికాంత్ కార్తీక్ సంగీత సారథ్యంలో మధుప్రియ, రాంకీలు పాడిన ఈ పాటను సుద్దాల అశోక్ తేజ రాశారు.

బాబానే రక్షించాడు!

వైరల్



చెత్తను తరలించే మినీ వ్యాన్ మీది నుంచి దూసుకెళ్లినా.. సూరత్‌కు చెందిన 55 ఏళ్ల ఓ మహిళ సురక్షితంగా బయటపడింది. సూరత్‌లో ఉదానా ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. గుడి ముందు రోడ్డు మీద నిలబడిన మహిళ.. చెప్పులు విప్పి చేతులు జోడించి దేవుడికి దండం పెట్టుకుంది. ఈలోగా మున్సిపాలిటీకి చెందిన మినీ వ్యాన్ రివర్స్ చేసుకుంటూ వచ్చి ఢీకొట్టి, ఆమె మీదుగా వెళ్లింది.

ఈ ఘటన మొత్తం సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యింది. ప్రమాదానికి గురైన మహిళను పారిశుద్ధ్య కార్మికురాలైన రమీలా సోలంకిగా గుర్తించారు. మినీ వ్యాన్ మీదుగా వెళ్లినప్పటికీ.. అదృష్టవశాత్తూ ఆమె స్వల్ప గాయాలతో బయటపడింది. నేను దండం పెట్టుకున్న సాయి బాబానే నన్ను కాపాడాడని యాక్సిడెంట్ అనంతరం ఆమె తెలిపింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్‌లో వైరల్‌గా మారింది.

కొత్త టెక్...

శాంసంగ్ గెలాక్సీ ఇండియాలో గెలాక్సీ M సిరీస్‌లో పెద్ద స్క్రీన్, బాటరీలతో సరికొత్త స్మార్ట్‌ఫోన్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. ఈ సిరీస్‌లో M 10, M 20 అనే ఫోన్లు లాంచ్ చేయాలని భావిస్తోంది. గడిచిన కొద్ది వారాల నుంచి ఈ ఫోన్లకు సంబంధించి పలు ఫీచర్లు లీక్ అవుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాంసంగ్ ఈ కొత్త ఫోన్ల లాంచ్ గురించి అధికారికంగా ప్రకటించింది. ఈ సంవత్సరం జనవరి చివరిలో వీటిని లాంచ్ చేస్తున్నట్టు శాంసంగ్ స్పష్టం చేసింది.

గెలాక్సీM10 ఫీచర్లు

6.2 ఇంచ్ ఇన్ఫినిటీ వి డిస్‌ప్లే, 1080 x 2340 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్,ఎక్సినోస్ 7870 సోక్, 3 జీబీ ర్యామ్, 16,32 జీబీ స్టోరేజ్, 128 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో, డ్యుయల్ సిమ్,13 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరాలు, 5 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సార్, 4జీ వీవోఎల్‌టీఈ, డ్యుయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.0, ఎన్‌ఎఫ్‌సీ, 3400 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ చార్జింగ్‌నితో గెలాక్సీM10 మార్కెట్‌లోకి రానుంది.



గెలాక్సీM20 ఫీచర్లు

6.13 ఇంచ్ ఇన్‌ఫినిటీ వి డిస్‌ప్లే,1080 x 2220 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్, ఎక్సినోస్ 7870 సోక్, 3 జీబీ ర్యామ్, 32,64 జీబీ స్టోరేజ్, 128 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో, డ్యుయల్ సిమ్,13,5 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరాలు, 8 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సార్, 4జీ వీవోఎల్‌టీఈ, డ్యుయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.0, ఎన్‌ఎఫ్‌సీ, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ చార్జింగ్ ఇందులోని ప్రత్యేకతలు.

5జీ టెక్నాలజీ వైపు అడుగులు వేస్తున్న తరుణంలో ట్రాన్స్ పరెంట్ గ్లాస్ తో అదిరిపోయే ఫోన్‌లు కూడా మార్కెట్లోకి విడుదల అవుతున్నాయి.దక్షిణ కొరియా దిగ్గజం శాంసంగ్ గెలాక్సీ కూడా ఈ తరహా ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. ఇప్పుడున్న



టెక్నాలజీలను వెనక్కు నెట్టి మార్కెట్‌లో తనదైన ముద్ర వేసుకునే దిశగా శాంసంగ్ అడుగులు వేస్తుంది.ఈ స్మార్ట్ ఫోన్‌లో ట్రాన్స్ పరెంట్ గ్లాస్ తో డిస్ ప్లే ఉంటుంది. స్మార్ట్ ఫోన్స్‌లో ఉన్న మిగతా ఫీచర్లన్నీ ఇందులో ఉంటాయి.

గెలాక్సీ M30 ఫీచర్లు

6.38 ఇంచ్ ఇన్‌ఫినిటీ వి డిస్‌ప్లే,1080 x 2220 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్,ఎక్సినోస్ 7870 సోక్, 3 జీబీ ర్యామ్, 32,64 జీబీ స్టోరేజ్, 128 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో, డ్యుయల్ సిమ్,13,5,5 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరాలు, 16 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సార్, 4జీ వీవోఎల్‌టీఈ, డ్యుయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.0, ఎన్‌ఎఫ్‌సీ, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ చార్జింగ్.

ఫిట్‌నెస్‌కు 'లుడిస్'



స్మార్ట్‌ఫోన్‌ని ఫిట్‌నెస్ ట్రైనర్‌గా మార్చేసింది 'లుడిస్' యాప్ ఇన్‌స్టాల్ చేసుకుంటే చాలు. ట్రైనర్లు పక్కనే మాట్లాడుతూ శిక్షణనిస్తారు. అదెలా ఎలా సాధ్యం అంటే... ఇంగ్లిష్, హిందీ భాషల్లో నిపుణుల స్ట్రీమింగ్ ఆడియో ఫైల్స్‌ని యాప్‌లో సిద్ధంగా ఉంచారు. ఉదాహరణకు ఉదయాన్నే జాగింగ్‌కి సిద్ధం అయ్యాక చెవిలో హెడ్‌ఫోన్ పెట్టుకుని జాగింగ్‌కి సంబంధించిన శిక్షకుడి వాయిస్ స్ట్రీమింగ్‌ని వినొచ్చు. చిట్కాల్ని పాటిస్తూ మరింత జోష్‌తో జాగింగ్ చేయొచ్చు. ఇలా పలు రకాల వ్యాయామ పద్ధతుల్ని నిపుణుల వాయిస్ ట్రైనింగ్‌తో సాధన చేయొచ్చు. ఆడియో ఫైల్‌కి ఆహ్లాదకరమైన మ్యూజిక్‌ని జత చేశారు. ప్రొఫైల్‌ని క్రియేట్ చేసుకుని రోజువారీ వర్క్‌అవుట్స్‌ని ట్రాక్ చేయొచ్చు.

మన తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 8 జనవరి 2019
www.manatelangana.news



ఇండియన్ బ్యాంక్ 'ఐబి–కామధేను'

కరెంట్, సేవింగ్ బ్యాంక్ ఖాతా ప్రచారం

మన తెలంగాణ/ హైదరాబాద్: ఇండియన్ బ్యాంక్ సోమవారం 'ఐబి–కామధేను' పేరిట కరెంట్, సేవింగ్ బ్యాంక్ ఖాతా ప్రచారం నిర్వహించింది. ఈ ప్రచారాన్ని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఆర్.మనోహర్ ప్రారంభించారు. ఈ ప్రచారంలో భాగంగా హిమాయత్‌నగర్ నుంచి నారాయణగూడ వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.మనోహర్ మాట్లాడుతూ, వరుసగా వృద్ధి, లాభాలు అందిస్తున్న ఇండియన్ బ్యాంక్ ప్రభుత్వరంగ సంస్థల్లో ఎంతో పాతది అని అన్నారు. ఈనెల 7 నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు 'ఐబి–కామధేను' పేరిట కరెంట్, సేవింగ్ బ్యాంక్ ఖాతాలను తెరిచే అవకాశాన్ని బ్యాంక్ అందిస్తోంది. ఈ కాలంలో ప్రజలు కరెంట్, బ్యాంక్ ఖాతాలను ప్రారంభించాలని, తద్వారా బ్యాంక్ అందిస్తున్న ప్రయోజనాలను అందుకోవాలని బ్యాంక్ విజ్ఞప్తి చేసింది.

ఎరిక్సన్ బకాయిలపై అనిల్ అంబానీకి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ చైర్మన్ అనిల్ అంబానీకి సుప్రీం కోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది. ఎరిక్సన్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన కోరింది. నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని జస్టిస్ ఆర్.ఎఫ్. నారిమన్ నేతృత్వంలోని ధర్మాసనం అంబానీ, ఇతరులను ఆదేశించింది. బకాయి కింద రూ.118కోట్లను అంగీకరించాల్సిందిగా ఆర్‌కాం తరపున వాదించిన న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహతగి కోర్టును అభ్యర్థించారు. అయితే ఎరిక్‌సన్ దీనికి ఒప్పుకోలేదు, మొత్తం బకాయిని చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పింది. రిలయన్స్ జియోతో కూర్చొని చర్చించి సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా ఆర్‌కాంకు నారిమన్ సూచించారు. పరస్పరం సమస్యను పరిష్కరించుకోని పక్షంతో తామేమి చేయలేమని వ్యాఖ్యానించారు.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	35,850.16	155.06	(0.43%)
నిఫ్టీ	10,771.80	44.45	(0.41%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	69.42
యూరో	79.27
బ్రిటిష్ పౌండ్	88.47
ఆస్ట్రేలియన్ డాలర్	49.47
కెనెడియన్ డాలర్	51.95
సింగపూర్ డాలర్	51.13
స్విస్ ఫ్రాంక్	70.51
చైనీస్ యువాన్	10.10
మలేషియన్ రింగిట్	16.88
న్యూజిలాండ్ డాలర్	46.85
హాంకాంగ్ డాలర్	8.86
జపనీస్ యెన్	0.64
కువైట్ దినార్	228.93
సౌతాఫ్రికన్ రాండ్	4.98

బులియన్



బంగారం ధర


నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30440	32556.15	0.66%
ముంబై	31280	33454.55	0%
ఢిల్లీ	30850	32994.65	0.16%
కోల్‌కతా	31400	33582.89	0.22%
కేరళ	29450	31497.33	0.34%
బెంగళూరు	29680	31743.32	0%
హైదరాబాద్	30440	32556.15	2.56%
గల్ఫ్	137.68	147.25	1.38%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42442.00
ముంబై	₹ 42442.00
ఢిల్లీ	₹ 42442.00
కోల్‌కతా	₹ 42442.00
హైదరాబాద్	₹ 42442.00



నగదు కొరత సమస్య లేదు



- ఆర్‌బిఐ తగిన చర్యలు చేపడుతోంది
- ఎంఎస్‌ఎంఇ రుణాల దరఖాస్తులను బ్యాంకులు పరిశీలించాలి
- గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయఆర్థిక వ్యవస్థలో నగదు కొరత సమస్య ఉంటే ఆర్‌బిఐ తగిన చర్యలు చేపడుతుందని రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి నగదు నిల్వల సమస్య చాలా వరకు తీరిందని ఆయన అన్నారు. సోమవారం ఇక్కడ చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఘాల ప్రతినిధులతో శక్తికాంత దాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు కొరత సమస్య తగ్గిందని, తరచూ ఈ అంశంపై సమీక్ష చేస్తున్నామని చెప్పారు. మంగళవారం ముంబైలో శక్తికాంత్ బ్యాంకింగేతర ఫైనాన్షియల్ కంపెనీల(ఎన్‌బిఎఫ్‌సి)తో సమావేశం కానున్నట్లు తెలిపారు. ఈ రంగం ఎదుర్కొంటున్న నగదు కొరత పరిస్థితులను తెలుసుకుంటామని అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పునర్నిర్మాణం కోసం వచ్చే రుణాల దరఖాస్తులను పరిశీలించాలని శక్తికాంత్ బ్యాంకులకు సూచించారు. ఆర్థిక వ్యవస్థలోకి నగదును పంపించడం అవసరాల మేరకు ఉంటుందని, ఆర్‌బిఐ తగినంత నగదు నిల్వలను ఉంచుతుందని ఆయన్ పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ డబ్బు కోల్పోకుండా, పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు.

మొండి బకాయిలు తగ్గుముఖం

ఎన్‌పిఎలు లేదా మొండి బకాయిలు తగ్గుముఖం పట్టాయంటూ బ్యాంకింగ్ రంగం పనితీరుపై ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ప్రభుత్వరంగ బ్యాంకుల్లో మొండి బకాయిలు క్రమంగా తగ్గుతున్నాయని అన్నారు. బ్యాంకింగ్ సంస్కరణలపై ఆర్‌బిఐ వాటాదారుల సలహాలను కూడా పరిగణనలోకి తీసుకోనుందని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, ఎన్‌పిఎలు రూ.23 వేల కోట్లు తగ్గి 2018 మార్చిలో రూ.9.62 లక్షల కోట్లకు చేరాయని అన్నారు.



కేంద్రానికి తాత్కాలిక డివిడెండ్‌గా రూ.40 వేల కోట్లు!

మరో మూడు వారాల్లో ఆఖరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వ ఖజానాకు పెద్ద బూస్ట్ లభించనుందని తెలుస్తోంది. ప్రభుత్వానికి త్వరలో ఆర్‌బిఐ తాత్కాలిక డివిడెండ్‌గా రూ.30 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్ల వరకు ఇవ్వనున్నట్టు అధికార వర్గాల సమాచారం. తాత్కాలిక డివిడెండ్‌పై కొద్ది రోజులుగా ప్రభుత్వం–ఆర్‌బిఐ మధ్య చర్చలు జరుగుతున్నాయని, బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు రూ.40 వేల కోట్ల వరకు డివిడెండ్ బదిలీ చేసే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ డివిడెండ్ గనుక ప్రభుత్వానికి అందితే.. గత సంవత్సరాలతో పోల్చి చూస్తే ఆర్‌బిఐ నుంచి అందిన అతిపెద్ద డివిడెండ్ ఇదే అవుతుంది. 2017–18లో ఆర్‌బిఐ ప్రభుత్వానికి రూ.50 వేల మిగుల్లను బదిలీ చేయగా, దీనిలో రూ.10 వేల కోట్లను అంతకుముందు ఏడాదిలో బదిలీ చేశారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డివిడెండ్ రూ.40 కోట్లు ఉంటుంది. ప్రస్తుతం ఆర్థిక సంవనత్సరం (2018–19)లో 3.3 శాతం ద్రవ్య లోటు లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ తాత్కాలిక డివిడెండ్ కేంద్రానికి సాయపడనుంది. 'ఆర్‌బిఐ బోర్డు నిర్ణయించినప్పుడు ఈ నిర్ణయం తెలియజేస్తామ'ని ఇక్కడ మీడియా సమావేశంలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు.

వృద్ధి రేటు 7.2 శాతం

- 2018–19లో జిడిపిపై సిఎస్‌ఒ అంచనా
- వ్యవసాయ, ఉత్పాదక రంగాలు మెరుగవ్వడం వల్లేనని వెల్లడి



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19)లో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు 7.2 శాతంగా ఉంటుందని కేంద్ర గణాంకాల శాఖ(సిఎస్‌ఒ) అంచనా వేసింది. అంతకుముందు ఏడాది వృద్ధి రేటు 6.7 శాతంతో పోలిస్తే ఇది గరిష్ఠ స్థాయిలో ఉంది. వ్యవసాయం, ఉత్పాదక రంగాలు మెరుగ్గా కనిపిస్తుండడం వల్లే వృద్ధి రేటు పెరుగనుందని అంచనా వేస్తున్నారు. సోమవారం విడుదల చేసిన ఈ నివేదికలో వ్యవసాయం, అటవీ సంబంధిత, మత్స్య కార్యకలాపాలు గత ఏడాది 3.4 శాతం ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.8 శాతానికి పెరగనున్నాయని పేర్కొంది. ఇక 201718లో 5.7 శాతంగా నమోదైన తయారీ రంగం 8.3 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. కాగా 2015–16లో దేశ జిడిపి 8.2 శాతం వృద్ధి సాధించగా, 2016–17లో 7.1 శాతం వృద్ధి సాధించింది. జిఎస్‌టి, నోట్ల రద్దు ప్రభావంతో 2017–18లో జిడిపి వృద్ధి రేటు 6.7 శాతాని క్షీణించింది. కాగా 2018–19 ఆర్థిక సంవత్సరానికి తొలి ముందస్తు అంచనాలు వెల్లడిస్తూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.2 శాతంగా అంచనా వేస్తున్నట్టు సిఎస్‌ఒ తెలిపింది.

36 వేలు దాటి.. మళ్లీ వెనక్కి

చివరికి 155 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్



న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రారంభంలో భారీ లాభాలతో దూసుకెళ్లి.. ఆఖరి సమయంలో స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. కొనుగోళ్లకు ఆసక్తిచూపడంతో మార్కెట్లు లాభాలతో జోరును చూపాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 155 పాయింట్లు పెరిగి 35,850 వద్ద నిలిచింది. ఇక నిఫ్టీ 44 పాయింట్లు పెరిగి 10,772 పాయింట్లకు చేరింది. అంతర్జాతీయంగా సానుకూలం సంకేతాలు దేశీయంగానూ ప్రభావం చూపాయి. రియల్టీ, ఐటి 1 శాతం చొప్పున పుంజుకోగా, ప్రైవేట్ బ్యాంక్స్ 0.5 శాతం లాభపడ్డాయి. ఫార్మా 0.6 శాతం డౌన్ అయ్యాయి. బిఎస్‌ఇలో ట్రేడైన షేర్లలో 1,302 లాభపడగా, 1,300 షేర్లు నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ దిగ్గజాలలో యాక్సిస్, ఇన్‌ఫ్రాటెల్, టాటా మోటార్స్, టైటన్, గ్రాసిమ్, మారుతి, ఇన్ఫోసిస్, ఒఎన్‌జిసి, ఎన్‌టిపిసి, టిసిఎస్ 31.2 శాతం మధ్య ఎగశాయి. బ్లూచిప్స్‌లో ఐబి హౌసింగ్ 4.6 శాతం పతనమైంది. రియల్టీ స్టాక్స్‌లో గోద్రెజ్ ప్రాపర్టీస్, శోభా, ఇండియాబుల్స్, డిఎల్‌ఎఫ్, ఫీనిక్స్, సన్‌టెక్ పెరిగాయి. శుక్రవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ.158 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ.241 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

నేటి నుంచి రెండు రోజులు బ్యాంకుల సమ్మె



న్యూఢిల్లీ: మంగళవారం(నేటి) నుంచి రెండు రోజులపాటు సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు సమ్మె నిర్వహించనున్నాయి. కార్మిక వ్యతిరేక విధానాలు, ఏకపక్షంగా సంస్కరణలు చేపడుతున్నారని ఆరోపిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యూనియన్లు ఈ నిరసనకు దిగాయి. మంగళవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించే ఈ సమ్మెలో 10 సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు పాల్గొననున్నాయని, దాదాపు 20 కోట్ల మంది వర్కర్లు సమ్మెలో పాల్గొననున్నారని భావిస్తున్నామని ఎఐటియుసి(ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తెలిపారు. 10 సిటియుల జాయింట్ ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ, తాము చేపడుతున్న సమ్మెకు టెలికామ్, హెల్త్, ఎడ్యుకేషన్, కోల్, స్టీల్, ఎలక్ట్రిసిటీ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ట్రాన్స్‌పోర్ట్ వంటి రంగాలు కూడా మద్దతు పలకనున్నాయని అన్నారు. బుధవారం నాడు మండి హౌస్ నుంచి నిరసన ప్రదర్శన చేపట్టి న్యూఢిల్లీలో పార్లమెంట్ వరకు వెళ్లనున్నామని, ఇలాంటి నిరసనలు దేశవ్యాప్తంగా జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. కార్మిక నిబంధనలపై తాము సూచనలు చేశామని, అయితే చర్చల్లో ట్రేడ్ యూనియన్ల డిమాండ్లను తిరస్కరించారని, అందుకే 2016 సెప్టెంబర్ 2న సమ్మె నిర్వహించామని, ఆ తర్వాత 2017 నవంబర్‌లోనూ సమ్మె చేపట్టగా ప్రభుత్వం స్పందించకపోవడమే కాకుండా ఏకపక్షంగా కార్మిక సంస్కరణలు చేపడుతోందని అన్నారు. 10 సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు.. ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్‌ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసిలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయి. అయితే ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ భారతీయ మజ్దూర్ సంఘ్(బిఎంఎస్) ఈ సమ్మెలో పాల్గొనడం లేదు.

రెండో రోజు ఎస్‌బిఐ సేవలు?

ఈ నెల 8, 9 తేదీల్లో సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు రెండు రోజుల సాధారణ సమ్మె నిర్వహిస్తున్నాయి. అయితే రెండో రోజు బ్యాంకింగ్ రంగం పాక్షిక మూసివేత గానే పరిగణించవచ్చని బ్యాంకింగ్ యూనియన్ అధికారులు పేర్కొంటున్నారు. దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)కు దేశవ్యాప్తంగా 8500 బ్రాంచ్‌లు ఉండగా, అయితే బ్యాంకుల రెండో రోజు సమ్మె నాడు ఈ బ్రాంచ్‌లు తెరిచి ఉండనున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఎస్‌బిఐతో ప ఆటు కొన్ని ఇతర జాతీయ బ్యాంకులు కూడా పాక్షికంగా సేవలందించనున్నాయని తెలుస్తోంది.

బంధన్ బ్యాంక్ చేతికి గృహ్ ఫైనాన్స్



న్యూఢిల్లీ: హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ గృహ్ ఫైనాన్స్‌ను బంధన్ బ్యాంక్ సొంతం చేసుకోనుంది. షేర్ స్వాప్ డీల్ ద్వారా గృహ్ ఫైనాన్స్‌ను సొంతం చేసుకోనున్నట్టు బంధన్ బ్యాంక్ వెల్లడించింది. విలీన ఒప్పందం కింద ప్రతి 1000 షేర్లకు గాను గృహ్ ఫైనాన్స్ వాటాదారులు 568 బంధన్ బ్యాంక్ వాటాలను పొందుతారు. ఇంతకుముందు ఆర్‌బిఐ లైసెన్స్ నిబంధనల ప్రకారం బంధన్ బ్యాంక్ తప్పనిసరిగా ప్రమోటర్ల వాటాలను 40 శాతానికి తగ్గించాలి. ఆర్‌బిఐ నిబంధనలను అమలు చేసేందుకు గాను బంధన్ బ్యాంక్ ప్రమోటర్ల వాటాలను తగ్గించే ప్రక్రియలో ఈ నిర్ణయం తీసుకుంది. గృహ్ ఫైనాన్స్‌ను సొంతం చేసుకోవడం ద్వారా బంధన్ బ్యాంక్ ప్రమోటర్ల వాటా 82 శాతం నుంచి తగ్గేందుకు దోహదం చేయనుంది. ఈ హెచ్‌డిఎఫ్‌సి ఈ విలీనం అనంతరం బంధన్ బ్యాంక్‌లో 15 శాతం వాటాలను దక్కించుకోనుంది. గృహ్, బంధన్ కలయిక దేశంలో అతిపెద్ద హౌసింగ్ పోర్ట్‌ఫోలియోను సృష్టించనున్నాయని హెచ్‌డిఎఫ్‌సికి చెందిన దీపక్ పరేఖ్ అన్నారు.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
భారతీ ఇన్‌ఫ్రాటెల్	295.15	285.10	293.75	285.05	8.70	3.05
యాక్సిస్ బ్యాంక్	640.70	624.20	637.45	619.60	17.85	2.88
టాటా మోటర్స్	178.20	173.20	175.35	170.95	4.40	2.57
ఎన్‌టిపిసి	149.70	146.15	148.60	145.75	2.85	1.96
గ్రాసిమ్	824.80	808.00	820.65	806.15	14.50	1.80
మారుతీ సుజూకీ	7,407.00	7,300.00	7,362.05	7,234.50	127.55	1.76
టైటాన్ కంపెనీ	964.00	934.10	944.05	928.45	15.60	1.68
ఇన్ఫోసిస్	673.60	661.50	671.70	661.05	10.65	1.61
ఒఎన్‌జిసి	148.40	145.75	147.85	145.70	2.15	1.48
పవర్‌గ్రిడ్ కార్ప్	198.90	195.85	198.45	195.90	2.55	1.30

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
ఇండియా బుల్స్	843.75	787.35	793.90	829.80	35.90	4.33
బజాజ్ ఆటో	2,740.00	2,645.00	2,658.55	2,734.20	75.65	2.77
డా. రెడ్డీస్ ల్యాబ్	2,613.85	2,537.30	2,558.65	2,600.00	41.35	1.59
ఐచర్ మోటర్స్	20,477.00	19,755.00	19,830.40	20,103.60	273.20	1.36
యస్ బ్యాంక్	194.40	185.80	187.15	189.65	2.50	1.32
హిందల్కో	214.75	207.90	208.55	210.90	2.35	1.11
బిపిసిఎల్	362.80	354.00	355.55	359.45	3.90	1.08
హీరో మోటోకార్ప్	3,023.00	2,952.00	2,957.95	2,987.85	29.90	1.00
బజాజ్ ఫైనాన్స్	2,605.00	2,545.35	2,553.60	2,576.05	22.45	0.87
కోల్ ఇండియా	238.00	233.50	234.50	236.50	2.00	0.85

నా జీవితంలో హీరో అజయ్ దేవగణ్ స్థానాన్ని మరొకరు భర్తీ చేయలేరు. ఆయన నన్ను నమ్మి గోల్‌మాల్, సింగం సిరీస్ సినిమాల్లో నటించారు. నేను దర్శకుడిగా ఈ స్థాయిలో ఉండటానికి కారణం ఆయనే. అజయ్ నాకు అన్నయ్యలాంటి వారు.

–బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి

వాలెంటైన్స్ డే రోజున నెక్స్‌ట్ మూవీ


అల్లు అర్జున్

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నెక్స్‌ట్ సినిమా ఎప్పుడు మొదలవుతుందా అని అభిమానులు, ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం విడుదలైన 'నా పేరు సూర్య' చిత్రం తర్వాత బన్నీ ఇంతవరకు తన తదుపరి చిత్రాన్ని ప్రారంభించలేదు. మంచి కథ కోసం ఆయన ఎదురు చూశారు. దర్శకులు విక్రమ్ కుమార్, పరశురామ్ పేర్లు వినిపించినా చివరికి త్రివిక్రమ్‌కు బన్నీ నెక్స్‌ట్ మూవీని తెరకెక్కించే అవకాశం దక్కింది. ఇక అల్లుఅర్జున్‌త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఇప్పటివరకు రెండు సినిమాలు వచ్చాయి. జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి చిత్రాలు వీరి కాంబినేషన్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఈ రెండు సినిమాలు హిట్‌గా నిలిచాయి. ప్రస్తుతం ముచ్చటగా మూడోసారి వీరిద్దరి కలిసి సినిమా చేయబోతున్నారు. ఈ మూవీని ఫిబ్రవరి 14న అంటే వాలెంటైన్స్ డే రోజున ప్రారంభించబోతున్నారు. ఫిబ్రవరిలో సినిమాను ప్రారంభించి దసరా పండుగకు రిలీజ్ చేయాలనేది ప్లాన్. ఈసారి అల్లుఅర్జున్, త్రివిక్రమ్‌లు ఇండస్ట్రీ హిట్‌పై కన్నేశారు.


'పేట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శ్రీకాంత్, వైవిఎస్ చౌదరి, అంబికా కృష్ణ, కార్తిక్ సుబ్బరాజ్, మేఘా ఆకాష్ తదితరులు

ఫ్యామిలీ ఓరియెంటెడ్ యాక్షన్ ఫిలిం

సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన చిత్రం 'పేట'. సిమ్రాన్, త్రిషలు కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి కార్తిక్ సుబ్బరాజ్ దర్శకుడు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, వైవిఎస్ చౌదరి, అంబికాకృష్ణ, మేఘా ఆకాష్, కార్తిక్ సుబ్బరాజ్, అనిరుధ్ రవిచందర్, అశోక్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ''నవాబ్, సర్కార్ వంటి సూపర్ హిట్ సినిమాలను విడుదల చేసిన నిర్మాత వల్లభనేని అశోక్ 'పేట' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. పెద్ద సినిమాలతో పోటీపడుతూ సంక్రాంతికి వస్తున్న ఈ సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. నిర్మాత అశోక్ వల్లభనేని మాట్లాడుతూ ''రజనీకాంత్ స్ఫూర్తితోనే ఆయన సినిమాను విడుదల చేసే స్థాయికి చేరుకున్నాను. సినిమా థియేటర్ల విషయంలో చాలా మంది నన్ను ఇబ్బంది పెడుతున్నారు. వాళ్లకు ఈ సినిమా హిట్‌తో బుద్ధి చెప్పాలనుకుంటున్నాను'' అని తెలిపారు. హీరోయిన్ మేఘా ఆకాష్ మాట్లాడుతూ ''సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో ఈ సినిమా చేసినందుకు హ్యాపీగా ఉంది. ఇందులో నేను మంచి పాత్ర చేశాను''అని పేర్కొన్నారు. దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ ''నా మొదటి సినిమా 'పిజ్జా' కోసం హైదరాబాద్‌కు వచ్చాను. మళ్లీ రజనీకాంత్ సినిమా కోసం ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. ఫ్యామిలీ ఓరియెంటెడ్ యాక్షన్ ఫిలిం ఇది'' అని చెప్పారు. నటుడు బాబీ సింహ మాట్లాడుతూ ''రజనీకాంత్‌తో కలిసి ఈ సినిమా చేయడంతో ఎంతో సంతోషంగా ఉంది. దేవుడిని చూశాననే ఫీలింగ్ కలిగింది. కార్తిక్ మంచి దర్శకుడు''అని అన్నారు.

యువతరంలోకి దూసుకు పోతోంది

'ఆర్‌ఎక్స్ 100' చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయమైన భామ పాయల్ రాజ్‌పుత్. తొలి చిత్రంతోనే తన అందచందాలు, గ్లామర్‌తో కుర్రకారును మైమరపించింది. ఇందులో కథానాయకుడిని ప్రేమ ముగ్గులోకి దించి మోసం చేసే మాయ లేడీగా నటించి మెప్పించింది. ఈ చిత్రం తర్వాత పాయల్‌కు మంచి అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ పంజాబీ బ్యూటీ క్రేజీ చిత్రాలకు సంతకం చేస్తోంది. ఇటీవల రవితేజ చిత్రానికి ఆమె సంతకం చేసిందని తెలిసింది. వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. దీంతో పాటు మరికొన్ని చిత్రాలకు పాయల్ సంతకం చేసింది. అటు పంజాబీలోనూ బిజీ స్టార్‌గా వెలిగిపోతోంది ఈ భామ. పనిలో పనిగా తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో పాయల్ హల్‌చల్ చేస్తోంది. ఈ ఫొటోల్లో తన అందచందాలను ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటోలు యువతరంలోకి దూసుకుపోతున్నాయి.


పాయల్ రాజ్‌పుత్

పొల్లాచ్చీకి వెళ్తున్న 'మహర్షి'


మహేష్

ఓవైపు షూటింగ్‌ల దూకుడు... మరోవైపు పర్సనల్ లైఫ్ సెలబ్రేషన్స్ దూకుడుతో పక్కా ప్రొఫెషనల్ జెంటిల్‌మేన్ అనిపించుకుంటున్నారు మహేష్‌బాబు. ఇటీవలే కుటుంబంతో కలిసి క్రిస్మస్, కొత్త సంవత్సరం వేడుకలను విదేశాల్లో జరుపుకున్నారు ఈ సూపర్ స్టార్. దుబాయ్‌లో ఫ్యామిలీతో కలిసి హాయిగా ఎంజాయ్ చేశారు. ఈ సెలబ్రేషన్స్ పూర్తి చేసుకొని హైదరాబాద్ చేరుకున్న మహేష్‌బాబు 'మహర్షి' చిత్రం తదుపరి షెడ్యూల్ కోసం సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు హైదరాబాద్‌లోని సెట్స్‌లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. ప్రధానమైన షెడ్యూళ్లు పూర్తయ్యాయి. ఇక తదుపరి షెడ్యూల్‌ను పొల్లాచ్చీలో ప్లాన్ చేస్తున్నారట. రెండు వారాల పాటు సుదీర్ఘంగా సాగే ఈ షెడ్యూల్ పూర్తయితే మెజారిటీ టాకీపార్ట్ పూర్తయినట్టే. ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం అంతా పాల్గొంటున్నారట. ఇక మహేష్ ఈ చిత్రంలో రెండు షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తున్నారు. అమెరికాలో కార్పొరేట్ లుక్‌తో, కాలేజ్ స్టూడెంట్‌గా మరో లుక్‌తో ఈ సూపర్‌స్టార్ కనిపిస్తారని ఇదివరకు విడుదలైన ఫొటోలు చెప్పాయి. అల్లరి నరేష్ ఓ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు, అశ్వనీదత్, పివిపి కలిసి నిర్మిస్తున్నారు. అందాల తార పూజాహెగ్దే ఈ చిత్రంలో మహేష్‌తో ఆడిపాడుతోంది. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.

నిన్ను తలచి.. మైమరచి

ఎస్.ఎల్.ఎం. ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నిన్ను తలచి'. అనిల్ తోట దర్శకత్వంలో నేదురుమల్లి, అజిత్ రెడ్డి నిర్మాతలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో వంశీ, స్టెఫీ పాటిల్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత అజిత్ మాట్లాడుతూ ''కొత్త బ్యానర్‌లో కొత్త హీరోహీరోయిన్లతో కలిసి చేస్తున్న సినిమా ఇది. ఈ సినిమాతో మా అందరికీ మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. దర్శకుడు అనిల్ తోట మాట్లాడుతూ ''ప్రస్తుతం సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం''అని తెలిపారు. పూర్ణచారి మాట్లాడుతూ ''సినిమాలో హీరోహీరోయిన్లు బాగా నటించారు. మంచి సంగీతం కుదిరింది''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హీరోహీరోయిన్లు వంశీ, స్టెఫీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


స్టెఫీ పాటిల్, వంశీ

'పిఎం నరేంద్ర మోదీ' ఫస్ట్‌లుక్


వివేక్ ఒబెరాయ్

భారత ప్రధాని నరేంద్ర మోడీ జీవిత చరిత్రతో తెరకెక్కనున్న చిత్రం 'పిఎం నరేంద్ర మోదీ'. మేరీకోమ్, సరబ్జిత్ బయోపిక్‌ల దర్శకుడు ఒమంగ్ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. మోడీ పాత్రలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటించనున్నారు. ఈ చిత్రాన్ని సురేష్ ఒబెరాయ్, సందీప్ సింగ్ కలిసి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విడుదల చేశారు. మొత్తం 23 భాషల్లో ఈ ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. ఇక మోడీగా వివేక్ ఒబెరాయ్ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. నరేంద్ర మోడీ సిగ్నేచర్ స్టైల్‌కి ఒబెరాయ్ సరిగ్గా సరిపోయాడంటూ అభిమానులు కితాబిస్తున్నారు. ఇక వివేక్ ఒబెరాయ్ తెలుగులో వచ్చిన 'రక్తచరిత్ర'లో పరిటాల రవి పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు నరేంద్ర మోడీ బయోపిక్‌తో ఆయన చర్చల్లోకి వచ్చారు. ఇక రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ' చిత్రంలోనూ వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంట్ ప్రైమ్‌మినిస్టర్' ఈనెల 11న విడుదల కానుంది

నందినిరాయ్ సందడి


నందినిరాయ్

బిగ్‌బాస్ రియాల్టీ షోతో బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకున్న నందినిరాయ్ మోడల్‌గా, హీరోయిన్‌గా రాణిస్తోంది. ఈ అమ్మడి పేరు విన్నా, ఆమె లుక్ చూసినా ఉత్తరాది భామ అనుకుంటారు. కానీ ఈ బ్యూటీ పక్కా తెలుగమ్మాయి. పైగా హైదరాబాదీ గర్ల్. అమెరికా వెళ్లి చదువుకొని వచ్చిన ఈ బ్యూటీ హిందీలో 'లాగిన్' అనే ఓ సినిమాలో నటించింది. నందిని మోడల్‌గా మంచి పాపులారిటీని తెచ్చుకుంది. వీటన్నింటికి మించి తెలుగునాట బిగ్‌బాస్ రియాల్టీషోలో పాల్గొనడంతో అందరికీ చేరువైంది. ఈ బ్యూటీ తెలుగు లోగిళ్లలో పాపులరైంది. ప్రస్తుతం ఈ భామ టాలీవుడ్‌లో బిగ్ కెరీర్‌ను ఆశిస్తోంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఓ ఫొటో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దర్శనమిస్తున్న ఆమె ఫొటోలను యూత్ ఫాలో అయిపోతున్నారు.

శివ కందుకూరి హీరోగా...


వర్ష, శివ కందుకూరి

'పెళ్లి చూపులు' చిత్రంతో జాతీయ అవార్డును అందుకున్న నిర్మాత రాజ్‌కందుకూరి ధర్మపథ క్రియేషన్స్ బ్యానర్‌లో లేడీ డైరెక్టర్ శేష సింధు రావును సినీ రంగానికి పరిచయం చేస్తున్నారు. ఇందులో ఆయన కుమారుడు శివ కందుకూరి హీరోగా కనిపించబోతున్నారు. దర్శకులు సుకుమార్, క్రిష్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన శేష సింధురావును ఈ చిత్రంతో దర్శకురాలిగా రాజ్ కందుకూరి పరిచయం చేస్తున్నారు. ఇటీవల తమిళంలో ఘన విజయం సాధించిన '96' చిత్రం ఫేం వర్ష ఇందులో కథానాయిక. గోపీసుందర్ సంగీతాన్ని అందిస్తున్నారు. 'మహానటి' చిత్రానికి స్క్రీన్‌ప్లే, మాటలు అందించిన పద్మావతి విశ్వేశ్వర్ దర్శకురాలితో కలిసి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందించారు. ప్రముఖ నిర్మాతలు దగ్గుబాటి సురేష్, మధుర శ్రీధర్‌లు ఈ చిత్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః వేద వర్మ, ఎడిటర్ః వేద రామన్.

లేటు వయసు ఘాటు సుందరి


శిల్పాశెట్టి

లేటు వయసులోనూ హాట్‌గా కనిపించే ముద్దుగుమ్మల జాబితాలో శిల్పాశెట్టి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. బాలీవుడ్ సెలబ్రిటీల్లో ఈ భామ సమ్‌థింగ్ స్పెషల్‌గా కనిపిస్తుంది. 45 ఏళ్ల వయసులోనూ కాలేజీ గర్ల్ లుక్‌తో అదరగొడుతోంది శిల్పాశెట్టి. రాజ్ కుంద్రాను పెళ్లాడి ఇద్దరు పిల్లలకు తల్లిగా ఉన్నా ఇప్పటికీ టీనేజీ యాటిట్యూడ్‌తో ఉందంటూ యూత్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక పార్టీలు, ఫంక్షన్లలో శిల్పా అల్ట్రా మోడ్రన్ లుక్‌తో దర్శనమిస్తూ ఆకట్టుకుంటోంది. ఇటీవల ఈ భామ స్పెషల్ లుక్‌తో మైమరపించింది. ప్రస్తుతం శిల్పా శెట్టి ఫొటోలు యువతరం సామాజిక మాధ్యమాల్లో జోరుగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలపై 'లేటు వయసు ఘాటు సుందరి' అంటూ యూత్ సెటైరికల్ కామెంట్స్ చేస్తున్నారు.

పోటీ


చీకటి గది

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

పీష్వాల యుగాన్ని ప్రారంభించిందెవరు?

రెండవ ఆంగ్లో-మైసూర్ యుద్ధం(1780-84)

- తండ్రి, కొడుకులు కలిసి పాల్గొన్న యుద్ధం రెండవ మైసూర్ యుద్ధం.
- మొదట్లో టిప్పు సుల్తాన్‌ను పాల్‌ఘాట్, కోయంబత్తూర్, తిరుచునాపల్లి యుద్ధాలలో బ్రిటీష్ వారు ఓడించారు.
- ఆ తర్వాత టిప్పు సుల్తాన్ బలపడటంతో చివరకు ఎవరూ గెలవలేని స్థితిలో ఉండటంతో 1784లో మంగళూర్ శాంతి ఒప్పందంతో టిప్పు సుల్తాన్ గెలుచుకున్న ప్రాంతాలను ఆంగ్లేయులకు, ఆంగ్లేయులు గెలుచుకున్న మైసూర్ ప్రాంతాలను టిప్పు సుల్తాన్‌కు ఇవ్వటం జరిగింది.
- ఈ మంగళూర్ ఒప్పందంను హల్లో ట్రూస్ అంటారు.

టిప్పు సుల్తాన్

- అసలు పేరు – ఫతే అలీఖాన్ సాహిబ్.
- బిరుదులు – మైసూర్ పులి (షేర్ ఇ మైసూర్), టైగర్ ఆఫ్ ద ఈస్ట్.
- భారతదేశం మొట్టమొదటి జీతీయవాది.
- అధుని భారతదేశ చరిత్రలో అభ్యుదయ భావాలు కలిగినవాడు.
- **చిహ్నం :** పులి.
- హైదర్ అలీ తర్వాత 1786లో తననుతాను రాజుగా ప్రకటించుకున్నాడు.
- అనేక పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టి రైతులకు ఎక్కువగా లాభం చేకూర్చాడు.
- **ఇతని పాలన రెండు రకాలు :**

1. మిలటరీ పాలన – పర్యవేక్షించేవారు – సుమీర్.
2. పౌరపాలన – పర్యవేక్షించేవారు – అసఫ్.

- కొత్త క్యాలెండర్, నాణెంలను ప్రవేశపెట్టి రాజ్యం అంతటా ద్రవ్యవిధానంలో తూనికలు, కొలతలలో ఏకరూపతను అమలు చేశాడు.
- మైసూర్ రాజధాని శ్రీరంగపట్టణంలో ఫ్రెంచి విప్లవం స్ఫూర్తితో 'స్వేచ్ఛా వృక్షం'ను నాటాడు.
- బ్రిటీష్ వారిని భారతదేశం నుండి తరిమి వేయుటకు నెపోలియన్ – 1ను భారతదేశంపై దండయాత్ర చేయమని ఆహ్వానించాడు.
- తన రాయబారులను ఫ్రాన్స్ (నెపోలియన్ –1), ఈజిప్టు (అబ్దుల్ హమీద్ – 1), ఆఫ్ఘనిస్తాన్ (జమాన్ షాదురానీ)లకు పంపాడు.
- శ్రీరంగపట్టణంలోని మైసూర్ ప్యాలెస్ సమీపంలో శ్రీరంగనాథ ఆలయం నిర్మించి, భూదానాలు చేశాడు.
- శృంగేరి వద్ద 'శారదాదేవి' ఆలయ నిర్మాణానికి, నిధులు ఇచ్చాడు.
- శృంగేరి పీఠాధిపతి శంకరాచార్యుని పట్ల భక్తి శ్రద్ధలు కొనసాగించాడు.
- మైసూర్ (శ్రీరంగపట్టణం)లో దాదాపు లక్ష గ్రంథాలతో లైబ్రరీని నెలకొల్పాడు. బ్యాంకింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టాడు.
- శివ, పార్వతి, విష్ణు బొమ్మలతో కూడిన బంగారు, రాగి నాణెలను విడుదల చేశారు.
- ఇస్లాం మతంలోకి మతమార్పిడిలను ప్రోత్సహించినప్పటికీ పరమత సహనంను పాటించాడు.

3వ ఆంగ్లో-మైసూర్ యుద్ధం(1790-92)

- బ్రిటీష్ గవర్నర్ జనరల్ – కారన్‌వాలీస్
- ఈ యుద్ధానికి ప్రధానకారణం – టిప్పుసుల్తాన్ – 1790లో ట్రావెన్‌కోర్‌పై దాడిచేయడం. దీంతో కారన్‌వాలీస్ యుద్ధాన్ని ప్రకటించాడు.
- మైసూర్‌ను ఆక్రమించడానికి ఆంగ్లేయులు వ్యూహాత్మకంగా వ్యవహరించి కల్నల్ మెడోస్ దిండిగల్, కొయంబత్తూలను, కెప్టెన్ రీడ్ గుర్రంకొండ వంటి చిన్న దుర్గాలను ఆక్రమించారు.
- బ్రిటీష్ సైన్యాలు శ్రీరంగపట్టణంను ముట్టడించడంతో టిప్పుసుల్తాన్ కారన్‌వాలీస్‌తో 'శ్రీరంగపట్టణం సింధి' ఒప్పందం చేసుకోవడంతో యుద్ధం ముగిసింది.
- **దీనిలో ముఖ్యాంశాలు :** టిప్పుసుల్తాన్ శ్రీరంగపట్టణం ఒప్పందంతో సగానికి పైగా రాజ్యాన్ని కోల్పోయారు.
- యుద్ధ నష్టపరిహారంగా దాదాపు 3.30కోట్లు ఆంగ్లేయులకు చెల్లించాడు.
- కృష్ణా, పెన్నాల మధ్య ప్రాంతాన్ని నిజాం అలీఖాన్‌కు, తుంగభద్ర పరిసర ప్రాంతాన్ని మురాలకు ఇచ్చాడు.
- మలబార్, దిండిగల్, బారామహల్‌లను తన ఇద్దరు కుమారులను బ్రిటీష్ వారికి అప్పగించాడు.

4వ మైసూర్ యుద్ధం (1799)

- గవర్నర్ జనరల్ – వెల్లస్లీ.
- **కారణాలు :** వెల్లస్లీ ప్రవేశపెట్టిన 'సైన్యసహకారపద్ధతి'ని టిప్పుసుల్తాన్ వ్యతిరేకించడం.
- జాకోబియన్ క్లబ్‌లో సభ్యుడై నెపోలీయన్‌ను సైనిక సహాయాన్ని కోరడం.
- అరేబియా, కాన్‌స్టాంట్‌నోపుల్, కాబుల్‌లను తన రాయబారులను పంపి సైనిక సహాయాన్ని కోరాడు.
- టిప్పుసుల్తాన్ ' జీవితాంతం గొర్రెలా జీవించడం కన్నా ఒకరోజు సింహంలా జీవించడానికి ఇష్టపడతాను' అని పేర్కొన్నారు.
- ఫ్రెంచి సైన్యం మారిషస్ నుండి మైసూర్‌లోకి ప్రవేశించిందనే నెపంతో వెల్లస్లీ జనరల్ స్టూవర్ట్‌ను మైసూర్‌పైకి పంపాడు.
- 4వ మైసూర్ యుద్ధంలో వెల్లస్లీకి సహకరించినది – హైదరాబాద్ నిజాం.
- మైసూర్ ముట్టడికి ఆంగ్లేయ సైన్యానికి నేతృత్వం వహించినవారు – జనరల్ హారీస్ స్టూవర్ట్. కాగా వెల్లస్లీకి సహకరించిన అతని సోదరుడు సర్ ఆర్థర్ వెల్లస్లీ (బిరుదు – డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్ – ఎదురులేని మనిషి)
- ఆంగ్లేయులకు సహకరించిన టిప్పుసుల్తాన్ సేనానులు –పూర్ణయ్య, కమ్రుద్దీన్, మాలవెల్లి యుద్ధంలో టిప్పుసుల్తాన్ ఓడిపోయాడు.
- బ్రిటీష్ వారితో పోరాడుతూ శ్రీరంగపట్టణం వద్ద టిప్పుసుల్తాన్ 1799 మే 4న వీరమరణం (స్టూవర్ట్ వధించాడు) పొందాడు.
- టిప్పు ఖడ్గం ఇంగ్లాండ్ దేశానికి తీసుకెళ్లాడు.
- టిప్పుసుల్తాన్ మరణం తర్వాత బ్రిటీష్ వారు వడయార్ వంశానికకి చెందిన 5సం।। బాలుడిని 3వ కృష్ణరాజు వడయార్ మైసూర్ రాజుగా ప్రకటించాడు.
- ఇతని ప్రధాని పూర్ణయ్య నాటి బ్రిటీష్ రెసిండెంట్ అధికారి – బ్యారీక్లోజ్.
- 1832లో విలియం బెంటింగ్ మైసూర్‌ను బ్రిటీష్ రాజ్యంలో విలీనం చేయగా 1882లో రిప్పన్ తిరిగి వడయార్ వంశానికి ఇచ్చాడు. అప్పటి మైసూర్ పాలకుడు చామరాజు –IX తర్వాత పాలకుడు కృష్ణరాజు – IV ఇతని ప్రధానమంత్రియే 'మోక్షగుండం విశ్వేశ్వరయ్య'.
- 1947 జయచామరాజు వడయార్ మైసూర్‌ను భారతదేశంలో విలీనంచేశాడు. 2013లో వడయార్ వంశంలో చివరివారైన నరసింహరాజు వడయార్ మరణించగా ఆయన భార్య ప్రమోదాదేవి యుద్ధవీర్ కృష్ణదత్త చామరాజు వడయార్‌ను దత్త పుత్రుడిగా ప్రకటించింది.

మరాఠా ఆక్రమణ/ ఆంగ్లో మరాఠా యుద్ధాలు

- మరాఠా రాజ్యస్థాపకుడు – శివాజీ (1627–80)
- తర్వాత పాలకులు – శంభాజీ – (1680– 1689)
- రాజారామ్ – (1689 –1700) – భార్య తారాబాయ్ (ఔరంగజేబ్‌తో పోరాడిన ఏకైక మరాఠా మహిళ)
- శివాజీ – 3(1700–1708) తల్లి తారాబాయ్
- షాహూ – 1708 – 1749 తల్లి ఏసుబాయ్
- రామరాజ – 1749 –80
- ఆ తర్వాత రెండవ సాహూ, ప్రతాపసిన్హా – రెండవ షాజీలు (చివరి శివాజీ వంశ పాలకుడు). సతారాను పాలించారు.
- 3వ ఆంగ్లో – మరాఠా యుద్ధాలు జరిగాయి.

పీష్వాల యుగం (క్రీ.శ 1713-1818)

- పిష్వాల పరిపాలనకు ప్రధాన కేంద్రం –పూనా
- పిష్వాల యుగంను ప్రారంభించినది – బాలాజీ విశ్వనాథ్.

బాలాజీ విశ్వనాథ్ క్రీ.శ. 1713-20)

- **బిరుదులు :** అతుల పరాక్రమసేవక (సాహూ), సేనకర్త (చంద్రసేన్‌జాదవ్)
- క్రీ.శ 1713లో వారసత్వపు హక్కులతో పీష్వాగా నియమించబడినాడు.
- చిత్పవణ్ అనే బ్రాహ్మణవంశానికి చెందిన బాలాజీ విశ్వనాథ్ జింజీరా(మహారాష్ట్ర) ప్రాంతంనకు చెందిన వాడు.
- పీష్వా పదవిని అత్యంత శక్తివంతమైనది, ముఖ్యమైనదిగా రూపొందించాడు.
- మొఘల్‌రాకుమార్తె జీనత్‌ఉన్నిసా మెప్పును పొందడం సయ్యద్ సోదరుల ప్రాబల్యం మొఘలాయిల ఆస్థానంలో పెరుగుటకు కారకుడు.
- 1719లో ఫరూక్షియర్ (మొఘల్‌రాజు)ను తొలగించుటలో సయ్యద్ సోదరులకు సహాయపడ్డాడు.
- రిచర్డ్ టెంపుల్ అను రచయిత బాలాజీ విశ్వనాథ్‌ను ప్రశంసిస్తూ యుక్తిగల బ్రాహ్మణుడని, శాంతస్వభావుడని, క్రూరడైనా ధార్మిక శక్తితో జయించగల సమర్థుడని అభిప్రాయపడినాడు.

మొదటి బాజీరావు (క్రీ.శ 1720-40)

- ఈయన బాలాజీ విశ్వనాథ్ కుమారుడు
- **బిరుదులు :** రణవీరుడైన పీష్వా, మూర్తీభవించిన హిందూశక్తి.
- శివాజీ తర్వా గెరిల్లా యుద్ధవ్యూహాలకు గొప్పనాయకుడు.
- పీష్వాలందరిలోకెల్లా గొప్పవాడైన మొదటి బాజీరావు, హిందూపద్‌పద్‌షాహి సిద్ధాంతంను పేర్కొన్నాడు.
- ఇతని కాలంలో నిజాం ఉల్ ముల్క్ (మీర్ ఖమ్రుద్దీన్‌ఖాన్) హైదరాబాద్ నవాబ్ 1724లో 'అసఫ్‌జాహీరాజ్యం'ను స్థాపించాడు.
- 1724 మాళ్వాను ఆక్రమించాడు. మహారాష్ట్రుల అధికారాన్ని ఉత్తర భారతదేశంలో స్థాపించాడు.
- 1728లో నిజాం ఉల్ ముల్క్‌ను ఓడించి 'ముంగిషివ్' అనే ఒప్పందం ప్రకారం చేత సర్దేశ్‌ముఖి (1/10) పన్నులను వసూలు చేసే హక్కు పొందాడు.
- 1731లో సూరత్ యుద్ధం కూడా బాజీరాడు –1 నిజాం ఉల్ ముల్క్‌ల మధ్య జరిగింది. రోహరామేశ్వర్ సంధి ద్వార ముగిసింది.
- 1738 భోపాల్ యుద్ధం – దొరహసరాయ్ సంధి ద్వారా ముగిసింది.
- 1739 నాదిర్షా దండయాత్ర భారతదేశంపై బాజీరావు –1 కాలంలోనే జరిగింది. అప్పటి మొఘల్ పాలకుడు మహ్మద్‌షా రంగీలా.
- మస్తానీ ఉదంతంతో సంబంధం కలిగి ఉండి మొగల్ రాజ్యంను ఎండిన వృక్షంతో పోల్చాడు.

బాలాజీ బాజీరావు (క్రీ.శ. 1740-61)

- బాజీరావు –1 కుమారుడైన బాలాజీ బాజీరావు బిరుదు–నానాసాహెబ్.
- 1740లో రఘుజీబోంస్లే ఆర్కాట్ పైదాడిచేసి ఆక్రమించాడు.
- 1748 ఆఫ్ఘన్ నాయకుడైన అహ్మద్‌షా అబ్దాలి తొలిసారి ఇతని కాలంలోనే భారత్‌పై దాడిచేశాడు. మొఘల్ ఢిల్లీ పాలకుడు – మహ్మద్ షారంగీలా.
- 1757లో అహ్మద్‌షా అబ్దాలి భారత్‌పై దాడిచేసి – పంజాబ్‌ను ఆక్రమించి తన ప్రతినిధిగా తైమూర్‌షాను నియమించగా కొద్ది కాలనికి మహారాష్ట్ర (బాలాజీ బాజీరావు సోదరుడు), విశ్వాసరావు (బాలాజీ బాజీరావు కుమారుడు) మధ్య జరిగింది.

ఆ పంచాయతీల్లో 'స్వయం పాలన'

- గిరిజన తండాలకు వెలుగులు
- పాలకులుగా మారబోతున్న గిరిజన నేతలు
- నెరవేరనున్న ఆదివాసుల స్వప్నం



మన తెలంగాణ/హైదరాబాద్ : నిన్న మొన్నటి వరకు తండాలుగా ఉన్న ఆ గ్రామాల్లో నేడు స్వయం పాలన రాబోతోంది. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే ఆ తండాల్లో త్వరలో వెలుగులు ప్రకాశించబోతున్నాయి. గతంలో గిరిజనేతర పాలకుల కరుణా కటాక్షాల కోసం నిరీక్షించిన ఆ తండాలు, గూడేల్లోని గిరిజనులు, ఆదివాసులు నేడు పాలకులు కాబోతున్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామని అధికార టిఆర్‌ఎస్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గతేడాది మార్చి నెలలో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చి రాష్ట్రం మొత్తం మీద కొత్తగా 4,380 గ్రామాలు పంచాయతీలుగా ఏర్పడగా ఇందులో 2,458 తండాలు, గూడేలు ఉన్నాయి. గిరిజనుల, ఆదివాసీల చిరకాల స్వప్నమైన 'మానా వాటె... మానా రాజే...' నినాదం ఇప్పుడు సాకారమైంది. ఎన్నో సంవత్సరాల వారి ఎదురుచూపులు ఫలించాయి. మరో ఇరవై రోజుల్లో తండాలు, గూడేల్లోని గిరిజనులు, ఆదివాసులు సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా వారి గ్రామ అభివృద్ధి, సంక్షేమంలో నిర్ణయాత్మక శక్తిగా మారుతున్నారు. ఆ గ్రామాల గిరిజనులు, ఆదివాసుల్లో సరికొత్త జీవితం మొదలుకాబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం చిన్నచిన్న తండాలు, గూడేలను సైతం పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. కొన్ని తండాల్లో ఓటర్ల సంఖ్య 60 మాత్రమే. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రాష్ట్రంలో మొత్తం 12,751 పంచాయతీలు ఉండగా ఇందులో 19 మినహా మిగిలిన అన్ని చోట్లా ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో ఏజెన్సీ (ఐటిడిఏ) ప్రాంతాల్లో 1,281, వందశాతం ఎస్‌టిల జనాభా ఉన్న పంచాయతీలు 1,177 ఉన్నాయి. మొత్తంగా గిరిజనులు, ఆదివాసీలకు 2,458 పంచాయతీలు రిజర్వుగా ఉండడంతో వాటిల్లో గిరిజనులు, ఆదివాసీలే సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా ఎన్నిక కానున్నారు. వీటిల్లో వారి స్వయం పాలన సాకారమవుతోంది. ఇవి కాకుండా నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో కూడా ఎస్‌టిలకు 688, ఎస్‌సిలకు 2,113 పంచాయతీలు రిజర్వేషన్ ప్రాతిపదికన పోటీచేసే అవకాశం లభించింది.

విద్యావంతులకు అవకాశం కల్పించాలి



భూక్యా జ్యోతి, మేకల తండా, సింగరేణి మండలం.

''గ్రామాలు అభివృద్ధి చెందాలంటే విద్యావంతులైన యువతకు అవకాశం రావాలి. తండాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచ్‌లుగా ఉంటేనే సరిపోదు. ప్రభుత్వం నుండి ఎలా నిధులు తీసుకు రావాలో విద్యావంతులకైతే తెలిసే అవకాశం ఉంటుంది. విధులు, నిధుల గురించి తెలియనివారు సర్పంచుల అయితే ఉపయోగం అంతగా ఉండకపోవచ్చు'' అని సింగరేణి మండలం మేకలతండా గ్రామస్తురాలు భూక్యా జ్యోతి వ్యాఖ్యానించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం



పెందూర్ అనిల్‌కుమార్, రిమ్మ, సిరికొండ మండలం, ఆదిలాబాద్ జిల్లా

''నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుతో మా గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్‌టి జనరల్‌కు కేటాయించడంతో గ్రామాన్ని మేమే అభివృద్ధి చేసుకునే అవకాశం కలిగింది. గతంలో ఇతర గ్రామ పంచాయతీ కింద ఉన్నాం. మా గ్రామ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకుని వెళ్లాక వారి దయాదాక్షిణ్యాలతో పనులు జరిగేవి. ఇకపైన ఆ సమస్య ఉండదు'' అని ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని ఒక గూడేనికి చెందిన పెందూర్ అనిల్ కుమార్ వ్యాఖ్యానించారు.

టిఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి సాధ్యం

అజ్మీరా కాంతి, భజ్యా తండా, సింగరేణి మండలం



''టిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. తండాలను పంచాయితీలుగా చేసి, నూరు శాతం గిరిజనులు ఉన్న పంచాయితీలో గిరిజనులకే పట్టం కట్టేలా నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది. ఇప్పటికే గిరిజన గ్రామాలలో మౌలిక వసతులు కల్పించే దిశగా పనులు నడుస్తున్నాయి. రానున్న రోజులలో మరిన్ని నిధులు తండాలకు కేటాయించే అవకాశం ఉంది. గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం'' అని సింగరేణి మండలం భజ్యా తండాకు చెందిన అజ్మీరా కాంతి వ్యాఖ్యానించారు.

అభివృద్ధి చేసుకొనే అవకాశం వచ్చింది

ఆనంద్‌రావ్, ధర్మసాగర్, సిరికొండ మండలం, ఆదిలాబాద్ జిల్లా



''ధర్మసాగర్ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి ఎప్పటికీ రుణ పడి ఉంటాం. మా గ్రామ సర్పంచ్ స్థానం ఎస్‌టి మహిళకు రిజర్వు అయింది. గ్రామస్థులమంతా కలిసి అందరికీ ఆమోదయోగ్యమైనవారిని సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా ఎన్నుకొని గ్రామాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసుకుంటాం. చాలా కాలం తర్వాత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం'' అని సిరికొండ మండలం దర్మసాగర్ గూడేనికి చెందిన ఆనంద్‌రావ్ అన్నారు.

మా ఊరిలో మా పాలన

లాకావత్ కల్యాణి, బోటితండా, సింగరేణి మండలం, ఖమ్మం జిల్లా



''మా తండా– మా రాజ్యం నినాదంతో గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాలలో మాకు సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా పోటీ చేసే అవకాశం దక్కింది. పాలనలో పాలు పంచుకోవడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ నిధులను తండాలకు కేటాయిస్తే మౌలిక వసతులు కల్పన జరిగి తండాల అభివృద్ధి జరుగుతుంది.ఎస్‌టి, ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు తండాలకే కేటాయిస్తే అభివృద్ధి వేగవంతంగా జరుగుతుంది'' అని ఖమ్మం జిల్లా సింగరేణి మండలం బోటి తండా గ్రామస్తురాలు లకావత్ కల్యాణి వ్యాఖ్యానించారు.

ముంచుకొస్తున్న 'చక్కెర' ప్రమాదం



- 25 ఏళ్లలో రెట్టింపు
- చర్యలు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలో డయాబెటిక్ వ్యాధి వేగంగా విస్తరిస్తుంది. ప్రతీ పది మందిలో ఒకరికి షుగర్ వ్యాధి ఉన్నట్లు గత నెలలో ప్రపంచ డయాబెటిక్ దినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన తాజా సర్వేలోఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. 1990లో తెలంగాణ ప్రాంత జనాభాలో ఐదు శాతం మందికి డయాబెటిక్ ఉంటే, 2016 నాటికి ఏకంగా పది శాతానికి చేరుకోవడం ఆందోళన కలిగించే విషయం. 1990 నాటితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో షుగర్ వ్యాధిగ్రస్తులైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ పాతిక సంవత్సరాల్లో రెట్టింపు స్థాయిలో డయాబెటిక్ రోగులు ఉండటంపై వైద్య నిపుణులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయి పరిమితికి మించి పెరిగిపోవడాన్నే మధుమేహంగా పేర్కొంటారు. దీని వల్ల శరీర పనితీరు దెబ్బతింటుంది. ఎన్నో రకాల సమస్యలు ఎదురవుతుంటాయి. ఇలా గ్లూకోజ్ స్థాయిలు పెరిగిపోవడానికి కారణం క్లోమ గ్రంథి ఇన్సూలిన్ ను తగిన స్థాయిలో విడుదల చేయకపోవడమే. రక్తంలో చక్కెర శాతాలను పరీక్షించడం ద్వారా ప్రాథమికంగా డయాబెటిస్ ను గుర్తించవచ్చు. తాజా గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 16 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతుండగా అందులో 25 శాతానికిపైగా అంటే 4.5 కోట్ల మంది ఒక్క భారతదేశంలోనే ఉన్నట్లు అంచనా. దేశంలోనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో ఈ వ్యాధి మరింత అధికంగా ఉంది. దేశంలో 1990లో 5.5 శాతం మందికి షుగర్ వ్యాధిగ్రస్తులుంటే, 2016 నాటికి 7.7 శాతానికి చేరుకుంది. మనదేశంలో విస్తరిస్తున్న దానికంటే వేగంగా రాష్ట్రంలో షుగర్ వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరుగుతుంది.

స్థూలకాయుల్లో అధికం

మారుతున్న జీవన శైలి, కొవ్వు పదార్థాలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవటం, పెద్దగా శ్రమించవలసిన అవసరం లేకుండా పోవడం.. భోజనం, నిద్ర సమయాల్లో క్రమబద్ధత లోపించడం వంటివాటితో స్థూలకాయం పెరిగి పోతోంది. ప్రపంచంలో ప్రతీ వంద మంది స్థూలకాయుల్లో 19 మంది డయాబెటిక్‌కు గురవుతుంటే, ఆ సంఖ్య మన దేశంలో వందకు 38 మంది ఉండటం గమనార్హం. ఎక్కువ మందిలో స్థూలకాయంతోనే షుగర్ వ్యాధి దరి చేరుతుంది. 1990లో దేశంలో 9 శాతం మంది స్థూలకాయులుంటే, 2016 నాటికి 20.4 శాతానికి చేరుకుంది. ఆ ప్రకారం 1990లో దేశంలో 2.60 లక్షల మంది డయాబెటిక్ రోగులుంటే, ఆ సంఖ్య 2016 నాటికి 7 కోట్లకు చేరుకుంది. అదే తెలంగాణలో 1990లో స్థూలకాయులు 15 శాతం ఉంటే, 25 ఏళ్లలో అంటే 2016 నాటికి 30 శాతానికి చేరుకోవడం గమనార్హం. రాష్ట్ర జనాభాలో ప్రతీ వంద మందిలో 30 మంది, ప్రతీ పది మందిలో ముగ్గురు స్థూలకాయులున్నరమాట. 25 ఏళ్లలో స్థూలకాయులు రెట్టింపు కాగా, అదే స్థాయిలో షుగర్ వ్యాధి బారిన పడుతున్నారని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అధిక బరువు, స్థూలకాయమే షుగర్ ప్రధాన కారణంగా కేంద్రం ప్రకటించింది. దేశంలో 2040 నాటికి 12.3 కోట్ల మంది డయాబెటిక్ రోగులవుతారని వెల్లడించింది. దేశంలో డయాబెటిక్, గుండె, క్యాన్సర్ల తదితర వ్యాధుల కారణంగానే 50 శాతం వరకు మరణాలు సంభవిస్తున్నాయి. అది 2030 నాటికి 75 శాతానికి చేరుకునే ప్రమాదముందని కేంద్రం హెచ్చరించింది.

తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

ముంచుకొస్తున్న ప్రమాదాన్నిపసికట్టిన తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలకు పూనుకొంది. గ్రామీణ ప్రాంతాల్లో షుగర్ వ్యాధిపై అవగాహన కల్పించటం, పరీక్షలు నిర్వహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జాతీయ ఆరోగ్య పథకం (ఎన్ హెచ్ ఎం) కింద సాదారణ షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్తపరీక్ష, మూత్రపరీక్షల ద్వారా డాక్టర్లు వ్యాధి నిర్ధారణ చేసి, పరిస్థితిని బట్టి తగిన చికిత్స చేస్తున్నారు.



స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డిలపై కేసు కొట్టివేత



మన తెలంగాణ/కరీంనగర్ లీగల్ : తెలంగాణ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డిలపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేస్తూ కరీంనగర్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ (పి.సి.ఆర్) రాజు తీర్పు ఇచ్చారు. 2013లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ నియమావళి ఉల్లంఘించారని వన్‌టౌన్ పోలీసులు స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డిలపై వేరువేరు కేసులు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున 7 గురు సాక్షులను విచారించారు. ఇందులో అప్పటి కలెక్టర్‌గా పనిచేసిన స్మితాసబర్వాల్ కూడా సాక్షిగా కోర్టుకు హాజరైనారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువుకాకపోవడంతో స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డిలను నిర్దోషులుగా పేర్కొంటూ సోమవారం తీర్పుచెప్పారు. తదనంతరం జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమాకమైన న్యాయవాదులు కనుకుల సంజీవరెడ్డి, పి.వి.రాజ్‌కుమార్‌లను స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డిలు అభినందించారు. స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డి తరఫున న్యాయవాది సి.విక్రమ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఖర్చులను చెల్లించండి

ఎన్నికల సంఘానికి టిజిటిఏ అసోసియేషన్ వినతిపత్రం

ఉద్యోగులకు టిఏ, డిఏలను చెల్లించాలని విజ్ఞప్తి



మన తెలంగాణ/హైదరాబాద్ : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన బడ్జెట్‌ను విడుదల చేయాలని తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ (టిజిటిఏ) ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసి సోమవారం విజ్ఞప్తి చేసింది. ఇప్పటివరకు 60 శాతం నిధులను విడుదల చేశారని మిగతా 40 శాతం నిధులను విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా ఆయనతో పేర్కొన్నారు. ఎన్నికల వ్యయానికి తగ్గట్లుగా మరింత బడ్జెట్ కేటాయించాలని ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్‌ను కోరినట్లు టిజిటిఏ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, అధ్యక్షుడు గౌతమ్‌కుమార్ తెలిపారు. దీంతో పాటు ఎన్నికల విధుల్లో పనిచేసిన సిబ్బందికి టిఏ, డిఏలు కూడా పూర్తిగా అందలేదని ఈ విషయాన్ని రజత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన సామగ్రి తాలూకు డబ్బులు చెల్లించాల్సి ఉన్నందున తహసీల్దార్లు ఇబ్బంది పడుతున్నారని వారు రజత్‌కుమార్‌తో పేర్కొన్నారు. గతానికి భిన్నంగా ఈ సారి ఎన్నికలకు ముందు వివిప్యాట్, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఎన్నికల సమయంలో వీడియో గ్రఫీ, సిబ్బంది ఏర్పాటు వంటి నూతన విధానాల వలన ఎన్నికల వ్యయం అమాంతం పెరిగిపోయిందని వారు తెలిపారు.

కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్ అనుమతుల జారీ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 68 మున్సిపాలిటీల్లో సోమవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్ అనుమతులు జారీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు డిపిఎంఎస్ (అభివృద్ధి అనుమతి నిర్వాహణ సంస్థ) విధానాన్ని సోమవారం రాష్ట్ర మున్సిపల్ శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి ప్రారంభించారు. ఇప్పటికే ఈ విధానాన్ని పాత 73 మున్సిపాలిటీల్లో అమలవుతూ ఉంది. కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయడం వల్ల రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో జరుగుతున్నట్లయింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకునే అవినీతిని నియంత్రించాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతుల జారీలో ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. ఈ విధానం ద్వారా పదిహేను రోజుల్లోనే బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులను జారీ చేయడం సాధ్యమవుతుంది. ఒక్క రోజు ఆలస్యమైనా సంబంధిత అధికారికి రోజుకు వెయ్యి రూపాయల చొప్పున పెనాల్టీలను విధించడం ఈ విధానం ప్రత్యేకత. ఏదేని కారణాలతో అనుమతులు జారీ చేయలేని పక్షంలో అందుకు దారి తీసిన నిర్దిష్ట కారణాలను సదరు దరఖాస్తుదారుడికి అధికారులు తెలియజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులను జారీ చేయడం వల్ల ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆయా మున్సిపాలిటీల్లోని టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరును తెలుసుకునే అవకాశం లభిస్తుంది. దీంతో భవన నిర్మాణ అనుమతుల్లో వేగం కూడా పెరగడంతో పాటు పారదర్శకంగా ఉంటుందని మున్సిపల్ శాఖ భావిస్తోంది. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ విధానం అమలు జరుగుతున్న తీరును ఆరు నెలల పాటు మున్సిపల్ శాఖ ప్రధాన కార్యాలయం నుంచే సమీక్షిస్తామని శ్రీదేవి తెలిపారు. ఆ తర్వాత ఆయా మున్సిపాలిటీలే ఆన్‌లైన్ విధానాన్ని పర్యవేక్షిస్తాయన్నారు.

మోడీ విధానాలతో విద్యారంగం సంక్షోభం

మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, దీనిని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 18వ తేదీన పార్లమెంట్ ముట్టడికి పిలుపునిచ్చినట్లు ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ సి రంగరాజ్, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణలు పేర్కొన్నారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌స్టాలిన్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడి ప్రభుత్వం విద్యార్థుల హక్కులను కాలరాస్తూ విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. విద్యారంగానికి 10 శాతం నిధులు కేంద్ర బడ్జెట్‌లో అవసరం ఉంటే అరకొర నిధులు కేటాయిస్తూ సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసి యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ (యుజిసి)ని రద్దు చేసే కుట్రలు పన్నుతోందన్నారు. మరోవైపు ఫిలోషిప్‌లను రద్దు చేస్తూ ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయాలనే కుట్రలు చేస్తోందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 18వ తేదీన పార్లమెంట్ ముట్టడికి పిలుపునిచ్చామని దీనిని విజయవంతం చేయాలనివారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎన్.శంకర్, బొనగిరి.మహేందర్, పుట్ట లక్ష్మణ్, బరిగెల వెంకటేశం గ్యార నరేష్, దుర్గం రవీందర్, ఉప్పుశెట్టి రాహుల్‌లు పాల్గొన్నారు.



ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలి

- టిఆర్‌ఎస్‌లో చేరిన ఎంఎల్‌ఏ కోరుకంటి చందర్
- చందర్‌కు సహకరిస్తానని చెప్పిన సోమారపు సత్యనారాయణ

మన తెలంగాణ/హైదరాబాద్: రాజకీయాల్లో ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే గుణాన్ని అలవర్చుకోవాలని టిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు పార్టీ శ్రేణులకు సూచించారు. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించడంతోనే బాధ్యతలు తీరలేదని, పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో 16 స్థానాల్లో విజయం సాధించే లక్ష్యం మన ముందు ఇప్పుడు ఉందని అన్నారు. ఇది 'ఎన్నికల నామ' సంవత్సరం అని వ్యాఖ్యానించారు. పంచాయతీ, పార్లమెంటు, మున్సిపాలిటీ, జిల్లాపరిషత్, మండల పరిషత్, సహకార సొసైటీలు, ఎంఎల్‌సి ఇలా చాలా ఎన్నికలు మన ముందు ఉన్నాయని గుర్తుచేశారు. టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం రామగుండం నియోజకవర్గం నుంచి టిఆర్‌ఎస్ రెబల్‌గా నిలిచి గెలిచిన కోరుకంటి చందర్ టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు నియోజకవర్గంలోని కాంగ్రెస్, బిజెపి, వైసిపి నాయకులు కెటిఆర్ సమక్షంలో టిఆర్‌ఎస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గం నుంచి టిఆర్‌ఎస్ రెబల్‌గా పోటీలో నిలిచి గెలిచిన చందర్‌ను అభినందించారు. కొన్ని రాజకీయ సమీకరణాల్లో ఆనాటి సిట్టింగ్ ఎంఎల్‌ఏ సోమారపు సత్యనారాయణకు పోటీచేసే అవకాశాన్ని పార్టీ కల్పించడంతో అప్పటికే టిఆర్‌ఎస్ ఉద్యమాల్లో పాల్గొన్న చందర్ స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేశారని తెలిపారు. మనసులో చందర్‌పై అభిమానమున్నా ఎన్నికల ధర్మ పోరాటంలో ఏమీ చేయలేని పరిస్థితి ఆనాడు నెలకొందని చెప్పారు. అయితే టిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సోమారపు సత్యనారాయణ, చందర్ ఇద్దరూ కలిసి తెలంగాణ అభివృద్ధి కోసం ముందుకు రావడం ఆనందంగా ఉందని కెటిఆర్ చెప్పారు. సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ ఎంఎల్‌ఏ సీటు ప్రజలు ఇచ్చేది అని, మన కావాలనుకున్నప్పుడు వచ్చేది కాదని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో తాను ఓడిపోయినా కాంగ్రెస్ గెలవకపోవడం సంతోషంగా ఉండటంతో పాటు టిఆర్‌ఎస్ ఉద్యమాల్లో పాల్గొన్న చందర్ గెలవడం



సంతోషంగా ఉందని చెప్పారు. సీనియర్‌గా చందర్‌కు అన్ని విధాలుగా సహకరించనున్నట్లు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సలహాదారు వివేక్ మాట్లాడుతూ చందర్ టిఆర్‌ఎస్‌లో చేరడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో చందర్ చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. సింగరేణి కార్మికులు చందర్ నాయకత్వాన్ని కోరుకున్నారని చెప్పారు. అలిగి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చినట్లుందని ఎంఎల్‌ఏ చందర్ చెప్పారు. తిరిగి టిఆర్‌ఎస్‌లో చేర్చుకున్నందుకు రుణపడి ఉంటానని హామీ ఇచ్చారు. టిఆర్‌ఎస్‌ను ఉద్యమపార్టీగా తీర్చిదిద్ది తెలంగాణ రాష్ట్రం సాధించిన కెసిఆర్‌కు మనమంతా శిష్యుల మేనంటూ ఉద్యమాలను తలుచుకుంటూ చందర్ భావోద్రేకానికి గురయ్యారు. తాను ఎన్నికల్లో టిఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పోటీలో నిలిచినా ఆనాటి ఉద్యమాల నేపథ్యంలో కెసిఆర్ ఆలోచించి తన భార్య చికిత్స కోసం శ్రద్ధ తీసుకోవడం చూస్తుంటే ఇంటి పెద్దగా సిఎం కెసిఆర్ కనిపించారని చెప్పారు. పార్టీలో చేరిన అనంతరం కెటిఆర్‌కు చందర్ పాదాభివందనం చేశారు.

నుమాయిష్‌లో అటవీశాఖ స్టాల్ ఏర్పాటు

ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన అధికారులు

ప్రారంభించిన పిసిసిఎఫ్ పి.కె.ఝా

మన తెలంగాణ/హైదరాబాద్ : 'హరితం.. శివం.. సుందరం' నినాదంతో తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ నుమాయిష్ (ఎగ్జిబిషన్)లో ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేసింది. పర్యావరణ పరిరక్షణతో పాటు పకృతి ప్రాధాన్యతను గుర్తు చేయడం, పిల్లలకు అటవీ జంతువులపై అవగాహన కలిగించేలా చేయడం ఈ స్టాల్ ప్రధాన ఉద్దేశమని అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ స్టాల్‌ను సోమవారం ప్రధాన అటవీ సంరక్షణ అధికారి ప్రశాంత్‌కుమార్ ఝా ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్‌లో స్టాల్ ఏర్పాటు చేయడం అనవాయితీగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖాధికారులు చేపట్టిన వివిధ కార్యక్రమాల సమస్త సమాచారాన్ని ఇందులో పొందుపరుస్తారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా అటవీశాఖ స్టాల్‌ను ఏర్పాటు చేసి సరికొత్తగా తీర్చిదిద్దింది. తెలంగాణ నయగారాగా పేరొందిన బొగత జలపాతంతో పాటు మల్లెల తీర్థం జలపాతాలను ప్రవేశ ద్వారంపై అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. దీంతో పాటు తెలంగాణకు హరితహారం, స్కూల్ పిల్లల ప్రాధాన్యత, వన దర్శిని తదితర కార్యక్రమాలతో పాటు తెలంగాణలో ఎకో టూరిజం స్పాట్లు, వాటి వివరాలు పట్టణ ప్రాంతాల కోసం అభివృద్ధి చేస్తున్న అర్బన్ ఫారెస్టు పార్కులు, అడవులు, జంతు జాలం రక్షణకు తీసుకుంటున్న చర్యలు, గడ్డి క్షేత్రాల పెంపకం, ఈ ఏడాది కూడా అగ్ని ప్రమాదాలు లేని అడవుల సంవత్సరంగా పాటించడం లాంటి వాటితో పాటు అటవీశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాల సమాహారాన్ని ఎగ్జిబిషన్ వేదికగా ప్రదర్శిస్తోంది. దీంతో పాటు పెద్దల కోసం ఔషధ మొక్కల స్టాల్‌ను కూడా ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల కోసం బర్డ్స్ కాల్, మినీ జూను కూడా ఎగ్జిబిషన్‌లోనే ఏర్పాటు చేశారు. అటవీశాఖ ద్వారా చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు, ఆరోగ్య, అభివృద్ధి తెలంగాణలో భాగస్వామ్యం అవుతున్నాయన్నాని పిసిసిఎఫ్ పికె.ఝా తెలిపారు. ఇందుకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది గర్వపడుతున్నారని అన్నారు. అటవీశాఖ స్టాల్ కూడా వీటన్నింటిని ప్రతిబింబిచేలా తీర్చిద్దామని తెలిపారు. సంక్రాంతి సెలవులతో పాటు మరో నెల రోజుల పాటు ఎగ్జిబిషన్ లో ఉండే అటవీశాఖ ప్రదర్శనను సందర్శించేలా ప్రతి ఒక్కరూ ప్లాన్ చేసుకోవాలని అటవీశాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో పిసిసిఎఫ్ (ఐటి, విజిలెన్స్ పి.రఘువీర్, పృధ్వీరాజ్, సిఎం ఓఎస్‌డి ప్రియాంక వర్గీస్, అదనపు అటవీ సంరక్షణ అధికారులు మునీంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఎండి. డొబ్రియేల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.





కేంద్రంలో హంగే

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గం నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆంగోతు భవన్ నాయక్ 76 తండాల్లోని తన ప్రతినిధులతో కలిసి కెటి. రామారావు సమక్షంలో టిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్, బిజెపిలకు అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన '273 మ్యాజిక్ ఫిగర్' రాదని అన్నారు. కేంద్ర రాజకీయాలను పరిశీలిస్తే కాంగ్రెస్ సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితి కను చూపు మేరలో కూడా లేదన్నారు. మరోవైపు బిజెపి పతనం ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ప్రధానమంత్రి ప్రాబల్యం రోజురోజుకూ క్షీణిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు 100 పార్లమెంట్ స్థానాలు, బిజెపికి 150 పార్లమెంట్ స్థానాలు వచ్చినా ప్రభుత్వం ఏర్పాటు చేసే మెజారిటీ ఉండదని తెలిపారు. తెలంగాణలో 16 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధిస్తే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో తెలంగాణ కీలకం కానుందని చెప్పారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చెప్పినట్లు యాచించే స్థాయి నుంచి తెలంగాణ శాసించే స్థాయికి ఎదుగుతుందన్నారు. ఢిల్లీ గద్దెమీద ఎవరు కూర్చోవాలో నిర్ణయించే స్థాయికి తెలంగాణ చేరుకుంటే అభివృద్ధి నిధులు సాధించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్రంగా కృషి చేసే అవకాశం లభిస్తుందన్నారు. తాజాగా జరిగిన శాసనసభ ఎన్నికలతీరు చూస్తే తెలంగాణ ప్రజలు మహత్తరమైన పోరాటం చేశారని కెటిఆర్ ప్రశంసించారు. శాసనసభ ఎన్నికల్లో టిఆర్‌ఎస్ ఒకవైపు ఉంటే ప్రధానమంత్రి నరేంద్రమోడి, రాహుల్ గాంధీ, అమిత్‌షా, 11 మంది కేంద్రమంత్రులు, ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మరోవైపు ఉండి ఎన్నికల పోరాటం చేశారని చెప్పారు. టిఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా దేశంలోని దురంధరులు కాలికి బలపం కట్టుకుని హైదరాబాద్‌పైన, తెలంగాణపై పడ్డారని, అనేక హామీలు కూడా ఇచ్చారన్నారు. నోటికి ఏది వస్తే అదీ చెప్పి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం అరవై ఏళ్లుగా కాంగ్రెస్ ఇస్తున్న వాగ్దానాలను గమనించారని, వారి డొల్ల మాటలను, డొల్ల వాగ్దానాలను నమ్మలేదని, తెలంగాణ ప్రజలు ఎక్కడ దెబ్బకొట్టాలో అక్కడ కొట్టి హైదరాబాద్‌పై పడ్డ కాంగ్రెస్,బిజెపి నాయకులను తరిమి కొట్టారని గుర్తుచేశారు.

మరో నెల రోజుల్లో మిషన్ భగీరథ నీళ్లు

మరో నెల రోజుల్లో మిషన్ భగీరథ తాగునీరు ఇంటింటికీ అందనుందని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రకటించారు. నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు అందనుందని వెల్లడించారు. నల్లగొండలో గొప్పనాయకులమని చెప్పుకుంటున్న జానారెడ్డి తోపాటు ఇతర నాయకులకు ఓటర్లు గుద్దుడుకు దిమ్మతిరిగి పోయిందన్నారు. చిత్తూరు జిల్లా తాగునీటి ప్రాజెక్టు కోసం అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్‌కుమార్ రెడ్డి రూ. 90వేల కోట్ల రూపాయలు తరలించుకుపోతుంటే అదే మంత్రివర్గంలో ఉన్న జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి మౌనంగా ఉన్నారని, నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ బాధితుల కోసం కనీసం వారు డిమాండ్ చేయలేదని కెటిఆర్ ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమకాలంలోనే కెసిఆర్ ఫ్లోరోసిస్ మహమ్మారిని తరిమివేయాలని బహిరంగ సభలు పెట్టి ప్రజలను చైతన్యపరిచారని గుర్తుచేశారు. నల్గొండ జిల్లా దాటుకుని కృష్ణానది పోతున్నా రక్షిత మంచినీరు కరువై, ఎముకల్లో మూలగ నశించి రెండు లక్షల మంది ఫ్లోరోసిస్ బారిన పడ్డా ఆనాటి మంత్రి జానారెడ్డి కానీ, ఇటీవల ట్రాక్టర్ గుర్తుతో లాభపడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి కానీ స్పందించలేదని కెటిఆర్ దుయ్యబట్టారు. మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని కొంతభాగం, తుంగతుర్తి, నల్లగొండ నియోజకవర్గాల్లో కొంత భాగంలో ఫ్లోరోసిస్‌తో పడుతున్న బాధలు ఆనాటి కాంగ్రెస్ నాయకులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. అందుకే శాసనసభ ఎన్నికల్లో జానారెడ్డిని చిత్తుగా ఓడించడంతో పాటు నియోజకవర్గాభివృద్ధికోసం నాగార్జునపేటలో ప్రజలు ఆయన్ని నిలదీశారన్నారు. ఫ్లోరోసిస్‌ను అంతం చేసేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చిత్తశుద్ధితో పనులు ప్రారంభించారని, మిషన్ భగీరథతో రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు పనులు పూర్తి చేయించారన్నారు. శాశ్వత ఉపశమనం కల్పించేందుకు కృషిచేస్తున్నారని కెటిఆర్ చెప్పారు. మరో నెలరోజుల్లో మిషన్ భగీరథ తాగునీరు అందగానే క్రమేణా ఫ్లోరోసిస్ ఒక చరిత్రగానే మిగిలిపోతుందన్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో పెద్ద నాయకులమని చెప్పుకుంటూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ నాయకులకు తాజా ఎన్నికల్లో దిమ్మతిరిగిపోయిందన్నారు. ఓటమితో చావుతప్పి కళ్లులొట్టలు పోయిన కాంగ్రెస్‌ను ప్రజలు శాశ్వతంగా తిరస్కరించారని చెప్పారు.

దేశానికి దిక్సూచి తెలంగాణ

తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ మనసులో పుట్టిన మానసపుత్రికలైన రైతుబంధు,రైతు బీమాదేశానికే ఆదర్శం కావడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. కోత లేని కరెంట్, ఫ్లోరోసిస్ దూరం చేసేందుకు ఇంటింటికి తాగునీరు, కోటి ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులు, పేదలను కడుపులో పెట్టుకుని కాపాడుతూ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం త్వరలో ఆసరా పింఛన్లను వేయి నుంచి రూ.2 వేలకు పెంచనుందని వెల్లడించారు. తండాలను గ్రాపంచాయితీలుగా గుర్తించాలని గిరిజనసంఘాలు సంవత్సరాల తరబడి ఉమ్మడిపాలనలో ఆందోళనలు చేసిన ఆనాటి పాలకులు స్పందించలేదని కెటిఆర్ గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించగానే ముఖ్యమంత్రి ఈ సమస్యను అధ్యయనంచేసి తండాలను గ్రామ పంచాయితీలుగా ప్రకటించారని చెప్పారు. 12,750 గ్రామపంచాయితీల్లో ఉన్న 3,400 తండాల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరగడంతో పాటు గులాబీ జెండా గుబాళించాలని పిలుపునిచ్చారు. తండాల్లో గిరిజనులు సర్పంచులు కాబోతున్నారు. గిరిజనులకు దక్కిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తండాల అభివృద్ధికోసం కృషిచేయాలని కెటిఆర్ కోరారు. పాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రజల దగ్గరకు ప్రభుత్వం పాలనతీసుకు వచ్చిందని చెప్పారు. అలాగే నందికొండ, ఆలియ మున్సిపాలిటీల అభివృద్ధికోసం నిధులు విడుదల చేసేందుకు సిఎం కెసిఆర్ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీలోచేరిన అంగోతు భవన్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ భివృద్ధి టిఆర్‌ఎస్ తోనే సాధ్యమని చెప్పారు. జానారెడ్డి లాంటి నాయకులు ప్రజలకోసం కనీసం సమయం కూడా ఇవ్వరన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ను దేశం ఆదర్శంగా తీసుకుంటుండగా అభివృద్ధిపై ఆలోచన లేని కాంగ్రెస్‌లో ఉండటం న్యాయం కాదనిపించి 76 తండాల నుంచి భారీసంఖ్యలో టిఆర్‌ఎస్‌లో చేరినట్లు ఆయన వివరించారు. ఎంఎల్‌ఏ నోముల నర్సింహయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

రెండు లారీలు ఢీ : ఇద్దరు మృతి

అతివేగం ప్రమాదానికి కారణం



మన తెలంగాణ/పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామం కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామం మధ్య ప్రధాన రహదారిలో రెండు లారీలు సోమవారం రాత్రి ఎదురెదురు ఢీకొని ఇద్దరు వ్యక్తులు దుర్మరణపాలైయ్యారు. పెద్దపల్లి నుంచి మంథని మండలం పుట్టపాక గ్రామానికి కంకర లోడుతో వెలుతున్న లారీ టీఎస్ 02 యుబి 6363 లారి ని ఎదురుగా వస్తున్న కాళేశ్వరం నుంచి హైదరాబాద్ ఇసుక తీసుక వెళుతు న్న మరో లారీ ఎపి 28 పిబి 5239 లారీ ఢీకొంది. ఈ రోడ్డు ప్రమాధంలో పుట్టపాకకు చెందిన లారీ డ్రైవర్ ఎరుకల మల్లేశ్ (38) అక్కడికక్కడనే మృతి చెందగా, మరోలారీ డ్రైవర్ తల పోయి ఎక్కడపడ్డదో తెలయలేదు. దీంతో మృతి చెందిన మరో వ్యక్తి వివరాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి సీఐ నరేందర్, బసంత్‌నగర్ ఎస్ఐ షేక్ జానీపాషా, కమాన్‌పూర్ ఎస్ఐ మల్లేశంలు తన పోలీసు సిబ్బందితో సంఘటన స్థలం చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మృత దేహాలను వెలికితీశారు. ఈ ఘోర రోడ్డు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోడీఎన్నికల డ్రామా ఆడుతున్నారు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రధాని నరేంద్ర మోడీ సరికొత్త డ్రామా ఆడుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తానని ఎన్నికల ముందు పేర్కొనడం ప్రజలను మోసం చేయడంలో భాగమని ఆరోపించారు. ఇది కంటి తుడుపు చర్య అని, ఓట్ల కోసం ఆడుతున్న మోసపూరిత కుట్ర అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు 50 శాతం రిజర్వేషన్లు మించవద్దని పేర్కొనిందని, దీనికి రాజ్యాంగ సవరణ కింద మూడింట రెండు వంతుల మంది సభ్యులు, రాష్ట్రాలు ఆమోదిస్తేనే అదనంగా కల్పించాలనుకుంటున్న 10 శాతం రిజర్వేషన్లు సాధ్యమని పేర్కొన్నారు. ఐదేళ్ళుగా స్తబ్ధుగా ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఈ స్టంట్‌కు తెరతీశారన్నారు. ఈ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని ఆయన పేర్కొన్నారు.



కంగారూల గడ్డపై టీమిండియా

నయా చరిత్ర

కరుణించని వరుణుడు
ఆఖరి టెస్టు డ్రా
భారత్‌కు సిరీస్

ఈ గెలుపు ప్రత్యేకమైంది విరాట్ కోహ్లి

తన కెరీర్‌లో ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్ గెలుపు చాలా ప్రత్యేకమైంది. నా దృష్టిలో 2011 ప్రపంచకప్ విజయం కంటే ఇది నాకు ఎంతో విలువైనది. ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపై ఓడించి టెస్టు సిరీస్‌ను గెలుచు కోవడం దాదాపు అసాధ్యమే. గతంలో మూడు సార్లు ఇక్కడ జరిగిన సిరీస్‌లలో పాల్గొన్నాను. అప్పుడూ తెలిసింది ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ ఎంత కఠినమో. ఇక నా సారథ్యంలో ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలుచుకో వడం జీవితంలో మరచి పోలేని అనుభూతి ఇచ్చింది. ఈ గెలుపు తనకు చిరకాలం గుర్తుండి పోతుంది. ఆస్ట్రేలియా గడ్డపైనే టెస్టు కెప్టెన్సీకి శ్రీకారం చుట్టాను. అక్కడి నుంచే టీమిండియాలో మార్పు మొదలైంది. ఆ తర్వాత స్వదేశంలో, బయట జరిగిన సిరీస్‌లలో టీమిండియా మెరుగైన ప్రదర్శన కనబరిచింది. శ్రీలంక, వెస్టిండీస్ గడ్డపై సిరీస్‌లు గెలిచాం. దక్షిణాఫ్రికాలో గట్టిగా పోరాడాం. ఇంగ్లండ్‌లో కూడా బాగానే ఆడిన అదృష్టం కలిసి రాలేదు. తాజాగా ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్‌ను సొంతం చేసుకున్నాం. ఈ గెలుపు జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. భవిష్యత్తులో మరిన్ని చారిత్రక విజయాలు సాధించేందుకు ఇది దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు. ఈ విజయం యువ జట్టుకు ఒక పునాది రాయి లాంటిది. ఈ సిరీస్ ద్వారా రిషబ్ పంత్, మయాంక్‌ల రూపంలో అరుదైన అస్త్రాలు భారత్‌కు దొరికాయి.





చారిత్రక విజయమిది

ముంబయి: ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించిన టీమిండియాపై దేశ వ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జట్టును అభినందించారు. భారత మాజీ క్రికెటర్లు సచిన్, గంగూలీ, లక్ష్మ న్, సెహ్వాగ్, హర్భజన్, మంజ్రేకర్, కైఫ్, ఆకాశ్ చోప్రా, అమిత్ మిశ్రా తదితరులు టీమిండియాపై ప్రశంసలు కురిపించారు. కోహ్లి సేన ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్‌ను గెలిచి కొత్త ఆధ్యాయానికి తెరలేపిందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా టీమిండియాను అభినందించారు. కాగా, అభిమానులు, బాలీవుడ్, రాజకీయ ప్రముఖులు కూడా భారత జట్టుపై ప్రశంసలు కురిపించారు. ఈ విజయం చారిత్రాత్మకమని వారు అభివర్ణించారు.

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్‌ను గెలిచి టీమిండియా చరిత్ర సృష్టించింది. భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య సిడ్నీలో జరిగిన నాలుగో, చివరి టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో సిరీస్‌ను టీమిండియా 2–1తో సొంతం చేసు కుంది. ఆస్ట్రేలియా గడ్డపై భారత్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్. అంతేగాక ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. చివరి టెస్టుకు చివరి రోజు కూడా వర్షం అడ్డంకిగా మారింది. ఆఖరి రోజు ఒక్క బంతి కూడా పడకుండానే ఆటను రద్దు చేశాడు. దీంతో చివరి టెస్టు ఫలితం తేలకుండానే డ్రాగా ముగిసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల నష్టానికి 622 పరుగులు సాధించి డిక్లేర్డ్ చేసింది. తర్వాత తొలి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా 300 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్‌కు ఫాలోఆన్ తప్పలేదు. తర్వాత రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా ఆరు పరుగులు చేసింది. కాగా, వర్షం వల్ల ఆటకు పలుసార్లు అంతరాయం కలిగింది. చివరికి మ్యాచ్ డ్రాగా ముగియక తప్పలేదు. దీంతో నాలుగు మ్యాచ్‌ల సిరీస్ టీమిండియా వశమైంది. తొలి టెస్టులో భారత్ గెలవగా, రెండో టెస్టును ఆస్ట్రేలియా దక్కించుకుంది. మూడో టెస్టులో మళ్లీ భారత్ గెలిచింది. చివరి మ్యాచ్ డ్రాగా ముగియడంతో టీమిండియా 2–1తో సిరీస్ దక్కించుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం భారత జట్టు టెస్టు సిరీస్ గెలుచుకోవడం విశేషం. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలిచిన తొలి భారత కెప్టెన్‌గా విరాట్ కోహ్లి చరిత్ర సృష్టించాడు. కోహ్లి సారథ్యంలోని టీమిండియా 72 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్‌ను గెలుచుకుంది. సమష్టి పోరాటం వల్లే భారత్‌కు ఈ చారిత్రక విజయం దక్కిందని చెప్పాలి. చటేశ్వర్ పుజారా మూడు శతకాలతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి ప్రతిభకు గుర్తింపుగా ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు కూడా వరించింది. అంతేగాక చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 193 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు కూడా దక్కించుకున్నాడు.

ఒక్క బంతి పడకుండానే

చివరి రోజు ఆటకు వరుణుడు అడ్డంకిగా మారాడు. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో మైదానం మొత్తం చిత్తడిగా మారింది. నిర్వాహకులు పిచ్‌ను మ్యాచ్‌కు అనుకూలంగా మార్చేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. అంపైర్లు పలుమార్లు పిచ్‌ను పరిశీలించారు. ఒకవైపు వర్షం, మరోవైపు వెలుతురు లేమితో ఆట సాధ్యం కాలేదు. లంచ్ విరామం తర్వాత ఆట ప్రారంభమవుతుందని భావించినా మళ్లీ వర్షం జోరందు కోవడంతో ఆట ముందుకు సాగలేదు. చివరికి చివరి రోజు ఆటను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియక తప్పలేదు.



72 ఏళ్ల నిరీక్షణకు తెర

ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలవాలనే టీమిండియా నిరీక్షణకు 72 ఏళ్ల తర్వాత తెరపడింది. ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను కోహ్లి సేన 2–1తో కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. గతంలో మూడు సార్లు ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌లను డ్రా చేసుకున్న టీమిండియా ఈసారి చరిత్రను తిరగ రాసింది. తొలిసారి ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపై ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. 72 ఏళ్లుగా ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న టీమిండియా ఎప్పుడూ కూడా టెస్టు సిరీస్‌ను గెలుచుకోలేదు. 1980–81, 1985–86, 2003–04లలో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌లను టీమిండియా డ్రాగా ముగించింది. అయితే ఈసారి ఏకంగా 2–1తో సిరీస్‌ను గెలుచుకుని ఈ ఘనత సాధించిన తొలి ఆసియా జట్టుగా నిలిచింది. పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌ను గెలవలేదు. విరాట్ కోహ్లి టెస్టు కెప్టెన్సీ సాధించిన తర్వాత టీమిండియా విదేశాల్లో వరుస విజయాలు సాధిస్తూ వస్తోంది. శ్రీలంక, వెస్టిండీస్, ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌లలో కోహ్లి సారథ్యంలోని టీమిండియా టెస్టు సిరీస్‌లను గెలుచుకుంది. ఇదిలావుండగా ఆస్ట్రేలియా గడ్డపై ఎక్కువ సిరీస్‌లు గెలిచిన ఘనత ఇంగ్లండ్‌కు దక్కుతోంది. ఇంగ్లండ్ 13 సార్లు ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌లను గెలుచుకుంది. వెస్టిండీస్ నాలుగు సార్లు ఈ ఘనత సాధించింది. దక్షిణాఫ్రికా మూడు సార్లు ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌లను గెలుచుకుంది. భారత్, న్యూజిలాండ్ జట్లు ఒక్కోసారి ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలిచాయి. పాకిస్థాన్, శ్రీలంక జట్లు ఒక్కసారి కూడా ఈ ఘనత సాధించలేదు.

కోహ్లి కెప్టెన్సీలో విదేశాల్లో గెలిచిన సిరీస్‌లు

2015లో 2–1తో శ్రీలంకపై
2016లో 2–0తో వెస్టిండీస్‌పై
2017లో 3–0తో శ్రీలంకపై
2018–19లో 2–1తో ఆస్ట్రేలియాపై

స్కోరు బోర్డు:

భారత్ మొదటి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్ (సి) స్టార్క్ (బి) నాథన్ లియాన్ 77, లోకేశ్ రాహుల్ (సి) షాన్ మార్ష్ (బి) హాజిల్‌వుడ్ 9, చటేశ్వర్ పుజారా 130 (సి) అండ్ (బి) లియాన్ 193, విరాట్ కోహ్లి (సి) పైన్ (బి) హాజిల్‌వుడ్ 23, అజింక్య రహానె (సి) పైన్ (బి) స్టార్క్ 18, హనుమ విహారి (సి) మర్నూస్ (బి) లియాన్ 42, రిషబ్ పంత్ నాటౌట్ 159, రవీంద్ర జడేజా (బి) లియాన్ 81, ఎక్స్‌ట్రాలు 20, మొత్తం 167.2 ఓవర్లలో 622/7 డిక్లేర్డ్.
బౌలింగ్: మిఛెల్ స్టార్క్ 26–0–123–1, జోష్ హాజిల్‌వుడ్ 35–11–105–2, పాట్ కమిన్స్ 28–5–101–0, నాథన్ లియాన్ 57.2–8–178–4, మార్నస్ లబుస్చాంగే 16–0–76–0, ట్రావిస్ హెడ్ 4–0–20–0, ఉస్మాన్ ఖ్వాజా 14–0–4–0.

ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ (బి) రవీంద్ర జడేజా 79, ఉస్మాన్ ఖ్వాజా (సి) పుజారా (బి) కుల్దీప్ యాదవ్ 27, మార్నస్ లబుస్చాంగే (సి) రహానె) షమి 38,
షాన్ మార్ష్ (సి) రహానె (బి) రవీంద్ర జడేజా 8, ట్రావిస్ హెడ్ (సి) అండ్ (బి) కుల్దీప్ యాదవ్ 20, పీటర్ హాండ్స్‌కోంబ్ (బి) బుమ్రా 37, టిమ్ పైన్ (బి) కుల్దీప్ యాదవ్ 5, పాట్ కమిన్స్ (బి) షమి 25, మిఛెల్ స్టార్క్ నాటౌట్ 29, నాథన్ లియాన్ ఎల్బీ–బి కుల్దీప్ యాదవ్ 0, హాజిల్‌వుడ్ ఎల్బీ–బి కుల్దీప్ యాదవ్ 21, ఎక్స్‌ట్రాలు 11, మొత్తం 104.5 ఓవర్లలో 300 ఆలౌట్.
బౌలింగ్: మహ్మద్ షమి 19–2–58–2, జస్‌ప్రీత్ బుమ్రా 21–5–62–1, రవీంద్ర జడేజా 33–11–73–2, కుల్దీప్ యాదవ్ 31.5–6–99–5, హనుమ విహారి 1–0–2–0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖ్వాజా (బ్యాటింగ్) 4, మార్కస్ హారిస్ (బ్యాటింగ్) 2, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం 4 ఓవర్లలో 6/0.
బౌలింగ్: మహ్మద్ షమి 2–1–4–0, జస్‌ప్రీత్ బుమ్రా 2–1–2–0.

విశాల

"ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ తన పదవికి రాజీనామా చేశారు. ఫిబ్రవరి 1న అధ్యక్షుడిగా బాధ్యతల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. జిమ్ పదవీకాలం 2022 వరకు ఉన్నప్పటికీ.. మూడేళ్ల ముందే పదవిని వదులుకోవడం గమనార్హం. మౌలిక రంగంలోని సంస్థలో అవకాశం రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కిమ్ వెల్లడించారు."

ఇది మాస్టర్‌స్ట్రోక్..మరిన్ని స్ట్రోక్‌లు ఖాయం

న్యూఢిల్లీ: ఉద్యోగాలు, విద్యాసంస్థలలో ప్రవేశాలకు అగ్రకులాలలోని పేదలకు 10% శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖ మంత్రి రాందాస్ అథావలె స్వాగతించారు. ప్రభుత్వ చర్యను "మాస్టర్‌స్ట్రోక్"గా అభివర్ణించిన అథావలె పార్లమెంట్ శీతాకాల సమావేశాల చివరిరోజు మంగళవారం నాడు ప్రవేశపెట్టనున్న ఈబిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించకూడదని ఆయన కోరారు. "ఇదో మాస్టర్‌స్ట్రోక్..అయితే ఇంకా చాలా స్ట్రోకులు పెండింగ్‌లో ఉన్నాయి. మోడీ ఒక బలమైన బ్యాట్స్‌మన్. మరిన్ని సిక్సర్లు, ఫోర్లు వస్తాయి" అని ఆర్‌పిఐ నాయకుడైన అథావలె చెప్పారు.

ఎంజిఆర్ వేషంలో వచ్చి సస్పెండైన ఎంపి



న్యూఢిల్లీ: విభిన్న వేషధారణలతో లోక్‌సభలో తన నిరసన తెలియచేస్తున్న చిత్తూరు టిడిపి ఎంపి ఎన్ శివప్రసాద్ సోమవారం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అలనాటి సినీనటుడు ఎంజిఆర్‌ను పోలిన వేషధారణతో సభలోకి ప్రవేశించడంతోపాటు ఎంజిఆర్ నటించిన తమిళ సినిమా పాటను కూడా వినిపించారు. అనంతరం, సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించినందుకు శివప్రసాద్‌తో అన్నా డిఎంకె సభ్యులు ముగ్గురిని స్పీకర్ సుమిత్రా మహాజన్ సభ నుంచి రెండు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎంజిఆర్ వేషధారణతో చేతిలో కొరడా పట్టుకుని సభలోకి ప్రవేశించిన శివప్రసాద్ నేరుగా వెల్‌లోకి దూసుకువెళ్లి, కావేరీ జలాలపై నిరసన తెలియచేస్తున్న ఎంపీలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. స్పీకర్ సభను వాయిదావేయడంతో శివప్రసాద్ ఆడియో ప్లేయర్ ఆన్ చేసి ఎంజీఆర్ పాట వినిపించారు. వెంటనే బిజెపి సభ్యుడు అనురాగ్ ఠాకూర్ ఆడియో ప్లేయర్ స్విచాఫ్ చేశారు.

ఆకలి బాధతో పురుగుల మందు తాగాడు

భోపాల్: ఆకలిని తట్టుకోలేక ఒక గిరిజన బాలుడు పురుగుల మందు తాగాడు. మధ్యప్రదేశ్‌లోని రత్లామ్ జిల్లాలోని ఈ ఘటన వెలుగులోకి రావడంతో దీనిపై విచారణకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సిపిసిఆర్) ఆదేశించింది. కమిషన్‌కు చెందిన ఒక బృందం దీనిపై విచారణ జరుపుతోంది. అయితే ఆ పిల్లవాడి వయసును అధికారులెవరూ బయటపెట్టడం లేదు. డిసెంబర్ 31వ తేదీన ఆ గిరిజన బాలుడు స్థానిక రేషన్ షాపుకు వెళ్లి గోధుమలు ఇవ్వాలని పదేపదే అర్థించినా డీలర్ ఇవ్వకపోవడంతో ఆకలిని భరించలేక ఆ బాలుడు పురుగుల మందు తాగాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానిక పత్రికలు తెలిపాయి. సంఘటనపై విచారణ జరుపుతున్న ఎన్‌సిపిసిఆర్ బృందం త్వరలోనే తన నివేదికను సమర్పిస్తుందని ఒక అధికారి చెప్పారు.

సంకీర్ణం నుంచి తప్పుకున్న ఎజిపి

సిటిజన్‌షిప్ బిల్లుపై మారని బిజెపి తీరు.. నేడు ఈశాన్య రాష్ట్రాల బంద్

గౌహతి: అసోంలో బిజెపి సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వం నుంచి అసోం గణపరిషద్ (ఎజిపి) సోమవారం వైదొలగింది. పౌరసత్వ బిల్లుపై సవరణ ప్రతిపాదన ఉపసంహరణకు కేంద్రానికి నచ్చచెప్పే విషయంలో తను చేసిన చివరి ప్రయత్నం కూడా విఫలం కావడంతో ఎజిపి ఈ నిర్ణయం తీసుకుంది. సోమవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చల తర్వాత ఎజిపి అధ్యక్షుడు అతుల్ బోరా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. 'అస్సాం ఒప్పందానికి ఈ బిల్లు వ్యతిరేకమని, నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ ను సవరించే ప్రక్రియను మానుకోమని కేంద్రానికి నచ్చ చెప్పేందుకు మేము ఎంతో ప్రయత్నించాం. అయితే, రేపు ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందితీరుతుందని రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. ఆయన అలా కచ్చితంగా చెప్పిన తర్వాత, ఇంక కూటమిలో కొనసాగే ప్రశ్నే లేదు. ఇలా ఉండగా, పౌరసత్వ బిల్లు సవరణకు వ్యతిరేకంగా అనేక విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు మంగళవారం 11గంటలపాటు ఈశాన్య రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఆసు, నెసో వంటి విద్యార్థి సంఘాలు ఈ బంద్‌లో చురుకుగా పాల్గొంటాయి. బంద్‌కు ఎజిపి మద్దతిస్తోంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు భారతదేశ పౌరసత్వం ఇవ్వాలని ఈ సవరణ బిల్లులో ప్రతిపాదించారు.

ఎంపి అసెంబ్లీ స్పీకర్ పోస్ట్‌కు బిజెపి పోటీ

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో ప్రతిపక్షం బిజెపి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పదవికి పోటీపడుతోంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆ పదవికి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. స్పీకర్ పదవికి పోటీకి నిలవాలన్న బిజెపి నిర్ణయాన్ని ముఖ్యమంత్రి కమల్‌నాథ్ స్వాగతించారని రాష్ట్ర మంత్రి ఒకరు తెలిపారు. అయితే, స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునే సంప్రదాయం రాష్ట్రంలో ఉంది కనుక, బిజెపి తన అభ్యర్థిని ఉపసంహరించుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. గోటెగావ్ నుంచి కాంగ్రెస్ ఎంఎల్‌ఏగా ఎన్నికైన ఎన్‌పి ప్రజాపతి స్పీకర్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి, హర్‌సుద్ ఎంఎల్‌ఏ విజయ్ షాను బిజెపి తన అభ్యర్థిగా నిలబెట్టింది.మాజీ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్, ఇతర బిజెపి నాయకులు వెంటరాగా విజయ్ షా స్పీకర్ పదవికి నామినేషన్ వేశారు.ప్రోటెం స్పీకర్‌ను నియమించే సంప్రదాయానికి కాంగ్రెస్ స్వస్తి చెప్పిందని బిజెపి ఆరోపించింది.

ఇందిరాగాంధీని కీర్తించిన గడ్కరీ



నాగపూర్: దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీపై బిజెపి సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసల వర్షం కురిపించారు. ఎటువంటి రిజర్వేషన్లు లేకుండానే ఇందిరా గాంధీ కాంగ్రెస్ పార్టీలోని పురుష నాయకుల మీద తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని గడ్కరీ కీర్తించారు. ఆదివారం నాడిక్కడ మహిళా స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసిన ఒక ఎగ్జిబిషన్‌ను గడ్కరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాను వ్యతిరేకం కాదని, కాని కుల, మతాలపై ఆధారపడే రాజకీయాలకు తాను వ్యతిరేకమని చెప్పారు. దేశంలో ఎమర్జన్సీని విధించినందుకు ఇందిరా గాంధీని తీవ్రంగా విమర్శించే బిజెపి నుంచి ఆమెను ప్రశంసలు దక్కడం విశేషం. "కాంగ్రెస్ పార్టీలోని ఇతర పురుష నాయకుల కన్నా తన సామర్థ్యం ఏమిటో ఇందిరా గాంధీ నిరూపించుకోగలిగారు. ఇది రిజర్వేషన్ వల్ల జరిగిందా?" అని గడ్కరీ ప్రశ్నించారు. బిజెపి మహిళా నాయకులు సుష్మా స్వరాజ్, వసుంధరా రాజె, సుమిత్రా మహాజన్ వంటి వారు కూడా రిజర్వేషన్లకు అతీతంగా రాజకీయాలలో రాణించారని ఆయన చెప్పుకొచ్చారు. "ఏ వ్యక్తయినా తన ప్రతిభ ఆధారంగానే పురోభివృద్ధి సాగిస్తాడు. ఛత్రపతి శివాజీ మహారాజ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లేదా జ్యోతిబా పూలే కులం గురించి అడుగుతామా? కుల, మతాల ప్రాతిపదికన చేసే రాజకీయాలకు నేను వ్యతిరేకం?" అని గడ్కరీ స్పష్టం చేశారు.

రైతుల బకాయిలు చెల్లించని బిజెపి : రాహుల్

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో సంక్షోభానికి కేంద్రమే కారణమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సోమవారం ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో బిజెపి ప్రభుత్వాలు చెరకు రైతులకు రూ.11,000 కోట్ల బకాయిలు చెల్లించలేదని, కానీ బడా వ్యాపారవేత్త జేబులో రూ.30,000 కోట్లు ఉంచాయని విమర్శించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌ల్లో మిల్లు యజమానులు రైతులకు పదకొండువేల కోట్ల రూపాయలు బకాయి పడ్డారని మీడియాలో వార్త రావడంతో రాహుల్ గాంధీ స్పందించారు. 'ఒకవైపు రైతు ఏడాదంతా చెమటోడ్చి పండించిన చెరకును మిల్లుకు తీసుకెడతాడు. కానీ తన కష్టానికి ప్రతిఫలం ఇమ్మని రైతు అడిగితే ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వవు.

పార్లమెంట్‌లో సిబిఐ హైరానా

సాగని సభలు, వాయిదా.. నిరసనల హోరు



న్యూఢిల్లీ : ప్రధాన ప్రతిపక్షాల నిరసనలు, తీవ్ర గందరగోళం మధ్య సోమవారం పార్లమెంట్ వాయిదా పడింది. కేంద్రం సిబిఐని రాజకీయ ప్రత్యర్థులపై అస్త్రంగా మలుచుకొంటోందని లోక్‌సభలో సమాజ్‌వాది పార్టీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేత, మాజీ సిఎం అఖిలేష్ యాదవ్‌పై అక్రమ ఇసుక తవ్వకాల కేసు బనాయిస్తున్నారని, సిబిఐ విచారణకు పురికొల్పుతున్నారని ఎస్‌పి సభ్యులు లోక్‌సభలో గందరగోళం సృష్టించారు. తమ చేతుల్లోని కాగితాలను చింపివేసి, వాటిని స్పీకర్ వైపు విసిరారు. దీనితో సభలో జుగుప్సాకర స్థితి నెలకొంది. బిజెపి అధినాయకత్వం ప్రోద్బలంతోనే తమ నేత అఖిలేష్‌పై సిబిఐ దాడులకు రంగం సిద్ధం అవుతోందని ఎస్‌పి సభ్యులు నిరసనలకు దిగారు. ఓ వైపు ఉభయసభలలో రాఫెల్ అంశంపై కాంగ్రెస్, వామపక్షాలు, టిఎంసిలు సర్కారుపై విమర్శనాస్త్రాలను సంధిస్తూ వెల్‌లోకి దూసుకు వెళ్లాయి. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకోసం టిడిపి సభ్యులు పట్టువీడకుండా నిరసనలకు దిగారు. ఈ తరుణంలోనే ఇప్పుడు అఖిలేష్‌పై సిబిఐ కేసు అంశం కీలకంగా మారింది. సభ ప్రారంభం అయినప్పటి నుంచే ఎస్‌పి సభ్యులు సిబిఐని వాడుకుంటున్న కేంద్రం తీరుపై మండిపడుతూ వచ్చారు. ఎస్‌పి, కాంగ్రెస్, అన్నాడిఎంకె, టిడిపిల నిరసనలతో లోక్‌సభ వరుసగా మూడు సార్లు వాయిదా పడుతూ వచ్చింది. తరువాత కూడా పరిస్థితిలో తేడా రాకపోవడంతో, పైగా స్పీకర్‌పైకి సభ్యులు పేపర్ రాకెట్లు విసరడంతో పరిస్థితి దిగజారింది. ఈ రోజుకు పూర్తిగా వాయిదా పడింది. ఎస్‌పి సభ్యులు తమ హంగామాలో భాగంగా ఓ దశలో లోక్‌సభ సెక్రెటరీ జనరల్ వేదిక వద్ద ఉండే అధికారుల పత్రాలను లాక్కోవడానికి యత్నించారు. సిబిఐ ఇప్పుడు బిజెపి వారి పెంపుడు చిలకగా మారిందని, చివరికి అధికార పార్టీ తోక అయిందని ఎస్‌పి సభ్యులు ధర్మేంద్ర యాదవ్ నిరసన వ్యక్తం చేస్తూ బిగ్గరగా అరుపులకు దిగారు. ఈ దశలోనే సభలో వ్యక్తిగత చట్టాల సవరణల బిల్లు ఆమోదం పొందడంతో ఎస్‌పి సభ్యుల ఆగ్రహం మరింత తీవ్రం అయింది. ఆ తరువాత అజెండాలోని మరో అంశంపై సభ సిద్ధం అవుతున్న దశలో ఎస్‌పి సభ్యులు కాగితాలను తీసి స్పీకర్ వైపు విసిరారు. ఈ రసాభాస సాగుతున్నప్పుడు సభలో ఎస్‌పి మునుపటి అధినేత ములాయం సింగ్ యాదవ్ కూడా ఉన్నారు. తరువాతి దశలో సభలో కాంగ్రెస్ సభయులు ప్లకార్డులు పట్టుకుని, రాఫెల్ డీల్‌పై జెపిసి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ నినాదాలకు దిగడంతో సభలో తిరిగి రాఫెల్ వేడి రగులుకుంది. ఇక ఏకైక అన్నా డిఎంకె సభ్యుడొకరు తమ పార్టీ డిమాండ్ మేరకు కావేరీ నదిపై ఆనకట్ట నిర్మాణ ప్రక్రియపై నిరసన కొనసాగించారు. ఆయన వెల్‌లో నిలిచారు. ఇదే సమయంలో టిడిపి సభ్యుడొకరు తమిళనాడు మాజీ సిఎం ఎంజి రామచంద్రన్ తరహా గెటప్‌లో వచ్చి అన్నాడిఎంకె సభ్యుడికి సంఘీభావంగా నిలిచారు.

రగిలిన రాజ్యసభ వాయిదా

శీతాకాల పార్లమెంట్ ముగిసేందుకు మరో ఒక్క రోజు ఉన్న దశలో సోమవారం రాజ్యసభ గందరగోళం మధ్య వాయిదా పడింది. సిబిఐని కేంద్రం దుర్వినియోగపరుస్తోందని ఎస్‌పి, బిఎస్‌పి, ఆప్, ఆర్జేడీ, టిఎంసి సభ్యులు నిరసనలకు దిగారు. అఖిలేష్ యాదవ్‌పై సిబిఐ దర్యాప్తునకు రంగం సిద్ధం చేయడం ఈ ప్రక్రియలో తాజా అంకం అని విమర్శించారు. సోమవారం సభ ప్రారంభం కాగానే అజెం డా అధికారిక పత్రాలు అందుకోగానే బిఎస్‌పి సభ్యులు కేంద్రం రాజకీయ కక్ష సాధింపులకు దిగుతోందని మండిపడ్డారు. అఖిలేష్ యాదవ్‌పై సిబిఐ విచారణను ఏ ప్రాతిపదికన చేపడుతారని నిలదీశారు. ఇక వామపక్ష సభ్యు లు లేచి కేరళలో హింసాకాండ గురించి ప్రస్తావించారు. కేంద్రం సంకేతాలతోనే కేరళలో శబరిమలపై ఉద్రిక్తత పరిస్థితి నెలకొందని విమర్శించారు. రాఫెల్‌పై కాంగ్రెస్ వారు నిరసనలు సాగించారు. ఈ దశలో సభాధ్యక్షులు ఎం.వెంకయ్యానాయుడు స్పందిస్తూ కొందరు సభ్యుల నుంచి 267 నిబంధన మేరకు రోజు వారి కార్యకలాపాల రద్దుకు దిగి తాము లేవనెత్తుతున్న అంశాలను ప్రస్తావించాలని డిమాండ్ వచ్చిందన్నారు. అయితే ఈ నోటీసుల్లో దేనిని తాను అనుమతించడం లేదని స్పష్టం చేశారు. సభ సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని, వారు వారి స్థానాలలో కూర్చోవాలని సూచించారు. సభ్యుల తీరుతెన్నులు పార్లమెంటరీ పద్ధతులు అన్పించుకోవని ఆగ్రహించారు. సరైన నిబంధనల మేరకు సభ్యులు అన్ని అంశాలపైనా చర్చించవచ్చునని తెలిపారు. సభలో గందరగోళం కొనసాగింది. దీనితో లోక్‌సభ మాదిరిగానే రాజ్యసభ కూడామరో రోజుకు అర్థాంతరంగా వాయిదా పడింది. గందరగోళం నడుమనే సభలో ఆయుష్ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్ రెండు ఆరోగ్య సంబంధిత బిల్లులను ప్రవేశపెట్టారు.

సిబిఐ కేంద్రం కుమ్మక్కుతో ఇసుక తవ్వకాల కేసు

యుపిలో అక్రమ ఇసుక తవ్వకాల కేసు విషయంలో కేంద్రం రాజకీయాలకు దిగుతోందని ఎస్‌పి సభ్యులు నినాదాలకు దిగారు. మోడీ సంకేతాలతోనే సిబిఐ ఇప్పుడు రంగంలోకి దిగిందని, తమ పార్టీ నేతను విచారించేందుకు రంగం సిద్ధం చేసిందని విమర్శించారు. ఈ గందరగోళం నడుమ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మధ్యాహ్నం వరకూ వాయిదా వేశారు. తరువాత కూడా సభలో ఇదే పరిస్థితి నెలకొంది. సభలో అరాచకంగా వ్యవహరించినందుకు స్పీకర్ ముగ్గురు అన్నాడిఎంకె సభ్యులను, ఒక టిడిపి సభ్యుడిని సస్పెండ్ చేశారు.

'యాక్సిడెంటల్ ప్రైమినిస్టర్' ట్రైలర్‌కు ఊరట

న్యూఢిల్లీ: 'ది యాక్సిడెంటల్ ప్రైమినిస్టర్' అనే సినిమా ట్రైలర్‌ను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం తిరస్కరించింది. దాన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యం గా (పిల్) దాఖలు చేయమని విజ్ఞప్తి చేసింది. పిటిషనర్ వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ విభు బఖ్రూ తోసిపుచ్చారు. పిటిషన్‌లో పేర్కొన్న వివాదాన్ని పిటిషనర్ పూర్తిగా పరిశీలించలేదని, ఈ అంశంపై తనకు వ్యక్తిగత ఆసక్తిలేదని పిటిషనర్ పూజా మహాజన్ పేర్కొన్నారని జడ్జి అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి కార్యాలయం ప్రతిష్టను దెబ్బతీసేదిగా ట్రైలర్ ఉందని, సినిమాటోగ్రఫీ చట్టంలోని అంశాలను దుర్వినియోగం చేశారని, ఈ ట్రైలర్‌వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చెడ్డపేరు వస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. బాలీవుడ్ నటుడు అనుపమ్‌ఖేర్ ...మన్మోహన్ సింగ్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని ప్రధాని మాజీ మీడియా సలహాదారు సంజయ బారు అదే పేరుతో రాసిన పుస్తకం ఆధారంగా తీశారు.

దుమారం రేపనున్న మరో రాజకీయ చిత్రం!



బెంగళూరు : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జీవితంపై తీసిన "ది యాక్సిడెంటల్ పిఎం"తో పాటు మరో చలన చిత్రం కూడా ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ దుమారం రేపనున్నది. అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ది యాక్సిడెంటల్ పిఎం ఇప్పటికే రాజకీయ వివాదాన్ని ఎదుర్కొంటోంది. ఈ చిత్రంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు తెలియచేస్తున్న విషయం తెలిసిందే. కాగా, భారతదేశ రెండవ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి రష్యాలో మరణించడం వెనుక ఉన్న అంతుబట్టని కారణాలపై మరో చిత్రం రూపొందుతోంది. దీనికి వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వం వహిస్తున్నారు. "1966 జనవరి 10న లాల్ బహదూర్ శాస్త్రి తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేశారు. కొద్ది గంటల తర్వాత ఆయన మరణించారు. నేటి వరకు ఈ మరణం వెనుక ఉన్న మిస్టరీని ఎవరూ తేల్చలేకపోయారు. ఆయన గుండెపోటుతో మరణించారా లేక విష ప్రయోగమా? అసలు వాస్తవం ఏమిటో ఆయన కుటుంబానికి కాని ప్రజలకు కాని తెలియకుండా దాచిపెట్టారు" అని దర్శకుడు అన్నారు.

కేరళలో మరో వివాదం

అగస్త్యర్‌కూడమ్ పర్వతాన్ని ఎక్కేందుకు మహిళలకు అనుమతి



తిరువనంతపురం: కేరళలో మరో వివాదం రాజుకోనున్నది. శబరిమలలోని అయ్యప్ప ఆలయంలోకి 50 ఏళ్ల వయసులోబడి ఉండే మహిళలకు ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో తీర్పును వ్యతిరేకిస్తున్న హిందూత్వ శక్తులకు, తీర్పును అమలు చేయాలన్న సంకల్పంలో ఉన్న రాష్ట్రంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొని ఉండగా, కేరళలోని రెండవ అత్యంత ఎత్తయిన పర్వతమైన అగస్త్యర్‌కూడమ్‌ను అధిరోహించడానికి మహిళలకు అవకాశం కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు చేపట్టడం వివాదంగా మారనున్నది. నెయ్యర్ అభయారణ్యంలో నెలకొని ఉన్న అగస్త్యర్‌కూడమ్ పర్వతాన్ని మహిళలు అధిరోహించడంపై ఉన్న నిషేధాన్ని హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర అటవీ శాఖ తొలగించింది. అయితే తాము సాంప్రదాయంగా కొలిచే అగస్త్య మహాముని విగ్రహం ప్రతిష్టించి ఉన్న కొండపైకి మహిళలు ప్రవేశించడానికి వీలు లేదని 'కని' అనే గిరిజన తెగ మొదటి నుంచి వాదిస్తోంది. హిందూ పురాణాలకు చెందిన అగస్త్య ముని పేరుతో ఆ పర్వతాన్ని అగస్త్యర్‌కూడమ్‌గా పిలుస్తారు. అగస్త్యర్‌కూడమ్ పర్వతాన్ని ఎక్కడానికి ప్రయత్నించే యాత్రికులపై లింగవివక్ష పనికిరాదని కేరళ హైకోర్టు నవంబర్ 30న తీర్పు చెప్పింది. దీంతో ఈ పర్వతారోహణకు మహిళలపై ఉన్న అనధికారిక నిషేధం తొలగిపోయింది. రాష్ట్రప్రభుత్వం కూడా పర్వతారోహణకు మహిళల ప్రవేశాన్ని అంగీకరిస్తూ అగస్త్యర్‌కూడమ్ అభయారణ్యంలో ఉందని, కొండపైన ఎటువంటి ఆలయం లేనందున ఆ ప్రాంతంలో ప్రార్థనలు జరిపే సాంప్రదాయ హక్కులేవీ కని తెగకు లేవని హైకోర్టుకు వివరించింది. 1,868 మీటర్ల ఎత్తయిన అగస్త్యర్‌కూడమ్ ఎక్కేందుకు ఏటా ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వ్యక్తులకు అటవీ శాఖ అనుమతి ఇస్తుంది. రెండు రోజుల పాటు సాగే ఈ ట్రెక్కింగ్‌లో పాల్గొనే అవకాశాన్ని శారీరకంగా బలంగా ఉండే 14 సంవత్సరాల వయసు పైబడిన మహిళలకే అటవీ శాఖ కల్పిస్తోంది.

రద్దయిన చట్టం కింద చర్యలా.. జైలుకు పంపిస్తాం



న్యూఢిల్లీ: ఇన్ఫర్మేషన్(ఐటి) టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66ఎను తాము గతంలోనే రద్దు చేసినప్పటికీ సెక్షన్‌ను అడ్డుపెట్టుకుని ఇంకా అరెస్టులు చేయడంపై సుప్రీంకోర్టు కేంద్రంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అబద్ధపు లేదా ఇతరుల పరువు ప్రతిష్టలను దెబ్బతీసే కథనాలను సోషల్ మీడియాలో వ్యాప్తి చేయడాన్ని నిరోధించడానికి ఉద్దేశించిన ఐటి చట్టంలోని సెక్షన్ 66ఎ కింద అరెస్టు చేసి మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. అయితే ఈ సెక్షన్ రాజ్యాంగంలోని భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఉల్లంఘిస్తోందని పేర్కొంటూ సుప్రీంకోర్టు 2015లో దీన్ని రద్దు చేసింది. అయితే, రద్దయిన ఈ సెక్షన్ కింద ఇప్పటికీ అమాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని ఒక వ్యక్తి వేసిన పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రోహిన్‌తన్ ఫాలి నారిమన్ ముందుకు రాగా ఆయన తీవ్రంగా స్పందిస్తూ పిటిషనర్ చేసిన ఆరోపణ నిజమైతే మిమల్ని తీవ్రంగా అభిశంసించాల్సి ఉంటుందని కేంద్రంపై మండిపడ్డారు. "అరెస్టులకు ఎవరు ఆదేశించారో వారందరినీ జైలుకు పంపిస్తాము. చాలా కఠిన చర్యలు తీసుకుంటాము," అని న్యాయమూర్తి హెచ్చరించారు. కేంద్రం సమాధానం కోసం కోర్టు నాలుగు వారాల వ్యవధి ఇచ్చింది.

మోడీ నియంతృత్వ పాలనను విసిరేయండి



న్యూఢిల్లీ: నియంతృత్వ, అప్రజాస్వామిక పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని విసిరివేయాల్సిన సమయం ఆసన్నమైందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పిలుపు నిచ్చారు. గడచిన ఐదేళ్లలో ప్రధాని నరేంద్ర మోడీ రాజకీయ ప్రత్యర్థులు ఎదుర్కొన్న వేధింపులను విస్మరించవద్దని ప్రజలను ఆయన అర్థించారు. "మోడీ ప్రభుత్వం తన చివరి రోజుల్లో సిగ్గులేకుండా సిబిఐని అఖిలేష్ యాదవ్‌పై ప్రయోగించడాన్ని గమనిస్తే గడచిన ఐదేళ్లలో మోడీ రాజకీయ ప్రత్యర్థులు ఎదుర్కొన్న వేధింపులను గుర్తు చేసుకోవలసి ఉంటుంది. ఈ నియంతృత్వ, అప్రజాస్వామిక పాలనను విసిరివేయాల్సిన సమయం ఆసన్నమైంది" అని అరవింద్ ఒక ట్వీట్‌లో తెలియచేశారు.

డైనోసార్ల గురించి బ్రహ్మ వేదాలలో చెప్పాడట!



చండీగఢ్: కౌరవులు మొట్టమొదటి టెస్ట్‌ట్యూబ్ బేబీలని చెప్పి శాస్త్రవేత్తల నుంచి విమర్శలను ఎదుర్కొన్న ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి నాగేశ్వరరావు ఉదంతం మరువకముందే పంజాబ్ యూనివర్సిటీలోని జియాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ ఆషూ ఖోస్లా మరో అడుగు ముందుకేసి బ్రహ్మదేవుడు ఈ విశ్వంలోనే అత్యంత గొప్ప శాస్త్రవేత్త అని, ఆయనకు డైనోసార్ల గురించి కూడా తెలుసునని చెప్పి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఫగ్వారాలోని యవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరుగుతున్న 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో తన పరిశోధనా పత్రాన్ని సమర్పించిన ఖోస్లా భారతదేశంలో డైనోసార్ల మూలాల గురించి, వాటి మనుగడ గురించి గడచిన 25 ఏళ్లుగా తాను పరిశోధన చేస్తున్నానని తెలిపారు. "విశ్వ సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడికి తెలియనిదంటూ ఏమీ లేదు. డైనోసార్ల గురించి ఆయన తెలుసు. వాటిని వేదాలలో కూడా ఆయన పేర్కొన్నాడు. భూమిపైన డైనోసార్లు ఉన్నాయని ప్రపంచంలో అందరి కన్నా ముందు కనుగొన్నది బ్రహ్మే. ఈ ప్రపంచం నుంచి కనుమరుగు కావడానికి ముందు డైనోసార్లు భారతదేశంలో మనుగడ సాగించాయి. రాజసారు అనే పేరుతో ఒక డైనోసార్ మన భారతదేశంలో ఉండేది" అని ఆయన చెప్పుకొచ్చారు. డైనోసార్లు భూమి నుంచి కనుమరుగై 6.5 కోట్ల సంవత్సరాలు అయినప్పటికీ కళ్లు మూసి ధ్యానం చేసే సమయంలో, తన అతీంద్రియ ఆధ్యాత్మిక శక్తుల వల్ల డైనోసార్ల గురించి బ్రహ్మదేవుడు వేదాలలో రాయగలిగాడని ఖోస్లా చెప్పారు. "ఎవరు నమ్మినా నమ్మకపోయినా వేదాలలో డైనోసార్ల గురించి ప్రస్తావన ఉందన్నది వాస్తవం. అంతేందుకు..డైనోసార్ పేరు కూడా సంస్కృతంలో నుంచి పుట్టిందే. 'డైనో' అంటే భయంకరం అని అర్థం దాన్ని అనువదిస్తే దయ్యం అని కూడా అర్థమొస్తుంది. అలాగే 'సార్' అంటే బల్లి అని అర్థం. దాన్నే మరో రకంగా రాక్షసి అని కూడా అనవచ్చు. ఆ ప్రకారంగా ఈ భూమిపైన జీవులన్నిటి గురించి వేదాలలో రాసి ఉంది" అంటూ ఆయన ముక్తాయించారు. ఖోస్లా మాటల ప్రకారం బ్రహ్మ దేవుడు వేదాలను సుమారు 25,00030,000 సంవత్సరాల క్రితం రాయగా డైనోసార్ల అంతం 6.5 కోట్ల ఏళ్ల క్రితమే జరిగింది.

బిజెపి కుట్రలకు బెదరవద్దు : మాయావతి

మైనింగ్ స్కాంలో అఖిలేష్‌పై సిబిఐ దర్యాప్తు?

న్యూఢిల్లీ: ఎన్నికలపొత్తు గురించి లాంఛనంగా ప్రకటించడానికి ముందు బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌కు ఫోన్ చేసి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. మైనింగ్ కుంభకోణంలో సిబిఐ ఆయనను ప్రశ్నించే అవకాశముందని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో మాయావతి ఫోన్ చేసి అలాంటి ఎత్తుగడలకు బెదిరిపోవద్దు. బిజెపి తన రాజకీయ ప్రత్యర్థులపై అలాంటి ఎత్తులు వేస్తుంటుంది. కాంగ్రెస్ పార్టీ మాదిరే బిజెపి కూడా ప్రత్యర్థుల్ని తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో వారు బిజెపికి గుణపాఠం నేర్పిస్తారు' అని మాయావతి అఖిలేష్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఎస్‌పి, బిఎస్‌పి అగ్రనాయకత్వాలు సమావేశం అవుతాయని తెలిసిన వెంటనే బిజెపి ప్రభుత్వం సిబిఐ వాడుకొని, అఖిలేష్ యాదవ్‌పై ఉన్న పాత మైనింగ్ కుంభకోణంపై దర్యాప్తు జరిపించేందుకు ఎఫ్ఐఆర్ రెడీ చేసిందని శనివారం సమాచారం అందింది. ఇది ఎస్‌పి, బిఎస్‌పిని అప్రతిష్టపాలు చేసే చర్య కాదా? అని మాయావతి ప్రశ్నించారు. ఇలా ఉండగా, సిబిఐ దాడులు రాజకీయ దురుద్దేశపూరితమైనవని అఖిలేష్ అన్నారు. ఎస్‌పి, బిఎస్‌పి ఎన్నికల పొత్తుపై వారంలోగా ప్రకటన వెలువడుతుందని, కూటమిలో కాంగ్రెస్ చేరికపై తను, మాయావతి నిర్ణయం తీసుకుంటామని అఖిలేష్ తెలిపారు. అఖిలేష్‌పై సిబిఐ వైఖరిని కాంగ్రెస్ నేత ఆజాద్ ఖండించారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666